
# లోకమెరుగని ఏసు మరోరూపం

## (అదర్ సైడ్ ఆఫ్ జీసస్)



# OTHER SIDE OF JESUS

UNKNOWN JESUS TO THE WORLD

# లోకమెరుగని "ఏసు మరోరూపం"

## (అదర్ సైడ్ ఆఫ్ జీసస్)

రచన

కరుణాకర్ సుగ్గున


Website : shivashakthi.org

Youtube : YouTube.com/SHIVA SHAKTHI

Facebook : Facebook.com/karunakar.sugguna

Email : karunakarsugguna@gmail.com

లోకమెరుగని "ఏసు మరోరూపం"

మొదటి ముద్రణ : జూలై, 2017
ప్రతులు : 50,000

గ్రంథకర్త & ప్రకాశకులు:
కరుణాకర్ సుగ్గున
సుగ్గునలంక, కొల్లూరు మండలం
గుంటూరు జిల్లా - 522324
సెల్ : 9492990622

ముద్రణ :
వ్యాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్
రెహ్మాన్ స్ట్రీట్, అరండల్‌పేట్
విజయవాడ - 2

'దర్పణం' ప్రచురణలు
'శివశక్తి' ఆర్గనైజేషన్
హైదరాబాద్

## విషయ సూచిక

## బైబిల్‌లోని పేర్లు-వారి పాత్రలు

యెహోవా - బైబిల్ దేవుడు.

**పాత నిబంధనలోని ప్రవక్తలు:**

మోషే, యెహోషువా, సమూయేలు, యెషయా, యిర్మియా, యెహజ్కేలు, మీకా, హోషయా, యోనా, జెకర్యా, మలాకి.

**సౌలు:** ఇశ్రాయేలీయులపై మొట్టమొదటి రాజు.

**దావీదు** : రాజు మరియు ప్రవక్త.

**ఏసుని గురించి సువార్తలు వ్రాసిన నలుగురు శిష్యులు:**

మత్తయి, మార్కు లూకా, యోహాను.

యోసేపు - యేసు తండ్రి.

మరియ(మేరి) - యేసు తల్లి.

పౌలు - అపొస్తులుడిగా పిలవబడిన క్రైస్తవ ప్రచారకుడు.

## రచయిత పరిచయం

మాది గుంటూరు జిల్లా తెనాలి దగ్గరలో ఒక చిన్న పల్లెటూరు. మా పూర్వీకులు హిందువులే అయినప్పటికీ మా తల్లిదండ్రులు మతం మారడంవల్ల చిన్నప్పటినుంచి నేను చర్చ్‌కి వెళ్ళేవాడిని. నామకరణం కూడా చర్చ్‌లోనే పాస్టర్‌గారి ఆధ్వర్యంలో జరిగింది.

సహజంగా నాలో చిన్నతనం నుంచి దైవచింతన ఎక్కువగానే ఉండేది. బైబిల్‌ని చదువుతున్నప్పుడు అప్పటికి నాకు ఉన్న ఇంగిత జ్ఞానానికి సబబు అనిపించని విషయాలు కొన్ని గమనించాను. వాటిని సందేహాల రూపంలో తోటి క్రైస్తవులను ప్రశ్నించేవాడిని. ఎవరూ సరైన సమాధానం చెప్పకపోగా, నేనే తప్పుగా ఆలోచిస్తున్నాను అనేలా మాట్లాడేవారు. వారు చెప్పే విషయాలను గ్రుడ్డిగా నమ్మకుండా ప్రశ్నించడం పెద్ద అపరాధంగా సాతాను ప్రేరణగా పరిగణించేవారు. దాంతో బైబిల్ గురించిన సత్యాసత్యాలను మరింత లోతుకు వెళ్ళి తెలుసుకోవాలని నాలో పట్టుదల పెరిగింది. బైబిల్‌ని విస్తృతంగా పరిశోధించడం జరిగింది. అప్పుడు నాకు ఒక విషయం అర్థమయింది. బైబిల్‌ని ఎవరూ కూడా ఉన్నది ఉన్నట్లుగా చెప్పడంలేదు.

ప్రస్తుత కాలంలో క్రైస్తవులు నిజదేవుడు, నిజదేవుడు అంటూ ఇతర మతాలను దూషిస్తూ ఇతరుల విశ్వాసాలను కించపరుస్తూ, బైబిల్ ఒక్కటే పరిశుద్ధ గ్రంథం అంటూ విశృంఖలంగా ప్రచారం చేస్తున్నారు చిన్నప్పుడు నాలోకూడా హిందూ దేవుళ్ళపై ద్వేషాన్ని పుట్టించి, విషబీజాలు నాటారు. అయితే నా అదృష్టం వల్ల వారి సాలెగూటినుండి బయటపడగలిగాను. ఇంతేకాకుండా వారి దుష్ప్రచారాలను ఖండించాలని, నిలదీయాలని ధృఢంగా నిర్ణయించుకున్నాను. ఈ క్రమంలో సత్యాన్వేషణమండలి శ్రీ పుట్టా సురేంద్రబాబు గారితో పరిచయం ఏర్పడింది. సురేంద్రబాబుగారు ఈ పుస్తకం యొక్క రచనలో సహకరించడమే కాక, ముందుమాటని కూడా అందించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

నా మొదటి రచనగా “బైబిల్ దేవుని నిజస్వరూప స్వభావాలు” అనే పుస్తకం విడుదల అయింది. ఈ పుస్తకానికి అమితమైన ప్రజాదరణ వచ్చింది. నా ఈ రెండవ పుస్తకానికి కూడా అంతకుమించిన ఆదరణ వస్తుందనే విశ్వాసం ఉంది.

క్రైస్తవులు, క్రైస్తవ వ్యతిరేకులు విమర్శనాదృష్టితో గ్రంథాలను చదివే సత్యాన్వేషకులు మాయొక్క ఈ పుస్తకాన్ని తులనాత్మకంగా చదివి యోగ్యమైన మీ సమీక్షను మాకందించవలసినదిగా కోరుచున్నాము. అందరిలోనూ బైబిల్ చదవాలనే జిజ్ఞాసని కలిగించడమే ఈ పుస్తక రచన వెనుక ఉన్న మాయొక్క ప్రధాన ఉద్దేశం.

– కరుణాకర్ సుగ్గున

# ముందుమాట

**యుక్తాయుక్త విచక్షణాశీలురైన చదువరులారా!**

బైబిల్‌పై పుస్తకాలను ఒక వరుస క్రమంలో ప్రజలముందుకు తీసుకురావాలన్న మా కార్యక్రమంలో ఇది రెండవ పుస్తకం. మొదటి పుస్తకం "బైబిల్ దేవుని నిజ స్వరూప స్వభావాలు" మీలో కొంద్దరైనా చదివి ఉండవచ్చు. చదవనివారు ఉంటే దానినీ తెప్పించుకొని చదవండి. ఈ రచనలన్నింటి వెనుక మమ్మల్ని ప్రేరేపిస్తున్న అంశం బైబిల్‌ను యథాతథంగా సమాజం ముందుంచాలన్నదే. రకరకాల కారణాలవల్ల బైబిల్‌లో ఉన్న విషయాలే కొన్ని మరుగున పడి ఉన్నాయి. మరికొన్నయితే మరుగు పరచబడుతున్నాయి కూడా. ఇది ఒక పార్శ్వమైతే, బైబిల్‌లో లేనివెన్నో బైబిల్ పేరిట ప్రచారం చేయబడుతుండటం మరో పార్శ్వం. నిజానికి ఈ రెండూ అడ్డగోలు పనులే. ఈ విధానం వెనుక ఎంతోకొంత అనైతికతా, స్వార్ధ ప్రయోజనాకాంక్ష కలగలసి ఉంటాయి.

నిజానికి ఏ మత గ్రంథమైనా తనను ఆసాంతం యథాతథంగా అర్ధం చేసుకోమనే చెపుతుంది. తాను చెప్పినవి వదిలివేయవద్దనీ, చెప్పనవి జతచేయవద్దనీ ఉపదేశిస్తుంది. ఇంకా చెప్పాలంటే, తీసేసినా కలిపినా ఊరుకోనని హెచ్చరిస్తుంది కూడా. బైబిలైతే ఈ విషయంలో మరింత స్పష్టమైన ప్రకటనే చేసింది.

**<u>ప్రకటన-22:18,19</u> ఎవడైననూ వీటితో మరి ఏదైనను కలిపినయెడల, ఈ గ్రంథంలో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వానికి కలుగజేయును. ఎవడైననూ... ఏదైనా తీసివేసినయెడల దేవుడు ఈ గ్రంథంలో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండా చేయును.**

గొప్ప ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే; ఈనాడు ఇప్పుడిప్పుడే బట్టీపట్టి, ప్రసంగాలు చేయటం మొదలెట్టిన చిన్నచిన్న కుటీరాలలో వాక్యం చెప్పే వారినుండి, పెద్దపెద్ద క్రైస్తవ సంఘాలుగా తీరి కూర్చున్న వాటిలోని ప్రధాన ప్రసంగీకుల వరకు,

**1) బైబిల్‌లో ఉన్నవి చాలావరకు వదిలివేయడము,**

**2) బైబిల్‌లో లేనివి కలపడము** అన్న రెండింటినీ చేస్తున్నారు. కానీ ఎప్పుడూ, ఎక్కడా, ఎవరికీ పై ప్రకటన గ్రంథంలోని తెగుళ్ళు సోకినట్లు ఋజువు లేదు. కనుక అదంతా ఉత్తుత్తి మాటేనని తేలిపోయింది. కొద్దిగా అతితెలివి గలవాళ్ళు; అలాంటి తెగుళ్ళు తమపైకి రాలేదు గనుక తాము బైబిల్‌లోనివి తీసేసినట్టు గానీ, కలిపినట్లు గానీ కాదని అదరగండంగా మాట్లాడేస్తారు. కానీ వారందరికీ తెలుసు తాము కొన్ని వదిలేస్తున్నామని, కొన్నింటిని కలిపామని. ఇప్పటికి ఏమీకాలేదు గనుక, ఇకముందు ఏమీకాదులే అన్న భరోసానే తప్ప మరో కారణమేమీ లేదు.

అదిగో, అలా పనికట్టుకుని మరుగుపరుస్తున్న బైబిల్ వాస్తవాలను బహిర్గతపరచాలన్నదే మా ఉద్దేశ్యం.

సామాన్య జనానికి చెవినిల్లు కట్టుకుని క్రైస్తవ ప్రచారకులు వినిపించిన ఏసు స్వరూప స్వభావాలకు వేరుగా బైబిలులోనే ఏసును గురించిన మరో రూపమూ ఉందని తెలియజేయాలన్నదే ఈ రచన ఉద్దేశ్యము. క్రొత్త నిబంధన పుస్తకం ఒకింత చిన్నది కనుక, ఏసుతో ముడిపడిఉన్న పలు విషయాలకు చెందిన సమాచారాన్ని తగినంతగానే ఇందులో పొందుపరిచాడు కరుణాకర్. అయితే ఏసుకు సంబంధించిన ఒక సాధారణ రూపం ప్రజలలో స్థిరపడి ఉంటుంది గనుక అతను చూపించబోయే మరో పార్శ్వాన్ని చూడడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. మీరంతా రాగద్వేషాలు లేకుండా, మామీద శత్రుదృష్టీ, మిత్రదృష్టీ లేకుండా, ఏసు గురించి మేమందిస్తున్న సమాచారం బైబిలులో ఉన్నదేనా? కాదా? అన్న దృష్టినుండి వీటిలోని వివరాలను బైబిలుతో పోల్చి చూసుకుంటూ జాగ్రత్తగా పరిశీలించండి.

మా దృష్టికందినంతలో దీనిలో బైబిలు వచనాలకు విరుద్ధమైన వివరణలేమీ లేవు. ఉన్నవీ లేనివీ కలిపి ఏదో మసిపూసి మారేడు కాయ చేయాలని మేమనుకోనూ లేదు. అయినా మానవ తప్పిదాలు జరిగే అవకాశాలను కాదనకూడదు గనుక మా మొదటి పుస్తకంలో వెలిబుచ్చిన భావాన్నే ఇక్కడా చెపుతున్నాం. దీనిలో ఎక్కడైనా బైబిలు వాక్యాలకు విరుద్ధమైన వివరాలున్నాయని మీకు అనిపిస్తే వాటిని మా దృష్టికి తెండి. మీరిచ్చిన సమాచారం ఆధారంగా మాకు మేముగా గానీ, మీతో కలిసిగాని వాటిని మరోసారి పరిశీలించి, నిజంగానే అలాంటి పొరపాటు జరిగుంటే, ఆమేరకు వెంటనే ఒక సవరణ ప్రకటన చేస్తాము. మరియు అట్టి వాటిని తొలగిస్తాము.

**మిత్రులారా! ఏసుకు సంబంధించి బైబిలులో ఉండే మరుగున పడిఉన్న ఎన్నో విషయాలను మీముందుకు తేగలిగినందుకు ఈ రచన మాకెంతో సంతోషాన్ని, సంతృప్తినీ ఇచ్చింది, ఇస్తోంది, ఇస్తూనే ఉంటుంది. బైబిలు విషయంలో సమగ్ర అవగాహనకై యత్నించే అధ్యయనపరులకు, ఇది ఎంతో కొంతైనా దోహదపడుతుందన్నది నిజం.**

మత, తాత్విక ధోరణులకు చెందిన సిద్ధాంతాలను అర్ధం చేసుకోవడానికి నేరుగా మూల గ్రంథాలను అధ్యయనం చేయడమొక్కటే సరైంది అన్నది మా మండలి సిద్ధాంతం. ఆ ఉద్దేశ్యంతోనే, కరుణాకర్ వ్రాసిన ఈ పుస్తకాన్ని పెద్ద ఎత్తున సమాజంలోకి తీసుకెళదామనుకుని, దీనికి ముందుమాట రాయడానికి అంగీకరించాను. ఏదైనా ఒక సిద్ధాంతాన్ని ఉన్నదున్నట్లుగా అర్ధం చేసుకోవడానికి మూల గ్రంథాన్నే నిశితంగా చూడడం, అప్పుడుకూడా ఇతరుల కళ్ళతో కాకుండా, సొంత కళ్ళతోనూ, అదీ రంగుటద్దాలు లేని

కళ్ళతోనూ చూడాలి అన్నది జ్ఞానక్షేత్రంలో అత్యంత ప్రాథమిక నియమం. ఆ దృష్టి నుండే, ఈ గ్రంథాలను అనుకూల ప్రతికూల దృష్టులను పెట్టుకోకుండా, తటస్థ లేదా నిష్పాక్షిక దృష్టి నుండి పరిశీలించండని చదువరులకు సూచించాను.

రచన విషయంలో కరుణాకర్‌కు, "వీలైనన్ని ఎక్కువ రిఫరెన్సులివ్వు, వీలైనంత తక్కువగా వివరించు" అన్న సూచన చేశాను.

మా 1 వ పుస్తకం లక్ష ప్రతుల ముద్రణ గురించి, నోటితుత్తర తసం ఉన్న కొందరు అంత డబ్బు కరుణాకర్‌కు ఎక్కడిది? దీని వెనుక ఇంకెవరో పని చేస్తున్నారు. ఇతడు వాళ్ళ పనిముట్టు మాత్రమేనంటూ, అక్కడేదో జరక్కూడంది జరిగినట్లు పోస్టింగులూ, ప్రసంగాలు చేసారు. నిజానికి ఈ రకమంతా గలీజు మనుషులేనన్నది నిజం.

ఒకప్రక్క ప్రసంగాలూ, ప్రార్ధనలాధారంగానే బ్రతుకులు ఈడుస్తూ, సంపదలు పెంచుకుంటూ, చివరకు అణగారిన వర్గాల, శ్రమజీవుల చెమటలోనూ **దశమభాగాన్ని** కొట్టేస్తూ, బ్రతికేస్తున్న ఈ మంద, కరుణాకర్ పుస్తక ప్రచురణ విషయంలో, వెనకుండి ఎవరో నడిపిస్తున్నారనడం, దొంగే, దొంగ దొంగ అనడంలానో; గుమ్మడికాయల దొంగేడంటే భుజాలు తడుముకున్నట్లుగానూ లేదూ!

నిజానికి, కరుణాకర్ పుస్తకాన్ని ఒకటికి నాలుగుసార్లు పరిశీలించిన విజ్ఞులొకరు వారంతట వారుగా ముద్రణ వ్యయాన్ని భరించారు. ఈనాటి వరకూ కరుణాకర్ బ్రతుకుదెరువు కోసం తనకు చేతనైన పనులు చేసుకుంటూనే బ్రతుకుతున్నాడు. తనసొంత సంస్థ శివశక్తి బృందం కొంత ఆసరాగా ఉంటున్నారు. మాటలు చెప్పి బ్రతుకు ఈడ్చుతుండేవారికి ఇలాంటి నిజాయితీ బ్రతుకులు అర్ధంకావు. అసత్యాలు మాట్లాడటానికి సిగ్గుండాలి. వాళ్ళకు ఎందరు ఎంత బుద్ధి గరిపినా, ఎంత గడ్డిపెట్టినా ఏమార్పు రాదు. వాళ్ళలో మార్పు వస్తుందని కాదుగాని చదువరులకు విషయం తెలుస్తుందనే ఈ ముందుమాటలో ఈ అంశాన్ని పొందుపరిచాను. నా పరిశీలనలో అతడొక నిజాయితీపరుడని తేలాకనే అతని కార్యానికి మా మండలి పరిమితులకు లోబడి, చేయూతనివ్వడానికి సిద్ధపడ్డాను.

ఆయా మత గ్రంథాలను ప్రస్తుతానికి బైబిల్‌ను ఎవరికివారే సొంతంగా చదివేలా ప్రేరేపించాలన్నది మా ముఖ్యోద్దేశం. అందుకు మీలో ఉత్సాహాన్ని పుట్టించడానికీ, బైబిల్ పేరున చెప్పబడని, బైబిల్‌లోనే ఉన్న కొన్ని విషయాలను మీ ముందుంచే పనిచేస్తూ వస్తున్నాము.

**1) బైబిల్ దేవుని నిజస్వరూప స్వభావాలు, 2) లోకమెరుగని ఏసు మరో రూపం.**
అన్న రెండు రచనల్లో మేము చేసింది అదే ఇకముందు ఈ వరుసలో రానున్న వాటి లక్ష్యమూ ఇదే.

మా ఈ రెండో పుస్తకం తొలి విడతగా **'50'** వేల **ప్రతులతో** మీ ముందుకు వచ్చింది. ఇప్పటి మా అంచనాల ప్రకారమైతే 5,6 నెలలలోపే మలి ముద్రణ అవసరం ఏర్పడుతుంది. ఇప్పుడూ పుస్తకాన్ని ముద్రణ వ్యయానికే అందించడానికి సిద్ధపడ్డాము. ఈ పుస్తకానికున్న వాస్తవ విలువనుబట్టి దీనిని కొనండి-కొనిపించండి, చదవండి-చదివించండి. స్తోమత ఉన్నవారు మరిన్ని పుస్తకాలు కొని పంచండి.

**'జై భారత్! సత్యమేవ జయతే'** అన్న సూక్తిని నిండు హృదయంతో మాటిమాటికి స్మరిస్తున్నాము మేము. మా లెక్క ప్రకారం ఈ దేశంలోని ప్రతి పౌరుడు తలకెక్కించుకోవల్సిన భావన అది.

**"జై భారత్! సత్యమేవ జయతే నా నృతమ్"** - సత్యాన్వేషణలో మీ సురేంద్ర.

# ఉపోద్ఘాతం

**"అదర్ సైడ్ ఆఫ్ జీసెస్"** అనగా ఏసు లో ఉన్న మరొక పార్శ్వం (మరోవైపు) అని అర్థం. అనగా ఏసులో ప్రపంచానికి తెలియని మరో భాగం ఉంది.

ఏసు లో ప్రపంచానికి తెలియని మరొక భాగం ఉంది అని ఎలా చెప్పగలరు? ఏమిటి మీకాధారం? ప్రపంచంలో ఇతరులెవ్వరూ చదవని ఏసుని గురించిన పుస్తకం మీరు చదివారా? లేక ప్రత్యక్షంగా ఇశ్రాయిల్ వెళ్ళి ఏమైనా కనుగొన్నారా? ఏసేమైనా మీ కల్లోకొచ్చి ఎవరికీ చెప్పని విషయాలు మీతో చెప్పాడా? అని ఎవరైనా అడగవచ్చు.

దానికి నా సమాధానం ఏమిటంటే; ఏసులో ప్రపంచం చూడని మరొక కోణం **ఇంకా చెప్పాలంటే అనేక కోణాలు ఉన్నాయి అనడానికి ఆధారం ఎవరూ చదవని పుస్తకాన్ని చదవడమో, ఇశ్రాయిల్ వెళ్ళి పరిశోధించడమో కాదు. "బైబిలే ఆధారం".**

బైబిల్ లోనే క్రైస్తవ ప్రపంచం ఏసు విషయంలో పట్టించుకోకుండా విడిచిపెట్టిన మరోభాగం ఉంది. మరుగున పడిఉన్న లేదా మరుగుపరచబడిన ఆ భాగాన్ని వెలుగులోకి తీసుకురావడమే ఈ రచన యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

అదేంటి? బైబిల్ లోనే ప్రపంచం చూడని ఏసు ఉన్నాడా? ప్రతిరోజు బైబిల్ చదివేవారు కోట్లలో ఉన్నారు. వారెవ్వరికి కనపడని విషయాలు మీకు మాత్రమే కనపడ్డాయా? అని మళ్ళీ సందేహం రావచ్చు.

నిజమే! బైబిల్ని ప్రతిరోజు **'క్రైస్తవులు అనబడేవారు'** చాలా మంది చదువుతున్నారు. అయితే వారంతా ఓపెన్ మైండ్‌తో బైబిల్ చదవడం లేదు. తమ తమ మతబోధకులు చూపించిన దారిలో ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మత బోధకులు ఇచ్చిన కళ్ళద్దాలు పెట్టుకొని బైబిల్ చదువుతున్నారు. ఇక వారికి విషయం ఉన్నది ఉన్నట్టుగా కనబడే అవకాశం ఎక్కడ ఉంది?. ఇక్కడ నేను చెప్పదలచుకున్న విషయం ఏమంటే క్రైస్తవ మతబోధకులు బైబిల్లో ఉన్న ఏసుని ఒక వైపు మాత్రమే ప్రపంచానికి చూపిస్తున్నారు. అందువల్ల ప్రపంచానికి కనబడని ఏసు చాలావరకు బైబిల్లోనే మిగిలిపోయాడు.

ఏసు ఒక సందర్భంలో ఆనాటి మతబోధకులనుద్దేశించి చెప్పిన ఒక మాట వీరికి కూడా సరిగ్గా సరిపోతుంది.

**'అయ్యో ధర్మశాస్త్రోపదేశకులారా! మీరు జ్ఞానమును తాళపు చెవిని ఎత్తుకుపోయిరి. మీరును లోపల ప్రవేశింపరు. ప్రవేశించువారిని అడ్డగింతురు'. -(లూకా-11:52)**

బైబిల్లో ఏముందో తెలుసుకుందామనుకునే వారు అందులోకి ప్రవేశింపకుండా ఈ మతబోధకులు తాళపుచెవిని ఎత్తుకుపోయారు. అందుకే బైబిల్లో ఉన్న ఏసు గురించిన

అనేక విషయాలు చాలామంది సాధారణ క్రైస్తవులకు తెలియకుండా రహస్యంగానే మిగిలిపోయాయి. ఏసు చెప్పిన కొన్ని విషయాలను పూర్తిగా మరుగుచేసి, ఇంకొన్ని విషయాలకు మసిపూసి మారేడుకాయ చేసి, అమాయకులైన తమ అనుచరులకు బోధిస్తూ అనేకులను చీకట్లోకి నడిపిస్తున్నారు.

ఏసుచెప్పిన మరోమాట కూడా ఈ మత బోధకులకు అతికినట్టుగా సరిపోతుంది. **'వారి జోలికి పోకుడి వారు గ్రుడ్డివారై ఉండి గ్రుడ్డి వారికి త్రోవ చూపు వారు. గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి త్రోవ చూపిన యెడల వారిద్దరూ గుంటలో పడుదురు గదా'. (మత్తయి-15:14)**

అయితే వీరు ఎందుకిలా ఏసు చెప్పిన మాటల్ని కలగాపులగం చేసి, గజిబిజి చేస్తున్నారు? వీరికా అవసరం ఏమిటి? అనంటే ముందుముందు క్రమక్రమంగా ఈ పుస్తకంలోనే ఈప్రశ్నకు సమాధానం లభిస్తుంది. అయితే అందుకు మీరు ఈ పుస్తకాన్ని శ్రద్ధపెట్టి నిశితంగా పరిశీలిస్తూ చదవవలసి ఉంటుంది.

ఒకపక్క బైబిల్ ప్రచారకులు మరుగుపరుస్తున్న లేదా వక్రీకరిస్తున్న అంశాలే ఒక తలనొప్పిగా తయారైతే, మరోపక్క ఏసు చేసిన కొన్ని ప్రకటనలు, సంభాషణలు ఎంతో మార్మికంగా ఉంటూ గందరగోళానికి దారి తీస్తాయి, సరళంగా అర్థంకావడానికి వీలులేకుండా ఉంటాయి. ఈ విషయాన్ని బైబిలే చెబుతుంది. బైబిల్ పై లోతైన అధ్యయనంతో పాటు ఆనాటి సామాజిక కాలమాన పరిస్థితులపై కూడా కొంత అవగాహన ఉంటే తప్ప వాటిని విశదీకరించడం సాధ్యంకాదు. ఏసు చెప్పిన అలాంటి నిగూడార్థమైన అంశాలను కూడా కొన్నింటిని ఈ పుస్తకంలో మీ దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశాను.

**'నేను ఏ విషయం చెప్పినా దానికి ఆధారం బైబిలే'.** ఈ ఒక్క విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇందులో నేను చెప్పే ప్రతి అంశం సరైనదో కాదో సరిచూసుకోగలరని ఆశిస్తూ... - **కరుణాకర్ సుగ్గున.**

*'ఏలీ ఏలీ లామా సబక్తానీ!'*

ఇప్పటికి సుమారు రెండువేల సంవత్సరాల క్రితం బలవంతంగా శిలువ వేయబడిన సందర్భంలో శిలువపై నుండి తన మరణ సమయంలో చిట్టచివరి ఘడియల్లో ఏసు పలికిన మాటలవి.

***నాదేవా! నాదేవా! నన్నెందుకు చేయి విడిచితివి?*** అని ఆ మాటలకి అర్థం.

☞ ఈ మాటను పట్టించుకోవలసినంత శ్రద్ధగా పట్టించుకోగలిగితే క్రైస్తవ విశ్వాసం పాలిట పిడుగుపాటిది.

☞ క్రైస్తవ విశ్వాసం అనే చిన్న కుటీరం పాలిట సుడిగాలి లాంటి మాట ఇది.

☞ ఎంత పెద్ద క్రైస్తవ ప్రసంగీకుడనైనా నిశ్చేష్టునిగా చేసే మాట ఇది.

**ఒక్కమాటలో చెప్పాలంటే క్రైస్తవ విశ్వాసం మొత్తాన్ని కూడా అతలాకుతలం చేయగలిగే మాట ఇది.**

అయినా క్రైస్తవ సంఘంలో ఎవరికీ చీమకుట్టినంత బాధైనా కలిగినట్టుగా కనిపించదు. పట్టించుకుంటే ప్రళయం వచ్చేంత పెద్ద ప్రకటనే అయినా, ఆయా సందర్భాలలో దాన్ని పదేపదే చదువుతూ కూడా ఆ మాటల భావాన్ని అలవోకగా పక్కనపెట్టి లేదా కప్పదాటు వ్యవహారంలా దానిని దాటి వెళ్ళిపోతుంటారు.

**మహిమాన్వితుడిగా, కారణజన్ముడిగా, దేవుని కుమారునిగా, చివరకు దేవుడిగా కూడా ప్రచారంలో ఉన్న ఏసు ఇలా దీనంగా ఆర్తనాదం చేయడమేంటి?** అని కనీస స్పృహతో ఆలోచించేవారెవరికైనా సందేహం రావాలి కదా! ఇందుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి? అసలేం జరిగింది? ఇలాంటి అనేక ప్రశ్నలు మొలకెత్తుతాయి సహజంగా. వీటికి సమాధానం కావాలంటే మనం 3,500 సంవత్సరాల క్రితం నాటి ఈజిప్టుకి వెళ్లాలి.

# 1. ఇశ్రాయేలీయుల ప్రస్థానం

ఇప్పుడున్న ఈజిప్టునే తెలుగు బైబిల్లో ఐగుప్తుగా పిలిచారు. 3,500 సంవత్సరాల క్రితం ఇశ్రాయేలీయులు అనబడినవారు ఐగుప్తుకి వలస వచ్చారు. అక్కడ వారు బాగా వృద్ధిచెంది విస్తరించారు.

భవిష్యత్తులో వారివల్ల తమకు ప్రమాదం వస్తుందేమో అని భావించిన ఐగుప్తు రాజు ఫరో ఇశ్రాయేలీయుల జనాభా విస్తరించకుండా అణచడానికి వారితో వెట్టిచాకిరి చేయిస్తూ, వారికి పుట్టిన సంతానంలో మగపిల్లల్ని నదిలో పారేయిస్తుండేవాడు. ఇలా జరుగుతున్న సమయంలో ఇశ్రాయేలీయులలో పుట్టిన ఒక పిల్లవాడు నాటకీయంగా ఫరో రాజకుమార్తె వద్దనే పెరుగుతాడు. ఆతని పేరు మోషే.

ఈ మోషే పెద్దవాడయ్యాక అతను గొర్రెలు మేపుతున్న అరణ్యంలో ఒకరోజు యెహోవా అనే దేవుడు అతనికి కనపడి ఇశ్రాయేలీయులని ఐగుప్తు శ్రమల నుంచి విడిపించి వేరొక మంచి దేశానికి తీసుకువెళతానని చెప్తాడు.

ఈ విషయాన్ని మోషే ఇశ్రాయేలీయులకి చెప్పి, నానా తిప్పలు పడి వారిని ఒప్పించి, ఇశ్రాయేలీయులందరిని తోడుకొని ఐగుప్తు నుంచి బయలుదేరి అరణ్యంలో ప్రయాణం మొదలుపెడతాడు. మోషే ఇశ్రాయేలీయులని ఐగుప్తు నుండి బయటకు తీసుకురావడానికి గాను యెహోవా ఐగుప్తు ప్రజలమీద చేసిన, చేయించిన బీభత్సాన్ని ఆపై ఇశ్రాయేలీయులు అరణ్యంలో పడిన కష్టాలను గురించి ఇంతకుముందు ప్రచురించిన **'ద రియల్ క్యారెక్టర్ ఆఫ్ బైబిల్ గాడ్'** పుస్తకంలో సవివరంగా ప్రస్తావించడమైనది. ఈ విషయాల గురించి పూర్తి సమాచారం కావాలనుకునే వారు ఆ పుస్తకాన్ని పరిశీలించగలరు.

**మోషే ఇశ్రాయేలీయులకి చెప్పినట్టుగా వారిని వేరొక మంచి దేశానికి తీసుకువెళ్ళకపోగా 40 సంవత్సరాలు వారిని అరణ్యంలోనే తిప్పి తానుకూడా అరణ్యంలోనే చనిపోతాడు.**

మోషే చనిపోయాక ఇశ్రాయేలీయులకి యెహోషువా నాయకుడౌతాడు. అతని నాయకత్వంలో ఇశ్రాయేలీయులు అనేక రాజ్యాలపై దాడులుచేసి ఆ రాజ్యాలని ఆక్రమిస్తారు. ఇశ్రాయేలీయులు ఆక్రమించిన ఆ రాజ్యాలలోని భూభాగాలను యెహోషువా ఇశ్రాయేలు పన్నెండు గోత్రాలవారికి వంతుల వారీగా చీట్లువేసి పంచిపెడతాడు.

యెహోషువా చనిపోయాక కొంతమంది న్యాయాధిపతులు ఇశ్రాయేలీయులకి మార్గదర్శనం చేస్తారు. **అందులో సమూయేలు అనే ప్రవక్త ప్రముఖ న్యాయాధిపతి.**

పొరుగు రాజ్యాలతో అసంఖ్యాకంగా జరుగుతున్న యుద్ధాల వల్ల తమను నడిపించడానికి ఒక రాజు అవసరమని భావించిన ఇశ్రాయేలీయులు ఆ విషయం సమూయేలుకి తెలియజేసి, తమపై ఒక రాజుని నియమించమంటారు.

అందుకు సమూయేలు యెహోవాని(బైబిల్ దేవుడు) అడిగి చెబుతానంటాడు. ఆపై మీకు ఒకరిని రాజుగా చేయడం యెహోవాకి ఇష్టంలేదని సమూయేలు చెప్పినా, ఇశ్రాయేలీయులు అతని మాట వినక తమకు రాజు కావలసిందే అని పట్టుబడతారు. ఇక చేసేదిలేక సౌలు అనే యువకుడిని రాజుగా అభిషిక్తుణ్ణి చేసి ఇతనే యెహోవా మీపై నియమించిన రాజు అని ప్రకటిస్తాడు సమూయేలు.

అప్పటినుండి ఇశ్రాయేలీయులలో రాజుల పరిపాలన మొదలౌతుంది. ఒక యుద్ధంలో సౌలు చనిపోతాడు. ఆపై దావీదు అనే యువకుడు ఇశ్రాయేలీయుల కు రాజౌతాడు. ఈ దావీదు యూదా వంశానికి చెందినవాడు (ఇశ్రాయేలు పన్నెండు గోత్రాలలో యూదులు ఒక గోత్రీకులు). దావీదు తరువాత అతడి కొడుకు సొలోమాను, సొలోమాను తరువాత అతని కొడుకు రెహబాము ఇశ్రాయేలీయులని పరిపాలిస్తారు.

**అయితే రెహబాము పరిపాలనలో ఇశ్రాయేలీయులలో నుంచి యూదులు విడిపోయి, రెండు రాజ్యాలుగా మారారు.** (1వ రాజులు 12వ అధ్యాయము)

ఆపై ఇశ్రాయేలీయులకీ, యూదులకీ చాలా కాలంపాటు యుద్ధాలు కూడా జరిగాయి. అటుతరువాత యూదులు అష్షూరీయులకు దాసులౌతారు. మరికొంతకాలానికి బబులోను రాజ్యానికి చెరపట్టబడతారు.

ఈ విధంగా ఐగుప్తులోనుండి బయలుదేరి వచ్చిన ఇశ్రాయేలీయులు కొంతకాలంపాటు నానా అగచాట్లు పడుతూ అరణ్యంలో తిరిగి, ఆ తరువాత కొన్ని రాజ్యాలను ఆక్రమించి, కొంతకాలం స్వతంత్ర రాజ్యంగా మనుగడ సాగించి, మరికొంత కాలానికి పరాయి రాజుల పాలనలోకి వెళ్ళిపోయారు.

బైబిల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఇశ్రాయేలీయులకి జరిగిన ప్రతిసంఘటన వెనుక బైబిల్ దేవుడైన యెహోవా హస్తం ఉన్నట్టుగా తేలుతుంది. ఇశ్రాయేలీయులు యుద్ధంలో గెలిచినప్పుడల్లా ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా వారిని గెలిపించాడని వారు ఓడినప్పుడల్లా తనని కాక వేరే దేవతలను పూజించినందుకు యెహోవా వారిని శత్రువులచేతికి అప్పగించి చితకొట్టించాడనీ బైబిల్లో వాక్యాలు చూడవచ్చు. యెహోవాలో ఉన్న ఈ వింత పోకడ గురించి కూడా **'ద రియల్ క్యారెక్టర్ అఫ్ బైబిల్ గాడ్'** పుస్తకంలో కొంతవరకు వివరించాము.

బైబిల్లో ఈ వివరాలన్నీ రాసింది ఒకే రచయిత కాదు. ఆయా కాలాల్లో జీవించిన

అనేక వ్యక్తులు ఇశ్రాయేలీయుల చరిత్ర గురించి, అందులో యెహోవా పాత్రగురించి రాసిన వేరు వేరు పుస్తకాలను అనంతర కాలంలో ఒకచోట చేర్చి ఇప్పుడున్న బైబిల్‌గా రూపొందించారు.

పరాయి పాలనలో ఉన్న ఇశ్రాయేలీయుల వద్దకి యెహోవా చేత పంపబడిన ప్రవక్తలు వచ్చి ఈ విధంగా చెబుతారు.

<u>యెషయా 49:25</u> యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు.

బలాఢ్యులు, చెరపట్టినవారు సహితము విడిపింపబడుదురు.

భీకరులు, చెరపట్టినవారు విడిపింపబడుదురు.

నీతో యుద్ధము చేయువారితో నేనే యుద్ధము చేసెదను. నీ పిల్లలను నేనే రక్షించెదను.

అంటే ఇశ్రాయేలీయులలో చెరపట్టబడినవారిని విడిపించి, వారి సంతానాన్ని రక్షిస్తానని బైబిల్ దేవుడు యెహోవా సెలవిస్తున్నాడన్నమాట.

మరోప్రవక్త యిర్మీయా ఈ విధంగా చెప్పుచున్నాడు.

**<u>యిర్మీయా 23: 5-8</u> యెహోవా ఈలాగు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు. రాబోవు దినములలో నేను దావీదుకు నీతి చిగురును పుట్టించెదను. అతడు రాజై పరిపాలన చేయును. అతడు వివేకముగా నడుచుకొనుచు కార్యము జరిగించును. భూమిమీద నీతి, న్యాయములను జరిగించును. అతడి దినములలో యూదా రక్షణనొందును. ఇశ్రాయేలు నిర్భయముగా నివసించును. యెహోవా మనకు నీతియని అతనికి పేరు పెట్టుదురు. కాబట్టి రాబోవు దినములలో జనులు ఇశ్రాయేలీయులను ఐగుప్తు దేశములోనుండి రక్షించిన యెహోవా జీవము తోడని, ఇక ప్రమాణము చేయక ఉత్తర దేశములో నుండియు నేను వారిని చెదరగొట్టిన దేశములన్నింటి లోనుండియు వారిని రక్షించిన యెహోవానగు నాతోడని ప్రమాణము చేతురని యెహోవా సెలవిచ్చుచున్నాడు.**

పై వాక్యాలలో దావీదుకు నీతి చిగురును పుట్టించెదను అంటున్నాడు యెహోవా. అంటే (1) దావీదు వంశంలో నీతి కలిగిన సంతానాన్ని పుట్టిస్తాను అని.

(2) తరువాతి వాక్యంలో అతడు రాజై పరిపాలన చేయును అంటున్నాడు.

అనగా దావీదు వంశంలో పుట్టినవాడు రాజవ్వాలి. ఎవరికి రాజవ్వాలి? ఆ క్రింది వాక్యం చూడండి.

**అతని దినములలో యూదా రక్షణనొందును. ఇశ్రాయేలు నిర్భయముగా నివసించును.** అంటే అతను యూదా వారికి ఇశ్రాయేలు వారికి రాజవ్వాలి. అందుకే ఆ తరువాతి వాక్యములో యెహోవా ఇలా చెప్తున్నాడు. ఇప్పటిదాకా ఇశ్రాయేలీయులని

ఐగుప్తు దేశములో నుండి వారిని రప్పించిన యెహోవా జీవము తోడని ప్రమాణాలు చేసేవారు. ఇకముందు అలాకాకుండా ఇశ్రాయేలీయులు చెదిరి పోయిన దేశములన్నిటిలో నుండి వారిని రప్పించిన యెహోవా తోడని, ప్రమాణము చేస్తారు అంటున్నాడు.

ఈ ప్రవచన సారాన్ని బాగా పరిశీలిస్తే..,

దావీదు వంశంలో పుట్టిన ఒక రక్షకుడి ద్వారా యెహోవా ప్రపంచ దేశాలన్నింటిలో చెదిరిపోయిన ఇశ్రాయేలీయులను తమ స్వదేశానికి రప్పిస్తాడు. రక్షకుడు వారికి రాజౌతాడు. అతని సమయములో ఇశ్రాయేలీయులు నిర్భయముగా నివసిస్తారు అని అర్థమౌతుంది.

(యూదులు ఏసుని ఈనాటి వరకూ రక్షకునిగా అంగీకరించలేదన్నది చారిత్రిక వాస్తవం. ఏసు ఇశ్రాయేలీయుల్ని స్వదేశానికి రప్పించనూ లేదు వారికి రాజూ కాలేదు. ఇశ్రాయేలీయులు ఈనాటికీ నిర్భయంగా లేరు. ఇది నిజమా కాదా?)

ఇక ఈ ప్రవచనాన్ని యెహెజ్కేలు అనే మరో ప్రవక్తకూడా ధృవీకరిస్తున్నాడు.

<u>యెహెజ్కేలు 37: 21-23</u> **ఏయే అన్యజనులలో ఇశ్రాయేలీయులు చెదిరిపోయిరో ఆయా అన్యజనుల్లోనుండి వారిని రక్షించి వారు ఎచ్చటెచ్చట ఉన్నారో అచ్చటనుండి వారిని సమకూర్చి వారి స్వదేశములోనికి తోడుకుని వచ్చి వారికమీదట ఎన్నటికిని రెండు జనములుగాను, రెండు రాజ్యములుగాను ఉండకుండునట్లు ఆ దేశములో ఇశ్రాయేలీయుల పర్వతములమీద వారిని ఏకజనముగా చేసి వారందరికి ఒక రాజునే నియమించెదను.**

ఇంతకుముందు దావీదు మనవడు రెహబాము పరిపాలనలో యూదులు, ఇశ్రాయేలీయుల నుంచి వేరై రెండు రాజ్యాలుగా మారినట్టు చూశాం. **వారిద్దరి మధ్య భీకరమైన యుద్ధాలు కూడా జరిగాయి. (1వ రాజులు 12:19)**

ఇకపై అలా కాకుండా వారు రెండు రాజ్యాలుగా ఉండకుండా ఏకము చేసి వారందరికీ ఒక రాజునే నియమిస్తానని బైబిల్ దేవుడు యెహోవా చెబుతున్నాడు. మళ్లీ 24వ వచనంలో **నా సేవకుడైన దావీదు వారికి రాజవును** అని అంటున్నాడు. దావీదు అప్పటికే చనిపోయాడు. కానీ దావీదు రాజవడం అంటే బైబిల్ పరిభాషలో దావీదు వంశంలో పుట్టినవాడు రాజవుతాడు అని.

అది విషయం. పరాయిరాజుల దాస్యంలో ఉన్న ఇశ్రాయేలీయులని చెరనుంచి విడిపించి, వారిని రక్షించడానికి దావీదు వంశంలో ఒక రక్షకుడు పుడతాడని బైబిల్ దేవుడు ప్రవక్తల ద్వారా పలికించినట్లుగా బైబిల్లో వాక్యాలు కనబడతాయి. ఇలాంటి ప్రవచనాలే మరికొన్ని వేరే ప్రవక్తలు ప్రవచించినవి కూడా ఉన్నాయి.

మీకా అనే ప్రవక్త అయితే ఆ రక్షకుడు **బెత్లహేం** అనే గ్రామంలో పుడతాడని చెప్పాడు.

మీకా5:2 బెత్లెహేం ఎఫ్రాతా యూదా వారి కుటుంబములలో నీవు స్వల్ప గ్రామమైననూ, నాకొరకు ఇశ్రాయేలీయులను, ఏలబోవువాడు నీలోనుండి వచ్చును.

ఇలా ఇశ్రాయేలీయులను రక్షించడానికి దావీదువంశంలో పుట్టబోయే ఆ రక్షకుడే క్రీస్తు లేదా, మెస్సీయ అనగా అభిషిక్తుడని అర్థం. ఇలా ప్రవక్తలు క్రీస్తు గురించి పై ప్రవచనాలు చెప్పి శతాబ్దాలు గడిచిపోయాయి. తరాలు మారినా ఇశ్రాయేలీయులు క్రీస్తు లేదా మెస్సీయ అనబడే వానికోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇశ్రాయేలీయులు క్రీస్తు కోసం వందల సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న తరుణంలో ఏసు పుట్టాడు.

ఈ యేసే ఆ క్రీస్తు అని బైబిల్లోని క్రొత్త నిబంధనలో ఏసు శిష్యులు, పౌలు ప్రకటించారు.

యేసు కూడా **నేనే ఆ మెస్సీయ అనబడిన క్రీస్తుని** అని ప్రకటించుకున్నాడు. **(యోహాను 4: 25,26)**

ఇప్పుడు మనకి ఒక పెద్ద సందేహం వస్తుంది?

**ఈ యేసే ఇశ్రాయేలీయులు ఎదురుచూస్తున్న ఆ క్రీస్తు అయితే, యేసు ఇశ్రాయేలీయులకు రాజవ్వాలి కదా! కాని ఇశ్రాయేలీయులే యేసుని శిలువ వేయించి, చంపించడం ఏంటి?**

అంటే ఈ యేసు ప్రవక్తలు చెప్పిన క్రీస్తు కాదా? ఒకవేళ ఏసే క్రీస్తు అయితే, పాతనిబంధనలో ప్రవక్తలు చెప్పిన ప్రవచనాల మాటేమిటి? అవన్నీ అబద్ధాలు అని చెప్పక తప్పని పరిస్థితి దాపురిస్తుంది కదా. అని రకరకాలుగా ఓ పట్టాన సమాధానం చెప్పలేని ప్రశ్నలు తలెత్తుతాయి.

**కాని ఏసే క్రీస్తు. పాతనిబంధనలో ప్రవక్తలు చెప్పిన ప్రవచనాలు ఈయన గురించినవే అనే ఒకేఒక్క విశ్వాసం మీదనే క్రైస్తవం నిలబడి ఉంది.**

అదేంటి! అదెలా సాధ్యం అనుకుంటున్నారా? అదే మరి బైబిల్ అంటే ఒకరికొకరు సంబంధంలేని నలభై మంది రాసిన పుస్తకాల సంకలనమే బైబిల్.

అంతా తార్‌మార్ తక్కరమార్ లా ఉంటుంది. అలాంటి ఇరకాటమైన సందర్భం వచ్చినప్పుడల్లా క్రైస్తవ బోధకులు సమస్యను ప్రక్కకు జరిపి ఎవరిదారిన వాళ్ళు పోతారు. లేదా అది మాకు తెలుసులేవోయ్ దానర్థం ఇదీ అంటూ పులుముడు అర్థాలు దాని నెత్తిన పెట్టి సమాధానం చెప్పేశాం అంటూ భుజాలెగరేస్తుంటారు.

- **పాతనిబంధనలో ప్రవక్తలద్వారా యెహోవా పలికించినది ఒకటి.**
- **ఏసు చెప్పింది ఇంకొకటి.**
- **ఏసు శిష్యులు రాసింది మరొకటి.**

- వీటన్నింటినీ తోసిరాజంటూ పౌలు పట్టించిన దారొకటి.
- కాగా క్రైస్తవ మతప్రచారకులు ప్రచారం చేస్తున్నది వేరొకటి.

అంతా గజిబిజి గందరగోళంగా, వైకుంఠపాళి ఆటలా ఉంటుంది. ఒక్కొక్కటిగా ఆ చిక్కుముడులన్నీ విప్పుకుంటూ వెళ్దాం. అందువల్ల కొంతవరకైనా గందరగోళం పోయి స్పష్టత చేకూరుతుంది.

## 2. బాలఏసు

ముందుగా ఏసు పుట్టుపూర్వోత్తరాలు, బాల్యం గురించి తెలుసుకుందాం. ఏసు గురించి నలుగురు శిష్యులు రాసిన సువార్తలు బైబిల్లో ఉన్నాయి. అందులో రెండు సువార్తలలో (మత్తయి, లూకా) మాత్రమే ఏసు బాల్యం గురించి ఉంది.

ఈ రెండు సువార్తలల్లోనైనా ఏసుబాల్యం గురించి ఏకాభిప్రాయం ఉందా? అంటే అదీ లేదు. ఏసు బాల్యం ప్రధానంగా మూడు ప్రాంతాలతో ముడిపడి ఉంది.

**1. నజరేతు 2. బెత్లహేం 3. యెరూషలేము**

ఏసు బాల్యం గురించి వివరాలు ఉన్న రెండు సువార్తలలో ఒకటైన లూకా సువార్త ప్రకారం ఏసు తల్లిదండ్రులు మరియ(మేరీ), యోసేపులు నజరేతులో నివాసం ఉంటున్నారు. అప్పుడు మరియ గర్భవతి అయ్యింది. ఆ రోజుల్లో ప్రజాసంఖ్య (జనాభాలెక్కలు) రాయవలెనని కైసరు చక్రవర్తి ఆజ్ఞ ఇచ్చినందున ఆ సంఖ్యలో రాయబడుటకు యోసేపు, మరియతో కూడా నజరేతు నుండి బెత్లహేం అనే ఊరికి వెళతాడు. వారక్కడ ఉన్నప్పుడు మేరీకి ప్రసవం జరుగుతుంది. అక్కడ సత్రంలో వారికి స్థలం లేకపోవడం వల్ల ఏసుని పొత్తి గుడ్డలతో చుట్టి పశువుల తొట్టిలో పరుండబెడతారు.- (లూకా 2:1-7)

కాని మత్తయి సువార్త ప్రకారం ఏసు తల్లిదండ్రులు మరియ, యోసేపులు ఏసు పుట్టక మునుపు నజరేతులో కాకుండా బెత్లహేంలోనే నివాసం ఉంటున్నారు. అలా అని ఎలా చెప్పగలమంటే,

***<u>మత్తయి 2:10, 11</u>లో ఏసు పుట్టగానే ఆయనను చూడానికి వచ్చిన తూర్పుదేశ జ్ఞానులు ఒక నక్షత్రాన్ని అనుసరిస్తూ ఏసు ఉన్నచోటకి చేరుకుంటారు. అప్పుడువారు అత్యానందభరితులై 'ఇంటిలోనికి' వచ్చి*** అని ఉంది.

లూకా సువార్తలోనేమో బెత్లహేం అనే ఊరిలో వారు సత్రంలో ఉన్నారు, సత్రంలో కూడా వారికి స్థలం లేక బాలఏసుని గుడ్డలతో చుట్టి పశువుల పాకలో పరుండబెట్టారు అని కదా ఉంది! కాని మత్తయి సువార్తలో మాత్రం అది ఇల్లు అని ఉంది.

అలాగే మత్తయి సువార్త ప్రకారం ఏసు పుట్టిన తరువాత హేరోదు రాజు, **'యూదులరాజు'** పుట్టాడని తెలుసుకొని ఆయనను చంపటానికి ప్రయత్నించగా దేవదూత యోసేపు కలలో ప్రత్యక్షమై నీ భార్యని, శిశువుని తీసుకొని ఐగుప్తుకి పారిపొమ్మని చెప్తాడు. ఆ విధంగా యోసేపు ఐగుప్తుకి పారిపోయి, హేరోదు రాజు చనిపోయేవరకు ఐగుప్తులో ఉండి ఆ తరువాత ఇశ్రాయేలు దేశంలోని నజరేతుకు వెళ్ళి అక్కడ నివాసం ఉన్నాడు. లూకా సువార్తలో మాత్రం యోసేపు ఐగుప్తుకు పారిపోవడం కనిపించదు.

ఏసు పుట్టిన తరువాత యెరూషలేముకు వెళ్ళి అక్కడ ఎనిమిదవరోజు ఏసుకి సున్నతి చేయించి నజరేతుకి వెళ్లి కాపురం ఉన్నాడు.

బైబిల్ సువార్తలలో చాలా పెద్ద వైరుధ్యాలే ఉన్నాయి. కాని ఈ విషయాన్ని మాత్రమే ఎందుకు ఇంత పరిశీలనగా చూడాలి? అంటే బైబిల్ పాత నిబంధనల్లో ప్రవచనాల ప్రకారం ఇశ్రాయేలు రక్షకుడు బెత్లహేంలో పుట్టాలి. కాని ఏసు బెత్లహేంలో పుట్టలేదని సువార్తికులే ప్రవచనం నెరవేర్చుకోసం ఇలా చెప్పారని ఒక విమర్శ ఉంది.

ఏసు గురించి ప్రజలలో చర్చ జరుగుతున్న ఒక సందర్భంలో కొంతమంది ఈయన ప్రవక్త అని, క్రీస్తు అని రకరకాల అభిప్రాయలు వెలిబుచ్చుతారు. అప్పుడు ఇంకొంతమంది **ఈయన క్రీస్తు అయితే, దావీదు సంతానంలో పుట్టి దావీదు ఉండిన బెత్లహేం అను గ్రామంలో నుండి వచ్చునని, లేఖనము చెప్పుటలేదా? క్రీస్తు గలిలయలో నుండి వచ్చునా? అని అడుగుతారు-(యోహాను 7:41,42)**

ఏసు గలిలయలోని నజరేతులో పెరిగాడని ఈ రెండు సువార్తలలో ఉంది. కాని ఏసు పుట్టకముందు మరియ, యోసేపు బెత్లహేంలో ఉండి, ఆయన పుట్టాక నజరేతుకు వచ్చారని మత్తయిసువార్తలో ఉంటే, ఏసు పుట్టకమునుపే మరియ, యోసేపులు నజరేతులో ఉండి ఏసు జనన సమయానికి బెత్లహేం వెళ్లి ఆయన జన్మించాక తిరిగి నజరేతుకి వచ్చారని లూకా సువార్తలో ఉంది.

పైన యోహాను సువార్తలో ఉన్న వాక్యం ప్రకారం ఏసుని నజరేతులోనే పుట్టి పెరిగిన వానిగా ప్రజలు గుర్తించారు అని అర్థమవుతుంది. ఇవన్నీ పరిశీలిస్తే ఏసు బెత్లహేంలో పుట్టాడనేది అనుమానాస్పదంగానే కనబడుతుంది. **ఏసుని ఇశ్రాయేలీయులు ప్రవక్తగా అంగీకరించకపోవడానికి ఇది కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.**

ఆ తరువాత ఏసు బాల్యం గురించి తెలుసుకుందామని చూస్తే పెద్ద వివరాలేమీ కనబడవు.

**<u>లూకా 2: 40-52</u> పస్కాపండుగకు యెరూషలేముకు వెళ్లిరావడం ఏసు తల్లిదండ్రులకు వాడుక. ఆయనకి పన్నెండేండ్లప్పుడు వారు యెరూషలేముకు వెళతారు. ఏసు యెరూషలేములోనే ఉండిపోతాడు. ఆయన తల్లిదండ్రులు ఆయన కోసం ఎక్కడెక్కడో వెతికి తిరిగి యెరూషలేముకు వచ్చి ఆయనను కనుగొనడం జరుగుతుంది. ఆ సమయములో ఏసు దేవాలయంలో బోధకుల మధ్య కూర్చుని వారితో సంభాషిస్తుంటాడు. అది చూసి ఆయన తల్లిదండ్రులతో పాటు అక్కడున్న ప్రజలు కూడా ఆశ్చర్యపోతారు.**

**ఆతరువాత ఏసు తన తల్లిదండ్రులతో బయలుదేరి నజరేతుకి వచ్చి జ్ఞానమందును,వయస్సునందును,దేవునిదయయందును, మనుష్యులదయయందును**

**వర్ధిల్లుచుండెను** అని ఉంటుంది. ఆపై ఏసు బాల్యం గురించిన మరే వివరాలు బైబిల్లో లేవు. మళ్లీ ఆయన ముప్పై సంవత్సరాల వయస్సులో బోధించడం మొదలుపెట్టిన దగ్గరనుంచి .సువార్తలు ప్రారంభమవుతాయి.

13వ సంవత్సరం నుంచి 29వ సంవత్సరం వరకు బైబిల్లో ఏసు జీవితంలోని **'మిస్సింగ్ ఇయర్స్'** అంటారు. ఆ సమయములో ఏసు కాశ్మీరుకి వచ్చాడని ఇక్కడ సాధువుల దగ్గర సాధన చేశాడనే కథలు కొన్ని ప్రచారంలో ఉన్నాయి. అవి ఎంతవరకు సత్య పరీక్షకు నిలబడగలుగుతాయో కాలమే నిర్ణయిస్తుంది.

## 3. తండ్రి తనయుల సమన్వయలోపం

ఏసు 30 ఏళ్ళ వయసులో బోధించడం ఆరంభిస్తాడు. పైన ఒక సందర్భంలో నేను చెప్పినట్లుగా పాతనిబంధనలో యెహోవా చెప్పింది ఒకటి, కొత్తనిబంధనలో ఏసు చెప్పింది ఇంకొకటి.

వాళ్ళిద్దరికీ ముఖ్యమైన విషయాలలోనే అసలు శృతి కుదరదు. ఎలాగంటే పాతనిబంధనలో మోషే రాసిన ధర్మశాస్త్రంలో గాని, వేరే ప్రవక్తలు రాసిన గ్రంథాలలో గాని యెహోవా ఇశ్రాయేలీయులని ఉద్దేశించి అన్నీ ఈ లోకసంబంధమైన విషయములనే చెప్తాడు. "నామాట అనుసరించి నన్ను పూజిస్తే పిల్లాపాపలతో పాడిపంటలతో సంతోషంగా బ్రతుకుతారు. నన్ను కాక ఇతరదేవతలను పూజిస్తే మిమ్మల్ని సర్వనాశనం చేస్తా. మీ శత్రువులచేత మిమ్మల్ని చితగ్గొట్టిస్తా" అంటాడు. తప్ప నన్ను అనుసరించి నడుచుకుంటే మీకు పరలోకంలో నిత్యజీవం ఇస్తా నామాట వినకపోతే మిమ్మల్ని నిత్య నరకంలో వేసి కాలుస్తా అని ఎక్కడా చెప్పలేదు. అంటే యెహోవా దృష్టంతా ప్రధానంగా ఈ లోకసంబంధమైనది. కాని ఏసు మాత్రం అసలు ఎత్తుకోవడమే పరలోక రాజ్యంతో ఎత్తుకున్నాడు. "**పరలోకరాజ్యము సమీపించియున్నది మారు మనసు పొందుడి**" అంటూ.

ఇంకా పాత నిబంధనలో యెహోవా ఇశ్రాయేలీయులకి ఇస్తానన్నది భూలోక రాజ్యం. దావీదు వంశములో పుట్టిన ఒక రక్షకుడి ద్వారా పరాయి పాలనలో ఉన్న ఇశ్రాయేలీయులను రక్షించి వారిపై అతన్నే రాజుని చేస్తానంటాడు. (ఇందుకు సంబంధించిన రిఫరెన్సులు ఇశ్రాయేలీయుల ప్రస్థానం భాగంలో ఇవ్వడం జరిగింది.)

ఇంకా కొత్త నిబంధనలో కూడా ఏసు పుట్టగానే యూదుల రాజుగా పుట్టినవాడు ఎక్కడున్నాడు? అని తూర్పుదేశ జ్ఞానులు వెతుక్కుంటూ వచ్చినట్లుగా, హేరోదురాజు ఆ సంగతివిని, యూదుల రాజువల్ల తన అధికారానికి ముప్పు ఏర్పడుతుందేమో అని భయపడి ఆ పిల్లవాణ్ణి చంపించడానికి ప్రయత్నించినట్లుగా మత్తయి సువార్త రెండవ అధ్యాయంలో చూడవచ్చు.

అసలు ఏసుని శిలువ వేయడానికి ప్రధానంగా ఆరోపించబడిన కారణం కూడా ఇదే. **క్రీస్తు అనే రాజును నేనే అని ఏసు చెప్పుకోవడం.- (లూకా-23:2)**
ఈ విషయం అయన శిలువపై వ్రాశారు కూడా.

**<u>మార్కు-15:26,27</u> మరియూ యూదుల రాజైన ఏసు అని ఆయన మీద మోపబడిన నేరమును రాసి పైగా నుంచిరి. మరియు కుడివైపున ఒకనిని, ఎడమవైపున ఒకనిని ఇద్దరు బంధిపోటు దొంగలను ఆయనతో కూడా శిలువ వేసిరి.**

కాని ఏసేమో **నేను రాజనేగాని, నా రాజ్యం ఈ లోకసంబంధమైనది కాదు** అంటాడు. -(యోహాను-18:36)

ఈ ఒక్కమాటతో ఏసు బైబిల్ పాత నిబంధనసంతా తుంగలో త్రొక్కాడు. ఎందుకంటే పాత నిబంధనలో చెప్పబడినది భూలోకరాజ్యమే అనేది నిర్వివాదాంశం. యెహోవాకి, ఏసుకి మధ్య సమాచార వ్యవస్థలో లోపం తలెత్తి ఏసు ఇలా భూలోక రాజ్యాన్ని పరలోక రాజ్యంగా పొరపడ్డాడా! అంటే నేను తండ్రియొద్దనుండి బయలుదేరి వచ్చాను అంటాడు ఆయనే. మరి బయలుదేరి వచ్చేటప్పుడైనా, యెహోవా ఇంకోసారి తన కుమారుడికి అది ఏ రాజ్యమో స్పష్టంగా చెప్పుండాలి కదా! ఇక్కడ ఇంకొక అనుమానం కూడా తలెత్తుతుంది. తండ్రీకొడుకుల మధ్య ఇంతపెద్ద అభిప్రాయ భేదం ఉందంటే అసలు ఏసు చెప్పిన తండ్రి యెహోవానా కాదా? అని. కనుక ఇప్పుడు ఆ విషయంలోకి వెళదాం.

# 4. తండ్రి ఎవరు?

'మరియ అనే కన్యకి పరిశుద్ధాత్మ వలన కలిగిన సంతానం ఏసు' అని మత్తయి 1:18 లో చూడొచ్చు.

లోకరీతి ప్రకారం మరియ భర్త అయిన యోసేపు ఆయనకి తండ్రిగా ఎంచబడ్డాడు అని లూకా- 3:23 లో చూడగలం.

ఇక ఏసు పెద్దవాడై బోధించడం మొదలుపెడతాడు. ఆయన బోధనలన్నీ తండ్రి చుట్టూనే తిరుగుతూ ఉంటాయి.

**1) యోహాను-5:36 నేను నెరవేర్చుటకై తండ్రి ఏ క్రియలను నాకిచ్చియున్నాడో నేను చేయుచున్న ఆ క్రియలే తండ్రి నన్ను పంపియున్నాడని నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి.**

**2) యోహాను-16:28 నేను తండ్రి యొద్దనుండి బయలుదేరి లోకమునకు వచ్చియున్నాను.**

**3) యోహాను-14:28 తండ్రి నాకంటే గొప్పవాడు.**

**4) మత్తయి-20:23 నా కుడివైపునైననూ నా ఎడమవైపునైననూ కూర్చుండనిచ్చుట నా వశమున లేదు. నా తండ్రిచేత ఎవనికి సిద్ధపరచబడెనో వారికే అది దొరుకునని చెప్పెను.**

ఇక్కడ ఏసు చెప్తున్న తండ్రి యోసేపు కాదు. దేవుణ్ణే తన తండ్రిగా సంబోధిస్తున్నాడు. ఈ లోక రక్తసంబంధాలను అతడెప్పుడూ ముఖ్యంగా భావించలేదు. అన్ని విషయాలలోనూ నా తండ్రిదే సమస్త అధికారం నేను కేవలం పంపబడినవాడను, నిమిత్తమాత్రుణ్ణి అని ఏసు చాలాచోట్ల స్పష్టం చేశాడు.

**ఇందులో గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే నా తండ్రి యెహోవా అని ఏసు ఒక్కచోట కూడా చెప్పలేదు.**

మరి ఏసు చెప్పిన ఆ తండ్రి ఎవరు? అని క్రైస్తవులని అడిగితే మాత్రం వారు తడుముకోకుండా చెప్పే పేరు యెహోవానే.

మరో పసలేని వాదమూ ప్రముఖంగా వాడుకలోకి వచ్చింది. అదెంత అడ్డగోలు వాదమో ఎవరూ సీరియస్‌గా పట్టించుకోరు. అదేమిటంటే ఏసు, పరిశుద్ధాత్మ, యెహోవా వీరు ముగ్గురూ కలిస్తేనే సంపూర్ణమైన దేవుడౌతాడట. కొంచెం పైత్యకారులైతే యెహోవానే ఏసుగా వచ్చాడని చెప్తున్నారు.

వీటన్నిటికన్నా దారుణమైన విషయం బైబిల్‌లో యెహోవా అనే పాత్రని తుడిచేసి, అంతా ఏసునే చూపించేవాళ్లు కూడా తయారయ్యారు. అంతటితోనూ ఆగక వీళ్ల పిచ్చి పరాకాష్టకు చేరి వేదాలలో చెప్పబడిన ఏ యజ్ఞపురుషుడు, వేదవేద్యుడు, పరమాత్మ ఉన్నాడో అతడు

ఏసే అంటూ వంచనా శిల్పంతో కూడిన కొత్తపాటందుకున్నారు మరికొందరు బైబిల్ వ్యాపారులు.

బైబిల్‌లో **నా అంతట నేను ఏమియూ చేయలేను. నన్ను పంపినవాని చిత్తప్రకారమే చేయగోరుదును. (యోహాను-5:30)** అని చెప్పిన ఏసు ఎక్కడ?

వేదాలలో అద్యంతరహితుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు అయిన ఈశ్వరుడెక్కడ?

పిచ్చికి కూడా హద్దుండాలి కదా!

సరే మళ్లీ మనం పై విషయంలోకి వెళితే ఏసు ఎక్కడా నా తండ్రి యెహోవా అని చెప్పకపోయినా ఏసు చెప్పిన ఆ తండ్రి యెహోవానే అని క్రైస్తవులు కుండ బద్దలుకొట్టి చెప్తారు. ఏసు ఎక్కడా యెహోవా పేరు చెప్పలేదు సరే! కనీసం ఆయన యెహోవా అని నిర్ధారించాలంటే ఏసు తన తండ్రి గురించి చెప్పిన వివరాలు గానీ, లక్షణాలు గానీ యెహోవా గుణగణాలతో సరిపోలుతున్నాయేమో పరిశీలించుదాం.

ఏసు ఒకచోట తన తండ్రి గురించి ఇలా చెప్తున్నాడు.

**<u>యోహాను-5:37</u> మీరు ఏ కాలమందైననూ ఆయన స్వరం వినలేదు. ఆయన స్వరూపం చూడలేదు.** ఈ మాట గనుక ఏసు ఉత్తుత్తినే గాక, నిజంగా సీరియస్‌గా అన్నదే అయితే ఏసు ప్రస్తావించిన ఆ తండ్రి యెహోవా కాదని తేలిపోయినట్లే. అదెలాగంటే?

ఇక్కడ ఇశ్రాయేలీయులని ఉద్దేశించి మీరు అంటున్నాడు ఏసు.

అయితే ఆ తండ్రి యెహోవానే అనుకుంటే ఇశ్రాయేలీయులు ఎప్పుడూ యెహోవాని చూడలేదా? అయన స్వరం వినలేదా? అని చూస్తే పాత నిబంధనలో ప్రవక్తలందరూ యెహోవాతో మాట్లాడారని ఆయన స్వయంగా చెప్పిన విషయాలనే గ్రంథాలుగా రాశారని కనపడుతుంది.

మోషే అయితే యెహోవాని ప్రత్యక్షంగా చూశాడని కూడా ఉంది.

**<u>నిర్గమ-33:21-23</u> యెహోవా మోషేకి వెనుకపక్క చూపించినట్టుగా ఉంది.**

**<u>ద్వితీ-34:12</u> మోషే యెహోవాని ముఖాముఖిగా ఎరిగియున్నాడని ఉంది.** మోషే ఒక్కడే కాదు **<u>నిర్గమ-24:9,10</u> వాక్యాలలో మోషే, అహరోనులతో పాటు 70 మంది ఇశ్రాయేలు పెద్దలు యెహోవాని చూసినట్టుగా ఉంది.**

కానీ 'నా తండ్రిని ఇశ్రాయేలీయులు ఏ కాలంలో కూడా చూడలేదు' అని ఏసు అంటున్నాడు. అంటే ఆ తండ్రి యెహోవా కానట్లేగా. మరో విషయం చూస్తే **<u>లూకా-11:13</u>** లో ఏసు చెప్తున్నాడు **మీలో తండ్రియైనవాడు తన కుమారుడు చేపనడిగితే పామునిచ్చునా? గుడ్డునడిగితే తేలునిచ్చునా? మీరు చెడ్డవారైయుండి మీ పిల్లలకి మంచివి ఇస్తున్నారు కదా? మీ పరలోకపు తండ్రి తనను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో**

**నిశ్చయముగా అనుగ్రహించుననేను.**

పై వాక్యంలో ఏసు చెప్తున్న ఆ పరలోకపు తండ్రి యెహోవానే అనుకుంటే యెహోవా ఎలాంటివాడో క్రింది వాక్యాలు చూస్తే బోధపడుతుంది.

<u>సంఖ్యా కాండం-21:4-6</u> **ఇశ్రాయేలీయులు అడవుల్లో తిరిగి తిరిగి మార్గాయాసం చేత సొమ్మసిల్లి పడిపోయారు. అప్పుడు కొంతమంది ఇశ్రాయేలీయులు ఇక్కడ మాకు తినడానికి ఆహారం, త్రాగడానికి నీళ్లు లేవు అని ఏడ్చినందుకు యెహోవాకి కోపమొచ్చి తాపకరమైన సర్పాలను పంపి వాటితో కరిపించి వారిని చంపిస్తాడు.** ఇదీ యెహోవా లక్షణం.

ఏసు ఏమంటున్నాడు? చెడ్డవాడైన మనుష్యుడు కూడా తన కుమారుడు చేపనడిగితే పామునివ్వడు కదా అంటున్నాడు!

కాని యెహోవా మాత్రం ఇశ్రాయేలీయులు తినడానికి ఏమి లేదు అని ఏడ్చినందుకు వాళ్ళని పాములతో కరిపించాడు.

అంటే ఏసు చెప్పిన చెడ్డవారైన మనుషులు కన్నా యెహోవా ఇంకా చెడ్డగా కనిపిస్తున్నాడు తప్ప ఏసు చెప్తున్న తండ్రిలా కనిపించడంలేదు.

ఇంకోచోట చూస్తే...

<u>మత్తయి-5:48</u> **లో ఏసు "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు"** అంటున్నాడు. పరిపూర్ణుడు అంటే ఎటువంటి రాగద్వేషాలుగాని, బలహీనతలుగాని, లోపాలుగాని లేనివాడు. మరి యెహోవా పరిపూర్ణుడిగా ఉన్నాడా? అని బైబిల్‌ని పరిశీలిస్తే యెహోవాలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్ వర్గాలు పుష్కలంగా ఉన్నాయని, అవి సాధారణ మానవుడికుండే స్థాయి కంటే ఎక్కువగా ఉన్నాయని తగిన ఆధారాలతో ఇంతకముందు వచ్చిన **"బైబిల్ దేవుని నిజ స్వరూపస్వభావాలు"** పుస్తకంలో వివరించడమైనది. కనుక యెహోవా ఏరకంగా చూసినా పరిపూర్ణుడు కాడు. కాని ఏసేమో తన తండ్రి పరిపూర్ణుడు అంటున్నాడు.

అలాగే <u>యోహాను-7:28</u> **లో ఏసు తన తండ్రి సత్యవంతుడు** అని చెప్పాడు.

ఐతే యెహోవా సత్యవంతుడా? అని చూస్తే...

<u>నిర్గమ-3:18</u> **లో యెహోవా మోషేతో నీవు ఐగుప్తు రాజ వద్దకు వెళ్ళి అరణ్యములో మూడు దినముల ప్రయాణమంత దూరముపోయి మా దేవుడైన యెహోవాకు బలి సమర్పించుదుము అని చెప్పుము** అంటాడు. కాని నిజానికి ఇశ్రాయేలీయులందరినీ తీసుకొని ఐగుప్తు నుండి పారిపోవాలని కదా మోషే ద్వారా యెహోవా జరిపించాలనుకున్న పథకం. అరె! ఇదేంటి అసలు విషయం దాచిపెట్టి ఇలా అసత్యమాడటానికి యెహోవా మోషేని ప్రేరేపిస్తున్నాడు? ఇదొక్కటే కాదు ఇంతకంటే ముఖ్యమైన అంశం మరొకటుంది.

ఇశ్రాయేలీయుల్ని పాలు తేనెలు ప్రవహించు దేశానికి తీసుకువెళతానని ప్రమాణం చేసి వారిని నమ్మించి తీసుకుపోయి 40 సంవత్సరాలపాటు అడవుల్లో తిప్పి ఆ తరం వారందరినీ చంపేస్తాడు.

ఏసు చెప్తున్న తండ్రి సత్యవంతుడేమోగానీ పాత నిబంధనలో కనపడే యెహోవా మాత్రం సత్యవంతుడు కానేకాడు. కనుకనే ఏసు చెప్పే ఆ సత్యవంతుడైన తండ్రి యెహోవా అయ్యే అవకాశం లేదని అనిపిస్తుంది.

ఇంకొక ముఖ్యమైన విషయం చూస్తే...

ఏసు ఒకచోట తనని చంపాలని దురాలోచన చేస్తున్న యూదుల్ని తిడుతున్నాడు.

**<u>యోహాను-8:44</u> మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు. మీరు మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడైయుండి, సత్యమందు నిలిచినవాడు కాడు.** ఇక్కడ ఏసు తిడుతున్న యూదుల తండ్రి ఎవరని క్రైస్తవులను అడిగితే ఏసు తిడుతున్నది సాతానునే అంటారు.

సరే! అది సాతానే అయితే, బైబిల్‌లో సాతాను ఆదినుండి నరహంతకుడిగా ఉన్నాడా? లేదే! బైబిల్‌లో సాతాను ఎవరినీ చంపినట్టుగా ఆధారాలు లేవు కదా! బైబిల్‌ని ఒకసారి జాగ్రత్తగా పరిశీలిస్తే...

**<u>ఆదికాండం-38:7</u> యెహోవా యూదా కుమారుడైన ఏరుని చంపుతాడు. అటు తరువాత యూదా తన రెండవ కొడుకైన ఓనానుని మీ వదినతో కలిసి ఆమెకి సంతానం కలుగజేయుమని పంపిస్తాడు. ఓనానుకి అది ఇష్టం లేక ఆమెతో పోయినపుడు తన వీర్యాన్ని నేల విడుస్తాడు. అందుకు కోపమొచ్చి యెహోవా ఓనానుని కూడా చంపుతాడు.**

**ఇంకా <u>నిర్గమ-12:29</u> లో యెహోవా ఐగుప్తీయుల తొలి పిల్లలందరినీ హతం చేసినట్టుగా ఉంది.**

**<u>యెహోషువా-10:30</u> లో లిబ్నా దేశంలో ఉన్న వారందరినీ ఇశ్రాయేలీయుల చేత చంపించింది యెహోవానే.**

ఇలా చెప్పుకుంటూపోతే బైబిల్‌లో యెహోవా వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా చంపబడిన వారు లక్షల్లో కాదు కోట్లల్లో ఉంటారు.

అంటే ఆదినుంచి, ఆదికాండం నుంచి నరహంతకుడిగా ఎవరున్నారు బైబిల్‌లో? యెహోవానే ఉన్నాడు. సాతాను ఎవరినీ చంపనేలేదు.

అంటే ఇక్కడ ఏసు విమర్శిస్తున్నది ఎవరిని యెహోవానా? సాతానునా?

<u>ఇక తండ్రి ఎవరు? అనే ఈ భాగంలో మనం చివరి ఘట్టానికి వచ్చాం</u>

ఏసు తన తండ్రి గురించి చెప్పిన మరో ప్రధానమైన లక్షణాన్ని చూస్తే...

<u>లూకా-6:35</u> లో ఏసు ఇశ్రాయేలీయులతో చెప్తున్నాడు. **మీరు మీ శత్రువుల**
**ప్రేమించండి. అప్పుడు మీరు సర్వోన్నతుని కుమారులై యుందురు. ఆయన కృతజ్ఞత లేనివా**
**ఎడలను దుష్టుల ఎడలను ఉపకారియైయున్నాడు.**
కనీసం ఏసు చెప్తున్న ఈ లక్షణమైనా యెహోవాలో ఉందా? అని పరిశీలిస్తే...
<u>నిర్గమ-20:5</u> లో యెహోవా అంటాడు. **"నేను రోషంగల దేవుడను నన్ను ద్వేషించు వా విషయంలో మూడు, నాలుగు తరముల వరకు తండ్రుల దోషము కుమారుల మీద రప్పిస్తాను".**
అంటే యెహోవా తనని ఎవరైనా ద్వేషిస్తే వారిని మాత్రమే గాక వారి పిల్లల్ని, పిల్లల పిల్లల్నీ, వారి పిల్లల్నీ కూడా వదిలిపెట్టను అంటున్నాడు.
కానీ ఏసు చెప్తున్న తండ్రి శత్రువులకి కూడా ఉపకారియై ఉన్నాడు. అది ఏ రకమైన ఉపకారం?
<u>యోహాను-6:63</u> లో ఏసు అంటాడు. **నేను మీతో చెప్పిన మాటలన్నీ ఆత్మయూ, జీవమునై ఉన్నవి.**
అంటే శత్రువులకి కూడా నా తండ్రి ఉపకారి అంటే అది ఏ రకమైన ఉపకారం?
ఆత్మసంబంధమైనది... నిత్యజీవం అనగా మోక్షం.
**అంటే తనని శత్రుభావంతో స్మరించినా మోక్షాన్నిచ్చే లక్షణం ఎవరికుంది?**
**ఎవరు ఆ పరమాత్మ?**
దానికి బైబిల్‌లో సమాధానం దొరకటంలేదు కనుక ఏసు చెప్తున్న ఆ తండ్రి బైబిల్ దాటి వేరే గ్రంథాలలో ఉన్నాడేమో చూస్తే ఈ లక్షణం **శ్రీకృష్ణ భగవానుడికి** ఉన్నట్లు తేలుతుంది.
తనని శత్రుభావంతో అనునిత్యం స్మరించిన శిశుపాలుడు, కంసుడు మొదలగు వారు మోక్షాన్ని పొందారు.
తనని చంపాలని ప్రయత్నించిన పూతన లాంటి రాక్షసులకి కూడా ముక్తిని ప్రసాదించినవాడు **కృష్ణుడు.** ఆశ్చర్యమేమిటంటే!...
ఈమధ్య కొంతమంది దొంగ బోధకులు వేదాలలో ఏసు దేవుడు అంటూ పుస్తకాలు రాశారు. కానీ ఇక్కడేమో ఏసు ఆరాధించిన తండ్రి; ఏసు చెప్పిన ఈ లక్షణాన్ని బట్టి **శ్రీకృష్ణుడిలా** కనబడుతున్నాడు.
కాదు కాదు ఏసు చెప్పిన తండ్రి యెహోవానే అనుకుందామనుకుంటే, ఏసు ఎక్కడా యెహోవా పేరు చెప్పలేదు.
ఆయన చెప్పిన తండ్రి లక్షణాలు ఏవీ కూడా యెహోవా గుణగణాలతో సరిపోలడం లేదు.

అయినా సరే ఏసు చెప్పింది యెహోవా గురించేనని అనాల్సిందే అంటే:
★అపుడు ఏసు అసత్య ప్రచారకుడు అయిపోతాడు.
★యెహోవాలో లేని లక్షణాలని ఉన్నట్టుగా మభ్యపెడుతూ ప్రజలని తప్పుదారి పట్టించడానికి ప్రయత్నించిన వాడిగా మిగిలిపోతాడు.
★దానికన్నా ఏసు చెప్పిన ఆ తండ్రి శ్రీకృష్ణుడు అనుకోవడమే ఆయనకి కొంచెం గౌరవప్రదంగా ఉంటుందేమో ఆలోచించండి.

అలా ఎలా అనుకుంటాం? దాని గురించి ఏసు కనీసం చూచాయగా అయినా చెప్పుండాలి కదా అంటారా? అయితే

యోహాను-16:12 చూడండి. (ఏసు శిష్యులతో) **"నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు గాని ఇపుడు మీరు వాటిని (వినిని) సహింపలేరు"** అంటున్నాడు. ఇక్కడ ఒక్కమాట చెప్పాలి. ఏసు బోధనలలో ఎక్కువలోఎక్కువ మార్మికంగా, నర్మగర్భంగా, ఉపమానరీతిగా ఉంటూ సులభంగా అర్థం కాని విధంగా ఉంటాయి. ఏసు చెప్పవలసినవి ఇంకా చాలా సంగతులు మిగిలే ఉన్నాయట. పైగా వాటిని వింటే మీరు తట్టుకోలేరు అంటున్నాడు. వింటేనే తట్టుకోలేని సంగతులు ఏమై ఉంటాయి? ఇది అలా చదివి ఇలా వదిలేసే ప్రకటన కానేకాదు. తన శిష్యులతో ఆంతరంగిక విషయంగా ఈ మాట అన్నాడంటే అదెంతో ప్రాధాన్యమైన విషయమై ఉంటుంది. ఆ విషయం ఏమై ఉంటుందా అని పరిశీలన చేస్తే అది గందరగోళానికి దారితీస్తుంది కనుక దానిని చూసీచూడనట్లుగా పక్కన పెట్టేస్తారు ఈనాటి మతబోధకులు.

ఇన్నిరోజులూ ఏసు చెప్పిన తండ్రి యెహోవానే అనుకున్నారంతా. కానీ ఇపుడు అకస్మాత్తుగా నా తండ్రి యెహోవా కాదని చెప్తే తట్టుకోలేరని ఈ మాట చెప్తున్నట్టుగా మనం అభిప్రాయపడితే తప్పేముంది?

ఏది ఏమైనా ఇప్పుడు మనముందు రెండు మార్గాలున్నాయి.

**1) ఏసు చెప్పిన తండ్రి యెహోవా కాదు, ఆ లక్షణాలు కొద్దోగొప్పో శ్రీకృష్ణుడిలో కనబడుతున్నాయి.**

**2) ఏసు చెప్పిన తండ్రి యెహోవానే అనుకుంటే పైన చెప్పినట్టుగా లేని విషయాలను ఉన్నట్టుగా ప్రచారం చేస్తూ ప్రజలని మోసగించడానికి ప్రయత్నించిన అసత్య ప్రచారకుడిగా ఏసుని భావించడం.**

యూదులు ఏసుని ప్రవక్తగా అంగీకరించక పోవడానికి ఇది కూడా బలమైన కారణమే. అంతకముందు వచ్చిన ప్రవక్తలందరూ యెహోవా పేరు చెప్పారు. ఏసు ఒక్కడే ఆ పేరు చెప్పలేదు. ఈ పొరపాటు ఎందుకు జరిగింది? అన్నదైనా ఆలోచించాలి. లేదా! ఏసు

పేర్కొన్న తండ్రి యెహోవా కాదనైనా తేల్చాలి. ఇక యూదులు ఏసుని ప్రవక్తగా అంగీకరించక సిలువ వేయడానికి మరో ప్రధాన కారణం ఏసు వారి ధర్మశాస్త్రాన్ని యథావిధిగా పాటించకపోవటం.

**<u>యోహాను-10:8</u> గొర్రెలు పోవు ద్వారమును నేనే. నాకు ముందు వచ్చినవారందరు దొంగలును దోచుకొనువారునై ఉన్నారు.**

ఇక్కడ ఏసు చెప్తున్న ఆ దొంగలు, దోచుకొనువారు ఎవరై ఉంటారు? బైబిల్‌లో గొర్రెలు అంటే ఇశ్రాయేలీయులు. వారివద్దకు ఏసు కంటే ముందుగా వచ్చినది ఎవరు?

మోషే మొదలుకొని మలాకి వరకు పాతనిబంధనలో ఉన్న ప్రవక్తలే కదా!

ఏసు ప్రస్తావించిన ఇలాంటి నర్మగర్భ విషయాలపై బైబిల్ బోధకులు నోరు విప్పరు ఎందుకని?

## 5. భేతాళ ప్రశ్న

★ఏసు ధర్మశాస్త్రాన్ని అమలుచేశాడా? రద్దుచేశాడా?

క్రైస్తవులకి ఇదొక భేతాళ ప్రశ్న. దీనికి ఇంతవరకు ఏ క్రైస్తవుడూ సరైన సమాధానం చెప్పలేదు.

కొంతమంది ఏసు ధర్మశాస్త్రాన్ని నెరవేర్చాడంటారు. ఇంకొంతమంది రద్దు చేశాడంటారు. ఇపుడు కొంతమంది క్రైస్తవులు చెప్తున్నట్టుగా ఏసు ధర్మశాస్త్రాన్ని అమలు చేశాడా? అన్నది పరిశీలించి చూద్దాం.

యోహాను-8:3-11 వాక్యాలు చూస్తే శాస్త్రులు, పరిసయ్యులు కలిసి వ్యభిచారంలో పట్టుబడ్డ ఒక స్త్రీని ఏసు వద్దకు తీసుకు వచ్చి **బోధకుడా! ఈ స్త్రీ వ్యభిచారం చేసినందుకు పట్టుబడింది. ఇలాంటి వారిని రాళ్ళతో కొట్టి చంపాలని మోషే ధర్మశాస్త్రములో మనకి ఆజ్ఞాపించెను గదా. ఈ విషయంలో నీవేమంటావు?**

అని ఏసుని అడుగుతారు. దానికి ఏసు కాసేపు మౌనంగా ఉండినా వారు పట్టు వదలక అడుగగా "**మీలో పాపము లేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయవచ్చునని**" అంటాడు. ఆ మాట విని వారందరూ ఒకరివెంట ఒకరు బైటకి వెళ్ళిపోతారు.

అపుడు ఏసు తలెత్తి ఆమెతో **నీకు ఎవరూ శిక్ష విధింపలేదా? అని అడిగి నేను కూడా నీకు శిక్ష విధింపను. ఇక నీవు పాపం చేయకుండా జీవించమంటాడు.**

ఇక్కడ ఏం అర్థమౌతుంది? ఏసు ధర్మశాస్త్రాన్ని అమలు చేశాడా?

అమలు చేస్తే ధర్మశాస్త్రం ప్రకారం ప్రజలతో ఆమెని రాళ్ళతో కొట్టి చంపమని చెప్పాలి. అలా చెప్పలేదు. మీలో పాపం లేనివాడు ఆమె మీద రాయి వేయండి అన్నాడు. ఇది కొత్త కండిషన్. మోషే ధర్మశాస్త్రంలో అలా చెప్పలేదు పాపం లేనివాళ్ళు మాత్రమే రాళ్ళు వేయమని.

**ఇక రెండవది...** వాళ్ళందరూ పాపాత్ములు కనుక ఆ స్త్రీని కొట్టకుండా వెళ్ళిపోయారు, బాగానే ఉందనుకుందాం! మరి ఏసులో ఏ పాపం లేదు కదా! ఈయనైనా ఆ స్త్రీని రాళ్ళతో కొట్టి చంపాలి కదా. ఎందుకు చంపలేదు? "**నేను కూడా నీకు శిక్ష విధించను పో**" అని ఎందుకు క్షమించాడు?

సాధారణంగా చూస్తే ఇది ఉదారవాదం, మానవతావాదంలా కనిపించవచ్చు. కాని ఏసు అక్కడ ధర్మశాస్త్రాన్ని ధిక్కరిస్తున్నాడు. యెహోవా చంపమంటే చంపాలి. జాలి దయ చూపించకూడదు. ఎందుకంటే అవి దైవాజ్ఞలు.

**అలా అమాలేకీయులు అనే జాతి మొత్తాన్ని పసిపిల్లలతో సహా చంపమంటే చంపకుండా కొన్ని జంతువులని, వాళ్ళ రాజు అగగుని ప్రాణాలతో విడిచి పెట్టినందుకే గదా యెహోవా**

**సౌలుతో నువు నా ఆజ్ఞని పూర్తిగా అమలు చేయలేదు కనుక నువు నా ప్రజల మీద రాజుగా ఉండటానికి పనికిరావు అని అంటాడు.(1వ సమూయేలు 15వ అధ్యాయం)**

అక్కడ సౌలు చేసిన తప్పే ఇక్కడ ఏసు కూడా చేశాడు. అలాగే <u>సంఖ్యా - 31:17,18</u> ఇక్కడ మోషే ఇశ్రాయేలు సైన్యాధిపతులపై కోప్పడుతున్నాడు. **మీరు ఆడువారినందరిని బ్రతుకనిచ్చితిరా?** అని. అంటే యెహోవా ఆజ్ఞ అమలు చేయకుండా మానవత్వంతో ఎవరినైనా చంపకుండా వదిలిపెడితే బైబిల్ ప్రకారంగా అది పాపంగా పరిగణించబడుతుంది. ఆ తరువాతి వాక్యాలలో **కావున మీరు పురుష సంయోగమెరిగిన ప్రతి స్త్రీని చంపుడి. పురుష సంయోగం ఎరుగని ఆడుపిల్లలని మీ నిమిత్తం బ్రతుకనీయుడి.** అని చెప్పిన మోషే ఆజ్ఞని ఇశ్రాయేలీయులు అమలు చేశారు.

ఇంకా <u>మత్తయి-5:21-48</u> వచనాల వరకు చూస్తే ఏసు ధర్మశాస్త్రంలోని ఆజ్ఞలకు మార్పులు చేసినట్టుగా గమనించవచ్చు.

<u>ఉదా:కి 5:38</u> **కంటికి కన్ను పంటికి పన్ను అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. <u>నేను మీతో చెప్పునది ఏమనగా</u> దుష్టుని ఎదిరింపక నిన్ను కుడి చెంప మీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడా త్రిప్పుము.**

ఈ విధంగా మార్పులు చేశాడు.

ఈ విషయాలన్నీ గమనిస్తే ఏం అర్థమౌతుంది?

ఏసు ధర్మశాస్త్రాన్ని నెరవేర్చాడు అని చెప్పడం కుదరదు.

పోనీ కొంతమంది క్రైస్తవులు చెప్తున్నట్టుగా ధర్మశాస్త్రాన్ని రద్దు చేశాడా? ఈ విషయం చూద్దాం.

<u>మత్తయి-5:17</u> **ధర్మశాస్త్రమునైననూ ప్రవక్తల వచనములనైననూ కొట్టివేయవచ్చితినని తలంచవద్దు. నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియూ గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయూ నెరవేరువరకు దాని నుండి యొక పొల్లయిననూ సున్నాయైననూ తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.**

అని స్వయంగా ఏసే చెప్పాడు. అంతే కాదు

<u>లూకా-10:25</u> **లో ఒక ధర్మశాస్త్రోపదేశకుడు "బోధకుడా! నిత్య జీవానికి వారసుడనగుటకు నేనేమి చేయవలెనని" ఏసుని అడుగుతాడు. అందుకు ఏసు ధర్మశాస్త్రమందు ఏమి వ్రాయబడియున్నది? అని అతనిని అడుగుతాడు. అందుకతడు నీ దేవుడైన ప్రభువును పూర్ణహృదయముతో, పూర్ణ మనస్సుతో, పూర్ణ శక్తితోనూ ప్రేమింపవలెననియూ, నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెననియూ వ్రాయబడియున్నదని చెప్పెను. అపుడు ఏసు నీవు సరిగా ఉత్తర మిచ్చితివి అలాగు చేయుము అపుడు జీవించెదవని అతడితో చెప్పెను.**

అంటే ఇక్కడ ఏమి అర్ధమౌతుంది? ఏసు ధర్మశాస్త్రాన్ని రద్దు చేయలేదు అందులో ఉన్న ఆజ్ఞలని అనుసరించమనే చెప్తున్నాడు.
ఇక్కడ మనం గమనించాల్సిన ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే;
మనుషులు నిత్య జీవం పొందాలంటే ఏసు రక్తం చిందించాలి. ఆయన పాపుల కోసం చనిపోయాడని నమ్మితేనే రక్షింపబడతారు. లేకపోతే నిత్య నరకానికి పోతారు అని క్రైస్తవులు చెప్పే మతిలేని సిద్ధాంతాలని కూడా ఏసు ఇక్కడ ఖండిస్తున్నాడు.

నిత్య జీవం పొందాలంటే నేను సిలువపై మరణిస్తాను నన్ను నమ్ముకోండి అని ఏసు చెప్పలేదు సరికదా! ధర్మశాస్త్రంలో ఉన్న ప్రధానమైన ఆజ్ఞలని అనుసరించమని స్పష్టంగా చెప్తున్నాడు కూడా.
మరి ఆయన సిలువపై చనిపోవడం ఎందుకు? క్రైస్తవులు అలా ఎందుకు ప్రచారం చేస్తున్నారు? ఈ విషయాల గురించి ముందు భాగాల్లో ఇంకాస్త విపులంగా తెలుసుకుందాం.(ఈ మాటలు జ్ఞప్తిలో ఉంచుకోండి)
**మొత్తమ్మీద ఏసు ధర్మశాస్త్రాన్ని రద్దు చేయలేదు అనే విషయం సుస్పష్టం.** అయినా సమస్య ఇంకా పూర్తిగా పరిష్కారం కాలా.
ఇపుడు మళ్ళీ మరో పెద్ద సందేహం వస్తుంది కదా!
1) కొంతమంది క్రైస్తవులు; ఏసు ధర్మశాస్త్రాన్ని అమలు చేశాడంటున్నారు. కాని ఆయన వ్యభిచారం చేసిన స్త్రీని క్షమించాడు. కొన్ని ఆజ్ఞలని మార్చాడు కనుక ఏసు ధర్మశాస్త్రాన్ని అమలు చేసినట్టు కాదు అంటున్నారు.
2) మరోప్రక్క ఇంకొంతమంది క్రైస్తవులు; ఏసు ధర్మశాస్త్రాన్ని రద్దు చేశాడంటున్నారు. కాని ***"భూమి, ఆకాశం గతించినా కూడా ధర్మశాస్త్రంలో ఒక పొల్లయినను, సున్న అయినను తప్పిపోదని"*** ఏసే స్వయంగా చెప్పాడు.
పైగా నిత్యజీవం పొందాలంటే ధర్మశాస్త్రంలో ఉన్న ఆజ్ఞలనే అనుసరించమని చెప్పాడు కనుక ఏసు ధర్మశాస్త్రాన్ని రద్దు చేసినట్టు కాదు అంటున్నారు.
మరైతే ఏసు ధర్మశాస్త్రాన్ని అమలూ చేయక, రద్దూ చేయక ఏం చేశాడో నువ్వు చెప్పు అని అడగాలనిపిస్తుంది కదా.
**వస్తున్నా అక్కడికే వస్తున్నా...**
బైబిల్‌లో ఉన్నది ఉన్నట్టుగా చూస్తే ఏమర్ధమౌతుందంటే;
**"ఏసు ధర్మశాస్త్రాన్ని యథాతథంగా అమలూ చేయలేదు మొత్తంగా రద్దూ చేయలేదు. అవసరమనుకున్నచోటల్లా తనకు నచ్చిన రీతిలో సంస్కరించాడు".**
సంస్కరించడం అంటే అప్పటి వరకూ అమలులో ఉన్న నియమాలని గ్రుడ్డిగా

అనుసరించడమో, లేక మొత్తంగా తీసి పక్కన పెట్టేయడమో కాదు.
పాతవాటిలో ఉన్న మంచిని తీసుకొని, చెడుని తొలగించి, ఇంకొన్ని సమాజహితమైన కొత్త నియమాలను జోడించి, కాలానుగుణంగా చేసే మార్పులనే సంస్కరణలు అంటారు.
యెహోవా మోషేకు ఇచ్చిన ధర్మశాస్త్రంలో...
**భర్తకి భార్యపై అనుమానం వస్తే ఆమెకి ఖురదనీళ్ళు తాగించాలి. ఆమె తప్పు చేస్తే కడుపు ఉబ్బి నడుం పడిపోతుంది. లేకపోతే గర్భం వస్తుంది.** (గొప్పగా ఉంది కదూ దేవుని పరీక్షా పద్ధతి) **(సంఖ్యా కాండం - 5:11-28)**
**పాప క్షమాపణ కోసం జీవున్ని బలివ్వాలి. (లేవీయ-4వ అ.)**
ఇలాంటి అనేక మూఢనమ్మకాలతో పాటు
**వ్యభిచారం చేసిన స్త్రీని రాళ్ళతో కొట్టి చంపాలి. (ద్వితీ-22:13-21).**
**నీవు ఎవరిని కటాక్షించకూడదు కంటికి కన్ను పంటికి పన్ను కాలుకి కాలు చేయికి చేయి చెల్లి తీరాలి. (ద్వితీ-19:21)**
**నీ దేవుడైన యెహోవా స్వాస్థ్యముగా నీకిచ్చుచున్న ఈ జనముల పురములలో ఊపిరిగల దేనినీ బ్రతుకనీయకూడదు. (ద్వితీ-20:18)**
ఇలా హింసను క్రూరమైనరీతిలో ప్రేరేపించే అంశాలు కూడా ఎన్నో ఉన్నాయి.
అందువల్ల; ఏసు ఇలాంటి మూఢనమ్మకాలనూ, హింసనూ ఖండిస్తూ **పాపక్షమాపణ కోసం మారు మనసు పొందండి. మీ శత్రువులని కూడా ప్రేమించండి** అంటూ క్రొత్త నియమాలు ప్రవేశపెట్టాడు. అదే సమయంలో ధర్మశాస్త్రంలో తనకి సబబు అనిపించిన విషయాలను అనగా **నీ దేవుడైన ప్రభువుని పూర్ణ హృదయంతో ఆరాధించుము. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించుము.**
ఇలాంటి ఆజ్ఞలను మాత్రం తూ.చ తప్పకుండా పాటించమని చెప్పాడు.
ఇంకా విశ్రాంతి దినం రోజు **పనిచేస్తే రాళ్ళతో కొట్టి చంపాలి** అనే ఆజ్ఞని కూడా ఆయన ఆక్షేపించాడు.
**విశ్రాంతి దినమున మేలు చేయుట ధర్మమా, కీడు చేయుట ధర్మమా?(మార్కు-3:4)**
**అంటూ విశ్రాంతి దినం రోజు మంచిపని చేస్తే తప్పేంటి?**
అంటూ పరిసయ్యులను, శాస్త్రులను ప్రశ్నించాడు.
కాని ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే ఏసు ప్రశ్నించాల్సింది పరిసయ్యులని యూదుల్ని కాదు, **బైబిల్ దేవుడు యెహోవాని లేదా ధర్మశాస్త్రం వ్రాసిన మోషేని.**
యెహోవా ఇచ్చిన ధర్మశాస్త్రాన్ని ఇశ్రాయేలీయులు కేవలం నమ్మి అనుసరిస్తున్నారంతే.
అయితే ఏసు ధర్మశాస్త్రాన్ని సంస్కరించాలని అనుకున్నప్పుడు ఆ విషయాన్ని సూటిగానే

చెప్పొచ్చు కదా. "నేను ధర్మశాస్త్రాన్ని కొట్టేయడానికి రాలేదు నెరవేర్చడానికే వచ్చాను. భూమి ఆకాశం గతించినా కూడా అందులో పొల్లయినా, సున్నా అయినా తప్పిపోదు" అని ఎందుకన్నాడు? ఎందుకంటే; నేను ధర్మశాస్త్రాన్ని సవరిస్తాను అనిగాని ఏసు అనుంటే యూదులు వెంటనే ఆయన్ని రాళ్ళతో కొట్టి చంపేసేవారు.

అది యెహోవా ఆజ్ఞ కనుక వాళ్ళు దానిని ఖచ్చితంగా పాటిస్తారు.

అందువల్ల ఏసు ఇక్కడ కొంచం లౌక్యం ప్రదర్శించాడు.

నేను ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడానికే వచ్చాను అంటూనే తన భావాలని(అజెండాని) ప్రవేశపెట్టాడు.

ఈ సందర్భంలో ఏసు చేసిన ఒక ముఖ్యమైన ప్రకటనను కూడా మనం గమనించాలి.

**లూకా-12:49 నేను భూమి మీద అగ్నివేయ వచ్చితిని. అది ఇదివరకే రగులుకొని మండవలెనని ఎంతో కోరుచున్నాను.**

**అయితే నేను పొందవలసిన బాప్తిస్మమున్నది. అది నెరవేరు వరకు నేనెంతో ఇబ్బంది పడుచున్నాను** అంటాడు.

**51-53వ** వచనంలో **నేను భూమి మీద సమాధానము కలుగజేయవచ్చితినని తలంచుచున్నారా? కాదు భేధమునే కలుగజేయ వచ్చితినని మీతో చెప్పుచున్నాను. ఇప్పటినుండి ఒక ఇంటిలో అయిదుగురు వేరుపడి ఇద్దరికి విరోధముగా ముగ్గురును, ముగ్గురికి విరోధముగా ఇద్దరును ఉండెదరు. తండ్రికి కుమారునికి, తల్లికి కుమార్తెకూ, అత్తకు కోడలికి విరోధము పెట్టవచ్చితిని.**

అంటే అప్పటివరకు ఒకే కుటుంబంలో కొందరు వారికున్న నమ్మకాలను సంప్రదాయాలను అనుసరిస్తున్నవారుగానూ, తను ప్రవేశపెట్టే విప్లవాత్మకమైన మార్పులని సమర్థించేవారుగానూ ఇలా రెండు వర్గాలుగా విడిపోతారు. కనుక వారు కుటుంబసభ్యులు అయినప్పటికీ వారిమధ్య మనస్పర్థలు వస్తాయని చెప్తున్నాడు.

**★ధర్మశాస్త్రానికి సవరణలు చేయడం అంటే ప్రాణాలతో చెలగాటమాడటం అనే విషయం ఏసుకి మాబాగా తెలుసు.**

ప్రాణానికి ముప్పు అని తెలిసినా; ఒక మంచి సమాజ నిర్మాణం కోసం ధైర్యంగా ముందడుగు వేసిన ఏసుని తెగువగల సంఘసంస్కర్తగా మనమందరం అంగీకరించి తీరాలి. అందుకతన్ని అభినందించాలి కూడా.

(శక్తి మేరకు మనమెంచుకున్న అంశాల వరకు మనమూ అదే సాహసాన్ని కలిగుండాలి.)

**ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏంటో తెలుసా?**

బైబిల్ దేవుడు యెహోవా ఇచ్చిన ధర్మశాస్త్రం మీద తిరుగుబాటు అనేది ఏసుతోనే ప్రారంభమవ్వలేదు.

ఏసు తండ్రి (ప్రాపంచిక తండ్రి) యోసేపులో కూడా ఈ భావజాలం కనిపిస్తుంది. తనకి భార్యగా ప్రధానం చేయబడిన మేరీ తనతో కలవక మునుపే గర్భవతిగా ఉండడం విషయం యోసేపుకు తెలుస్తుంది. ఆమె వ్యభిచారం చేసిందని అతడు బావిస్తాడు. అతనుగాని పూర్తిగా యెహోవా ధర్మశాస్త్రానికి విధేయుడు అయ్యుంటే మేరీని ప్రజలందరి చేత రాళ్ళతో కొట్టి చంపించి ఉండేవాడు.

కాని అలా చేయకుండా దయాగుణంతో ఆమెని పరిత్యజించడానికి ఇష్టపడతాడు. **అనుకోకుండానో కావాలనో ఇందులో మత్తయి(ఏసు శిష్యుడు) కూడా జత కలిశాడు.** యెహోవా ధర్మశాస్త్రానికి విరుద్ధంగా మేరీని రాళ్ళతో కొట్టి చంపకుండా క్షమించి విడిచిపెట్టినవారిని లెక్కప్రకారం ఆజ్ఞాతిక్రమణ చేసిన దైవద్రోహి అని సంబోధించాలి. కాని <u>**మత్తయి 1:19**</u> **లో ఆమె భర్తయైన యోసేపు "నీతిమంతుడై" యుండి ఆమెను అవమానపరచనొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను.** అన్నాడు.

యెహోవా ధర్మశాస్త్రాన్ని ధిక్కరిస్తున్న యోసేపుని మత్తయి **నీతిమంతుడు** అని సంబోధిస్తున్నాడు.

ఆ తరువాత స్వప్నంలో దేవదూత యోసేపుకి కనపడి మేరీ **పరిశుద్ధాత్మ వల్ల గర్భవతి అయినది** కనుక ఆమెను నీ భార్యగా చేర్చుకోమని చెప్పినట్టుగా ఉంటుంది. పరిశుద్ధాత్మ వల్ల గర్భవతి అయినది అనే విషయం తెలియకముందు ఆమె వ్యభిచారం చేసిందని నిర్ధారించుకున్న యోసేపు ఏం చేయాలి?

ఆమెను రాళ్ళతో కొట్టి చంపించడానికి సిద్ధపడాలి కదా. కాని అలా చేయక క్షమించి విడిచిపెడతాడు. అలా విడిచిపెట్టాలనుకున్న యోసేపుని మత్తయి నీతిమంతుడు అంటున్నాడు. **అంటే యెహోవా ధర్మశాస్త్రంలోని ఈ అమానుషమైన ఆజ్ఞలపై ప్రజల్లో అప్పటికే అసంతృప్తి, అయిష్టత ప్రవేశించి ఉందన్నమాట!**

మానవతావాదంతో చూస్తే యెహోవా ఆజ్ఞలు సమంజసం కాదు అనే స్పృహ కూడా వారు కలిగి ఉన్నారు. కాని ఆ విషయం బహిరంగంగా చెప్పడానికి యూదా పెద్దల భయం వలన ఎవరూ సాహసించలేదు.

ఏసు కూడా కొంత లౌక్యం ప్రదర్శించినప్పటికీ, యెహోవా ధర్మశాస్త్రంపై సాహసోపేతంగా తిరుగుబాటు చేశాడన్నది నిజం.

కనుక ఏసు ధర్మశాస్త్రాన్ని అమలు చేశాడా? రద్దు చేశాడా? అనే భేతాళ ప్రశ్నకు సరైన సమాధానం ఆయన ధర్మశాస్త్రాన్ని అమలూ చేయలేదు, రద్దూ చేయలేదు సంస్కరించాడు.

## 6. ఏలియా పునర్జన్మ:

బైబిల్‌లోని ప్రధానమైన ప్రవక్తలలో ఏలియా ఒకడు.

క్రీస్తులాగే బైబిల్‌లో ఉన్న పాత, క్రొత్త నిబంధనలు రెండింటిలోనూ ఏలియా ప్రస్తావన ఉంటుంది. కాని ఇద్దరికీ ఒక చిన్న తేడా ఉంది.

క్రీస్తు అంటే ఇశ్రాయేలీయులను రక్షించడానికి పుట్టబోయే ఒక రక్షకుడు అని పాతనిబంధనలో ప్రవక్తలు చెప్పారు.

అంటే పాతనిబంధన కాలంలో క్రీస్తు పుట్టలేదు, భవిష్యత్తులో పుట్టబోతున్నాడు అని చెప్పారు.

కాని ఏలియా అలాకాదు. పాతనిబంధన కాలంలోనే **ఏలియా పుట్టి జీవించి పరలోకానికి ఆరోహణ అయ్యాడు.(2వరాజులు-2:11)**

ఐతే ఏలియా మళ్ళీ భవిష్యత్తులో వస్తాడు అని పాతనిబంధనలో యెహోవా చెప్పాడు. అందువల్ల ఇశ్రాయేలీయులు క్రీస్తు అనే ప్రవక్తతో పాటు ఏలియా కోసం కూడా ఎదురు చూస్తుండేవారు.

**అసలు పరలోకానికి వెళ్ళిపోయిన ఏలియా మళ్ళీ రావాల్సిన అవసరం ఏమిటి? వచ్చి ఏం చేస్తాడు.?**

**ఒకవేళ వస్తే క్రీస్తుకన్నా ముందు రావాలా? క్రీస్తు తరవాత రావాలా?**

**క్రీస్తుకన్నా ముందు అయితే వచ్చాడా? లేదా?**

ఇలాంటి విషయాలన్నింటినీ ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

ఒక సందర్భంలో ఏసు శిష్యులు ఏలియా గురించి ఏసుని అడుగుతారు.

**<u>మత్తయి-17:10</u> అప్పుడాయన శిష్యులు ఆలాగైతే ఏలియా ముందుగా రావలెనని శాస్త్రులెందుకు చెప్పుచున్నారని ఆయననడిగిరి.**

ఇక్కడ శిష్యులు అడుగుతున్నట్టుగా ఏలియా ముందుగా రావాలి అంటే ఎవరికంటే ముందుగా రావాలి?

క్రీస్తు కంటే ఏలియా ముందు రావాలి. అని ఎలా చెప్పగలం? అంటే పైన ఏసుని శిష్యులు అడిగిన వెంటనే ఏసు ఏమంటున్నాడో చూడండి.

**<u>11, 12వ.</u> అందుకాయన ఏలియా వచ్చి సమస్తమును చక్కబెట్టుననుమాట నిజమే. అయిననూ ఏలియా ఇదివరకే వచ్చెను. వారతనిని ఎరుగక తమకిష్టము వచ్చినట్టు అతని ఎడల చేసిరి.**

అంటే ఏలియా ముందు వస్తాడనే మాట నిజమే. అలాగే ఆయన వచ్చాడు కూడా? కానీ

వారు అంటే ఇశ్రాయేలీయులు ఏలియాని గుర్తుపట్టక తమ ఇష్టమొచ్చినట్లుగా ఆయనపట్ల ప్రవర్తించారు అని అంటున్నాడు ఏసు.

ఆ తరువాత వచనంలో **అప్పుడాయన బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి తమతో చెప్పెనని శిష్యులు గ్రహించిరి** అని ఉంది.

ఏసు తాను క్రీస్తుని అని చెప్పుకున్నాడు. ఐతే క్రీస్తుకన్నా ముందు ఏలియా రావాలని అందరూ చెప్తున్నారు కదా! అని శిష్యులు అడిగినపుడు తన కంటే ముందుగా వచ్చిన యోహానును చూపించి ఈ యోహానే ఏలియా అని చెప్పాడు.

అంటే క్రీస్తుకన్నా ముందు ఏలియా రావాలనే విషయం ఏసు కూడా నిర్ధారించాడు. **కానీ ఇక్కడ ఏసు చెప్పినట్టుగా యోహానే ఏలియా అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే ఆ విషయాన్ని బైబిల్ ఖండిస్తుంది కనుక.**

అదేంటి? ఏసు చెప్పిన విషయాన్ని బైబిల్ ఖండించడం ఏమిటి? అని ఆశ్చర్యపోతున్నారా? అదే కదా బైబిల్ గొప్పతనం.

అందుకే కదా; అంతా గజిబిజి గందరగోళంగా, వైకుంఠపాళి ఆటలా ఉంటుందని మొదట్లోనే చెప్పాను.

- చిన్న ప్రవక్తలు చెప్పినదానిని పెద్ద ప్రవక్తలు ఖండిస్తారు.
- పెద్ద ప్రవక్తలు చెప్పినదానిని ఏసు ఖండిస్తాడు.
- ఏసు చెప్పినవాటిని యెహోవా ఖండిస్తాడు.
- యెహోవా చెప్పినవాటిని ఏసు ఒప్పుకోడు.

★ **"చిన చేపను పెదచేప, చినమాయను పెనుమాయ ఇది స్వాహా అది స్వాహా." అన్నట్టుగా ఉంటుంది.**

ఇంకో అద్భుతం ఏమిటంటే ఈ చిన చేపల్ని, పెదచేపల్ని అన్నిటినీ కలిపి మింగిన అతిపెద్ద తిమింగలం పౌలు.

**ఈ పౌలు చిన్న ప్రవక్తలు, పెద్ద ప్రవక్తలు, ఏసు, యెహోవా అందరినీ కలిపి అటకెక్కించాడు. అదెలాగో ముందుముందు మీరే చూద్దురు గాని.**

ఇక విషయంలోకి వస్తే; ఏసు చెప్పినట్టుగా యోహానే ఏలియా అనడానికి బైబిల్లో ప్రధానంగా మూడు విషయాలు అడ్డొస్తున్నాయి. అవేంటో చూద్దాం.

<u>1) యోహాను సాక్ష్యం:</u> నేను ఏలియాను కాదని స్వయంగా యోహానే చెప్పాడు.

**<u>యోహాను-1:19-21</u> నీవెవడవని అడుగుటకు యూదులు యెరూషలేము నుండి యాజకులను లేవీయులను యోహాను నొద్దకు పంపినపుడు అతడిచ్చిన సాక్ష్యమిదే. అతడు ఎరుగననక ఒప్పుకొనెను. క్రీస్తును కానని ఒప్పుకొనెను. కాగా వారు మరి నీవెవరవు? "నీవు**

**ఏలియావా?" అని అడుగగా అతడు కాదనెను.**

అంటే స్వయంగా యోహానే నేను క్రీస్తుని కాదు, ఏలియానూ కాదు అని ఒప్పుకున్నాడు. మరి తాను ఎవరినని చెప్పాడు? అని చూస్తే...

**<u>23వ.</u> అందుకతడు ప్రవక్తయైన యెషయా చెప్పినట్టు నేను ప్రభువు త్రోవ సరాళము చేయుడి అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒకని శబ్దము అని చెప్పెను.**

అంటే నేను యెషయా గ్రంథంలో వ్రాయబడినట్టుగా అరణ్యంలో కేకలువేయు ఒకని శబ్దాన్ని అని చెప్తున్నాడు.

తాను ఏలియాను కాదు అనడంతోపాటు తాను ఎవరిని అనేదానిపై యోహానుకి ఒక స్పష్టత ఉంది.

మరి ఇపుడు యోహానే ఏలియా అని చెప్తున్న ఏసు మాట నమ్మాలా? లేక నేను ఏలియాను కాదు అని స్వయంగా చెప్తున్న యోహాను మాట నమ్మాలా?

వదిలిపెట్టేస్తే ఇది చిన్న సమస్యే కాని, పట్టించుకుంటే మాత్రం మింగుడుపడనంత పెద్ద సమస్యై కూర్చుంటుంది. ఎందుకంటే...

యోహాను మాటని తేలిగ్గా తీసేయడానికి వీలు లేదు.

**"స్త్రీలు కనిన వారిలో యోహాను కంటే గొప్పవాడు పుట్టలేదని"** ఏసే చెప్పాడు.

ఏసుకి బాప్తిస్మం ఇచ్చింది కూడా యోహానే.

బైబిల్‌లో ఇంత విశిష్ట స్థానం ఉన్న యోహాను నేను ఏలియాను కాదు అని చెప్పిన మాటని పరిగణలోకి తీసుకోవలసిందే. కనుక ఇక్కడ యోహానే ఏసుకి ప్రతిబంధకంగా మారుతున్నాడు.

<u>2) యెహోవా సాక్ష్యం:</u> యోహాను ఏలియానా? కాదా? అనే విషయంలో యెహోవా దగ్గరనుంచి ఏమైనా మార్గదర్శకత్వం ఉందా అని చూస్తే పాత నిబంధనలో ఒక వాక్యం కనపడుతుంది

**<u>మలాకి-4:5,6</u> యెహోవా నియమించిన భయంకరమైన ఆ మహాదినము రాకమునుపు నేను ప్రవక్తయగు ఏలీయాను మీ యొద్దకు పంపుదును. నేను వచ్చి దేశమును శపించకుండనట్లు అతడు తండ్రుల హృదయములను పిల్లల తట్టును, పిల్లల హృదయములను తండ్రుల తట్టుకు త్రిప్పును.**

ఈ వాక్యంలో యెహోవా నియమించిన భయంకరమైన ఆ మహాదినం అంటే ఏసు రెండవ రాకడ, ప్రళయ దినం అని విశ్లేషిస్తారు క్రైస్తవులు. కాని అక్కడ ఆ అర్థం రాదు. అంతకముందు వాక్యం చూస్తే

**<u>మలాకి-4:4</u> హోరేబు కొండమీద ఇశ్రాయేలీయులందరి కొరకై నేను నా సేవకుడైన మోషేకు**

**ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమును దాని కట్టడలను, విధులను జ్ఞాపకము చేసుకొనుడి.**
అని ఉంది.
ఇక్కడ ధర్మశాస్త్రం గురించి ప్రస్తావిస్తున్నాడు.
ధర్మశాస్త్రంలో ఎక్కడా ప్రళయదినం, పరలోకరాజ్యం ప్రస్తావన లేదు. కాకపోతే నా మాట వినక నా ఆజ్ఞలను అనుసరించకపోయిన యెడల మీకు కీడు కలుగుతుంది, మీరు అన్ని విధాలుగా నాశనమౌతారు అని ఇశ్రాయేలీయులతో అంటాడు.
అలా ఇశ్రాయేలీయులు సర్వనాశనం అయ్యే ఆ భయంకరమైన మహాదినం రాకముందు నా ఉగ్రత నుండి మిమ్ములను తప్పించి సరైన దారిలో నడిపించడానికి ప్రవక్త ఏలియాని మీ యొద్దకు పంపిస్తాను. అతను వచ్చి మీ నడవడికను సరిచేస్తాడు అని యెహోవా మలాకీ గ్రంథంలో చెప్తున్నాడు.

**ఇక్కడ బాగా పరిశీలిస్తే ఒక విషయం అర్థమౌతుంది. అదేంటంటే ఏలియా వచ్చి ఇశ్రాయేలీయులలో తండ్రుల హృదయములను పిల్లల తట్టును, పిల్లల హృదయములు తండ్రుల తట్టును తిప్పడం అంటే వారిని సరైన మార్గంలో నడిపించడంలో విజయవంతమౌతాడు. అని ఉందేగాని; అతను విఫలమౌతాడు, ఇశ్రాయేలీయులు అతన్ని అంగీకరించరు అని లేదు.**
మరి యోహాను ఏలియా అనుకుందామంటే ఏసు చెప్తున్న మాట ప్రకారమే యోహానుని ఇశ్రాయులీయులు అంగీకరించక అతనిని ఎరుగక తమకిష్టమొచ్చినట్టు చేశారు. అంటే యోహాను ఇశ్రాయేలీయులను సరైన దారిలో నడిపించడంలో విఫలమయ్యాడు. ఇశ్రాయేలీయులు అతన్ని అంగీకరించలేదు.
కనుక యోహాను ఏలియా అనుకుంటే అపుడు యెహోవా చెప్పిన భవిష్యత్ ప్రవచనం వ్యర్థమైపోతుంది.
తాను పంపిన ప్రవక్తని ఇశ్రాయేలీయులు అంగీకరించరనే భవిష్యత్ యెహోవాకి తెలియదు అని అర్థం వస్తుంది.
**అపుడు యెహోవా సర్వజ్ఞతే ప్రశ్నార్థకమౌతుంది.**
కావున బైబిల్ దేవుడు యెహోవా ఏలియా విషయంలో చెప్పిన ప్రవచనాన్ని బట్టి యోహాను ఏలియా అవడం కుదరదు.
**<u>3) బైబిల్ సాక్ష్యం:</u>** బైబిల్ ప్రవక్తలందరూ చాలా విషయాలలో ఒకరికొకరు విభేదించినప్పటికీ, ఒక్క విషయంలో మాత్రం ఏకాభిప్రాయం కలిగి ఉన్నట్టుగా కనపడుతుంది. అదేంటంటే జీవుడికి ఒక్కటే జన్మ. ఆ తరువాత నిత్యజీవమో, నిత్యనరకమో వస్తుంది.
మళ్ళీ ఈ మరణానంతర నిత్యజీవితంపై అందరిమధ్య స్పష్టత కరువైనప్పటికీ, జీవుడికి

మరుజన్మ(లు) ఉంటాయని మాత్రం ఎవ్వరూ చెప్పలేదు.

**అంటే మొత్తంమీద బైబిల్ పునర్జన్మ సిద్ధాంతాన్ని అంగీకరించదు అనే విషయాన్ని మాత్రం రూఢిగా చెప్పవచ్చు.**

ఇక్కడ ఒక విషయాన్ని చెప్పుకుంటే సందర్భోచితంగా ఉంటుంది. కొంతమంది ఆధునిక క్రైస్తవ ప్రచారకులు వేదాలు బైబిల్ సారం ఒక్కటే, రెండిటిలో చెప్పబడిన విషయాలు ఒక్కటే, వేదాలు పురాణాలు కూడా ఏసునే దేవుడిగా చూపిస్తున్నాయి అంటూ ప్రసంగించడం మొదలుపెట్టారు. పుస్తకాలు కూడా రాసిపారేశారు.

వీళ్ళకి కనీస ఇంగితజ్ఞానం కూడా లేదని ఆ రెంటినీ పరిశీలించిన వారికి ఇట్టే అర్థమైపోతుంది.

వేదాలు, పురాణాలతో పాటు భారతీయ సాహిత్యమంతా పునర్జన్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తుంది. జీవుడు కర్మఫలాలు అనుభవించడానికి అనేక జన్మలు ధరిస్తాడని, పాప పుణ్య కర్మలను అనుసరించి స్వర్గ నరకాది లోకాలకు వెళ్ళి తిరిగొస్తుంటాడని, కర్మబంధాలనుంచి విముక్తుడయ్యాక మోక్షం లభిస్తుందని భారతీయ గ్రంథాలు వివరిస్తున్నాయి.

**పునర్జన్మ సిద్ధాంతాన్ని జీవనాడిగా కలిగి ఉన్న భారతీయ సాహిత్యానికి, పునర్జన్మ సిద్ధాంతాన్ని నామమాత్రంగానైనా అనుమతించని బైబిల్‌కి పొత్తు ఎక్కడ కుదురుతుంది? బుద్ధిలేనివాళ్ళ మెదళ్ళలో తప్ప లేదా కపటుల పన్నాగంలో తప్ప.**

ఈ రెండు మతాలూ ఒకటే అని చెప్తున్నారంటే వీళ్ళకి మతిభ్రమించింది అనుకోవాలా? లేక ప్రజల్ని మోసం చేసి తమ పబ్బం గడుపుకునే ఎత్తుగడలో ఇదంతా ఒక భాగమనుకోవాలా?

సరే మనం అసలు విషయానికి వద్దాం...

పైన చెప్పినట్టుగా బైబిల్‌లో పునర్జన్మ సిద్ధాంతానికి ఏమాత్రం ఆస్కారం లేదు.

కాని ఏలియానే యోహానుగా వచ్చాడు అని **ఏసు చెప్తున్న విషయాన్ని బాగా పరిశీలిస్తే పునర్జన్మ సిద్ధాంతమే ప్రతిబింబిస్తుంది.**

ఎలాగంటే; ఏలియా పాతనిబంధన కాలంలో జీవించిన ప్రవక్త. అతను జీవిత చరమాంకంలో పరలోకానికి ఆరోహణ అయిపోయాడు.

ఏలియాని మళ్ళీ పంపిస్తానని బైబిల్ దేవుడు చెప్పాడు.

ఐతే ఏలియాని ఎలా పంపిస్తానన్నాడు? అతనికి మరోజన్మ ఇస్తానని బైబిల్ దేవుడు చెప్పలేదు కదా! ఏలియా ఏ శరీరంతో పరలోకానికి ఆరోహణ అయ్యాడో తిరిగి అదే శరీరంతో మళ్ళీ పంపిస్తాను అని యెహోవా చెప్పినట్టుగా ఎందుకు భావించకూడదు?

ఇప్పుడు ఏసు చెప్పినట్టు ఏలియా ఆత్మ మరో స్త్రీ గర్భంలో ప్రవేశించి యోహానుగా జన్మించడం అంటే అది ఏలియాకి పునర్జన్మే అవుతుంది.

బైబిల్‌కి విరుద్ధమైన పునర్జన్మ సిద్ధాంతాన్ని ఏసు ఎందుకు సమర్ధించాడు?

నేను క్రీస్తుని అని చెప్పినపుడు నీవు క్రీస్తువైతే నీకన్నా ముందు ఏలియా రావాలి కదా! అని ప్రజలు ఏసుని ప్రశ్నిస్తే వేరే దారిలేక యోహానుని చూపించి, ఇతనే ఏలియా అని చెప్పినట్టుగా అనుకోవాల్సివస్తోంది. లేదు ఏసు చెప్పినట్టు యోహానే ఏలియా అనుకుంటే యోహాను అబద్ధీకుడు అవుతున్నాడు.

మరోవంక యెహోవాకి భవిష్యత్ తెలియదని చెప్పక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

మొత్తంగా బైబిల్ సిద్ధాంతానికి భంగం కలుగుతుంది.

అంటే ఏసు ఒక పక్క; యెహోవా, బైబిల్, యోహాను ఒక పక్క ఉన్నారు.

ఇక ఇప్పుడు బైబిల్ మాకు తప్ప ఇంకెవరికీ అర్థం కాలేదు అని ప్రగల్భాలు పలికే క్రైస్తవ స్వయం ప్రకటిత మేధావులు ఈ రెండింటిలో దేనికి ఓటేస్తారో చూడాలి. దేనికి భుజం కాసినా రెండోది పడిపోతుంది. "ముందు నుయ్యి, వెనుక గొయ్యి" అన్నమాట.

# 7. అపరిచితుడు

అపరిచితుడు అంటే పరిచయం లేనివాడు అని అర్థం.

బైబిల్‌లోనే ఉన్నప్పటికీ మనకి అంతగా పరిచయంలేని ఏసుని మీకు ఇప్పుడు పరిచయం చేయబోతున్నా. సరిగా అర్థం కాలేదా?

బైబిల్‌లో ఉన్న ఏసు చెప్పే మాటలలోగాని, చేసే పనులలోగాని, భిన్న పార్శ్వాలు, అనేక కోణాలు చాలా ఉన్నాయి.

కాని నేను ఉపోద్ఘాతంలో చెప్పినట్టుగా బైబిల్ ప్రచారకులు వాటన్నిటినీ కనుమరుగు చేసి "చూడు ఒకవైపే చూడు, రెండోవైపు చూడాలనుకోకు, తట్టుకోలేవు" అని ఏదో సినిమాలో చెప్పినట్టుగా ఏసుని ఒకవైపే చూపిస్తూ వస్తున్నారు.

ఇప్పుడు ఏసులో ఉన్న ఆ అనేక కోణాలు ఏమిటో చూద్దాం.

క్రైస్తవ మతబోధకులు ఏసు గురించి ఎక్కువగా ప్రచారం చేసే విషయం

**"ఏసు మీ శత్రువులను ప్రేమించండి మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుండి"** - (మత్తయి-5:44) అని చెప్పాడు. ఇది ఎంత ఆదర్శవంతమైన ఉన్నతమైన వ్యక్తిత్వం అంటూ ఊదరగొడతారు. ఐతే ఈ ఆదర్శాన్ని ఏసు తన జీవితంలో ఆచరించలేకపోగా, దానికి విరుద్ధమైన ప్రకటనలు కూడా చేశాడు.

**మత్తయి - 11:20-22 వాక్యాలలో ఏసు ఎన్ని మహిమలు చూపించినా ప్రజలు నమ్మకపోవడంతో ఆయా పట్టణాలలోని ప్రజలని విమర్శ దినమందు మీరు ఘోరంగా శిక్షించబడతారు. విమర్శ దినమందు(తీర్పురోజు) మీ గతి కంటే తూరు సీదోను పట్టణముల వారి గతి ఓర్వతగినదై యుండునని చెప్తాడు.**

అంటే ఆ ప్రజలు తనని ప్రవక్తగా విశ్వసించకపోవడంతో తీర్పుదినం రోజు మీ సంగతి చెప్తా అని అసహనంతో వారిపై దుమ్మెత్తిపోస్తున్నాడు. ఇక అప్పుడు వచ్చి వారిని కోట్లకోట్ల సంవత్సరాలు నరకంలో వేసి కాలుస్తాడన్నమాట. ఇది కేవలం తనని ప్రవక్తగా ఒప్పుకోనందుకు. మరి మీ శత్రువులని ప్రేమించండి అని చెప్పిన ఆదర్శం ఇక్కడేమైపోయింది? తెలిసో తెలియకో మనిషి తప్పు చేయడం అనేది సహజం. దానికి అంతులేని శిక్ష విధించడమేనా శత్రువుల్ని ప్రేమించడమంటే?

ఇంకా తనకి మద్దతు ఇవ్వని వారి విషయంలో ఏసు చేసిన ప్రకటనలు ఎలా ఉన్నాయో చూడండి.

**మత్తయి-12:30 నా పక్షమున ఉండనివాడు నాకు విరోధి.**

**మత్తయి-18:6 నాయందు విశ్వాసముంచు ఈ చిన్నవారిలో ఒకని అభ్యంతరపరచువాడెవడో**

**వాడి మెడకు తిరగటి రాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రంలో ముంచివేయబడుట వానికి మేలు.**

**లూకా-19:27 నేను తమ్మును ఏలుటకు ఇష్టంలేని నా శత్రువులను ఇక్కడికి తీసుకొనివచ్చి నా ఎదుట సంహరించుడని చెప్పెను.**

ఈ వాక్యం చెప్తున్నది ఏసు చెప్పే కథలోని రాజకుమారుడు అయితే ఆ రాజకుమారున్ని తనకి ప్రతినిధిగానే ఏసు ఆ కథ చెప్పాడు.

ఇంకా ఆయనకి విరోధముగా ఉన్న అప్పటి పరిసయ్యులని, యూదు పెద్దల్ని సర్పసంతానమా, వ్యభిచారులారా అని తిడుతూ ఉండేవాడు తప్ప వారితో ప్రేమగా మాట్లాడినట్టు కనిపించదు.

మరోవిషయంలోకి వెళ్తే ఏసు వ్యభిచారం చేసిన స్త్రీని కూడా అమ్మా అని పిలిచాడు. నీ తల్లిదండ్రులను ఘనపరుచుము అని ఏసు చెప్పిన విషయాన్ని క్రైస్తవులు ఎక్కువ ప్రచారం చేస్తుంటారు.

నిజానికి వ్యభిచారం చేసిన స్త్రీని అమ్మా అని పిలిచినట్టుగా ఇంగ్లీష్(కింగ్ జేమ్స్) బైబిల్‌లో లేదు. ఓ స్త్రీ అని పిలిచినట్టుగా ఉంది. తెలుగు బైబిల్‌లోకి మాత్రం ఇలా అనువాదం చేశారు. ఇలా తప్పుగా ఎందుకు అనువాదం చేసినట్టు?

ఇక తల్లిదండ్రులను ఘనపరచడం సంగతి పక్కన పెడితే ఏసు తన సొంత తల్లికి, తోబుట్టువులకి సరైన గౌరవం కూడా ఇవ్వలేదు.

**మార్కు-3:31-35 వాక్యాలలో ఏసు జనం మధ్య బోధిస్తున్నప్పుడు ఆయన తల్లి, సహోదరులు ఆయన్ని చూడటానికి వస్తారు. వారు వచ్చిన విషయం ప్రజలు ఏసుకి తెలియజేస్తారు. ఏసు వారిని చూడటానికి ఇష్టపడడు.**

ఇలా ఏసు తన కుటుంబ సభ్యులపై నిరాదరణ చూపటానికి
ఒక ఆసక్తికరమైన కారణం కూడా ఉండేమోనని సందేహం వస్తుంది.
అదేంటంటే యోహాను - 7:27 లో ప్రజలు చెప్తున్నారు. "**అయినను ఈయన(ఏసు) ఎక్కడివాడో ఎరుగుదుము. క్రీస్తు వచ్చునపుడు ఆయన ఎక్కడివాడో ఎవడునూ ఎరుగడని చెప్పుకునిరి.**"

అంటే క్రీస్తు వచ్చినపుడు ఆయన ఎక్కడినుంచి వచ్చాడో, ఆయన కుటుంబ సభ్యుల వివరాలు ఏమిటో ఎవరికీ తెలియకూడదు. అకస్మాత్తుగా రావాలి. అది క్రీస్తు గురించి ఉన్న ప్రవచనం. కాని ఏసు ఎక్కడ పుట్టాడో, ఆయన కుటుంబ సభ్యులెవరో మొదటినుంచి అందరికీ తెలుసు. కనుక ఈ ఏసు-క్రీస్తు అయ్యే అవకాశం లేదని అక్కడి ప్రజలు చెప్పుకుంటున్నారు.

అయితే క్రీస్తు గురించిన ఈ ప్రవచనం విషయంలో తనకి భంగపాటు కలగవచ్చని భావించిన ఏసు తన కుటుంబ సభ్యులను ప్రజలందరిముందు పలకరించడానికి వెనుకడుగు వేసి ఉండొచ్చు.

ఇది ఏసు తన వ్యక్తిగత కుటుంబ సభ్యుల విషయంలో అనుసరించిన వైఖరి. అది అలా ఉంచితే; ఆయన లోకానికి చేసిన బోధనలలో కూడా తల్లిదండ్రులకి అంత సముచితమైన స్థానం ఇవ్వలేదు.

**<u>లూకా-14:26</u> ఎవడైననూ నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు.**

ఏసుకి శిష్యులు కావాలంటే తల్లిదండ్రులతోపాటు రక్తసంబంధీకులందరినీ ద్వేషించాల్సిందే అని స్వయంగా ఆయనే చెప్పాడు.

నీ శత్రువుని ప్రేమించుము అని ఏసు చెప్పాడు అంటూ ఊకదంపుడు ప్రచారాలు చేసే క్రైస్తవులు ఏసు తల్లిదండ్రులను ద్వేషించమన్నాడని ఎందుకు చెప్పడంలేదు? ఇది కూడా బైబిల్‌లోనే ఉంది కదా.

ఇంకో సందర్భంలో అయితే ఒకతను తండ్రికి అంత్యక్రియలు నిర్వహించడాన్ని కూడా తప్పు పడతాడు.

**<u>మత్తయి-8:21</u> శిష్యులలో మరియొకడు ప్రభువా నేను మొదట వెళ్ళి నా తండ్రిని పాతిపెట్టుటకు నాకు సెలవిమ్మని అయననను అడుగగా ఏసు అతని చూచి నన్ను వెంబడించుము మృతులు తమ మృతులను పాతి పెట్టుకొననిమ్మని చెప్పెను.**

అంటే చనిపోయిన తండ్రి శవాన్ని అలాగే విడిచి, తనని వెంబడించమని లేదంటే మీరు బ్రతికినా చనిపోయిన వారితో సమానమని **మృతులు తమ మృతులను పాతిపెట్టుకోనిమ్ము** అని అంటున్నాడు. తనని వెంబడించే విషయంలో కన్నతండ్రి అంత్యక్రియలు నిర్వహించడం కూడా ఘోరమైన నేరంగా పరిగణించడం ఎంతవరకు సమంజసం?

ఇప్పుడు కొంతమందికి మాపై ఒక సందేహం రావొచ్చు. ఇంతకుముందు ఏసు ఒక గొప్ప సంఘసంస్కర్త అని మెచ్చుకున్నారు. ఇప్పుడేమో విమర్శిస్తున్నారేంటి? అని.

**ఇక్కడ అందరూ గమనించాల్సిన విషయం ఏంటంటే ఏసుని పొగడటమో, ద్వేషించడమో మా ఉద్దేశ్యం కానేకాదు.**

**బైబిల్‌లో ఉన్న ఏసు వ్యక్తిత్వాన్ని ఉన్నది ఉన్నట్లుగా యథార్థంగా చూపించడమే మా పని.** ఒక మనిషి పూర్తిగా మంచివాడు అని కాని, పూర్తిగా చెడ్డవాడు అని కాని చెప్పడం అసంభవం. పరిస్థితుల ప్రభావం వల్ల, అవసరాల వల్ల ఒకే మనిషి వివిధ సందర్భాలలో

రకరకాలుగా ప్రవర్తిస్తాడు. ఇందుకు ఏసు కూడా అతీతుడు కాడు. అందువల్లే తన ప్రాణాల్ని సైతం లెక్క చేయకుండా ఒక మంచి సమాజ నిర్మాణం కోసం మోషే ధర్మశాస్త్రంలోని మూఢనమ్మకాల్ని ఖండించడానికి ధైర్యంగా ముందడుగు వేసిన ఏసుని సాహసోపేతమైన సంఘసంస్కర్తగా ప్రశంసించాం. **అక్కడ అది వాస్తవం కనుక.**

అలాగే తనకితాను అత్యంత ప్రాదాన్యతనిచ్చుకుంటూ ఆ ప్రాధాన్యత కోసం ఇతరుల విద్యుక్తధర్మమైన బాధ్యతలని కూడా విస్మరించమనడంలాంటి వింతపోకడలను కూడా ఏసులో ఉన్నవి ఉన్నట్టుగా చూపిస్తున్నాం. **ఇక్కడ ఇది వాస్తవం కనుక.**

ఇక ఏసులో ఉన్న మరొక కోణం అతనికి ధనవంతులపై వ్యతిరేకత.

ఒక సందర్భంలో ***ధనవంతుడు దేవుని రాజ్యములో ప్రవేశించుటకంటే సూదిబెజ్జములో ఒంటె దూరుట సులభం-(మత్తయి-19:24)*** అని స్పష్టంగా ధనవంతులపై తన అభిప్రాయాన్ని కుండబద్దలుకొట్టినట్లు వెలిబుచ్చుతాడు.

అలా ఎందుకంటాడంటే అంతకముందు ఒక ధనవంతున్ని ***నీ ఆస్తి అంతా అమ్మి బీదలకిమ్ము, అపుడు పరలోకమందు నీకు ధనము కలుగును అంటాడు.*** అందుకు ఆ ధనవంతుడు ఒప్పుకోడు. అపుడు ఏసు పై ప్రకటన చేస్తాడు.

కొంచం ఇంగితజ్ఞానంతో ఆలోచిస్తే; ఎవరైనా తమకి కలిగినదానిలో నుండి కొంత దానం చేయగలరు గాని, అంతా అమ్మేసి బీదలకిస్తే వాళ్ళ కుటుంబం రోడ్డున పడదా? సాధారణంగా ఇందుకు ఎవరూ ఒప్పుకోరు.

పోనీ ఏసుకి బీదలపై విపరీతమైన జాలి, ప్రేమ ఉన్నాయనుకుంటే ఒకప్పుడు మేరీ అనే ఒక స్త్రీ మూడు వందల దీనారముల మిక్కిలి విలువగల అత్తరు ఏసుపై కుమ్మరిస్తుంది.

(<u>మత్తయి 26:7</u> లో ఏసు తలపై పోసింది అని ఉంది.

<u>**యోహాను-12:3**</u>లో మాత్రం పాదాలకు పూసింది అని ఉంది.)

అపుడు ఇంత విలువైన సుగంధద్రవ్యాన్ని వృధాచేయకుండా దానిని అమ్మి బీదలకి ఇవ్వొచ్చు కదా అంటారు శిష్యులు.

అందుకు ఏసు ***"ఈ స్త్రీ నా విషయమై ఒక మంచి కార్యము చేసెను. ఈమెను మీరేల తొందరపెట్టుచున్నారు? బీదలెల్లప్పుడూ మీతో కూడా ఉన్నారు. గాని నేనెల్లప్పుడూ మీతో కూడ ఉండను.*** అంటాడు -(మత్తయి-26:10,11) .

నాకు సేవలు చేయడం కన్నా బీదలకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వక్కరలేదంటున్నాడు. అంటే పైన నీ ఆస్తి అంతా అమ్మి బీదలకిమ్ము అని చెప్పడం ధనవంతులపై వ్యతిరేకత తప్ప బీదలపై వల్లమాలిన ప్రేమ, దయ కారణం కాదు అని అర్థమౌతుంది కదా.

ఇంకా తన బోధనలని తానే అతిక్రమించే వ్యక్తిగా కూడా బైబిల్లో అక్కడక్కడా దర్శనమిస్తాడు ఏసు.

మత్తయి-23:12 తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును. తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును.

ఇది వింటుంటే ఏసు ఎంతో నిరాడంబరుడు అనిపిస్తుంది. కాని ఆయనే చెప్పిన ఇంకొన్ని వాక్యాలు కూడా చూడండి.

మత్తయి-12:26 నేను దేవాలయం కంటే గొప్పవాడిని.

లూకా-7:26 నేను ప్రవక్త కంటే గొప్పవాడిని.

లూకా-11:31 నేను సొలోమోను కంటే గొప్పవాడిని.

లూకా-11:32 యోనా కంటే గొప్పవాడిని.

తనను తాను హెచ్చించుకుంటే తగ్గింపబడతారు అని చెప్పిన ఏసే తన గురించి తాను ఇంతలా గొప్పలు చెప్పుకుంటున్నాడు. ఇక్కడ కొంతమంది అడగవచ్చు బైబిల్‌లో ఉన్న ప్రవక్తలందరి కంటే ఏసు గొప్పవాడు అనేది నిజమే కదా! అందుకని అలా చెప్తే తప్పేంటి? అని.

అయితే మనం ఒక విషయాన్ని మర్చిపోకూడదు.

బైబిల్‌లో ఉన్న ప్రవక్తలందరూ విజయవంతమయ్యారు ఒక్క ఏసు తప్ప. బైబిల్‌లో ఉన్న ప్రవక్తలందరినీ ఇశ్రాయేలీయులు ప్రవక్తలుగా అంగీకరించారు. ఏసు ఒక్కడే ఇశ్రాయేలీయులని ఒప్పించడంలో విఫలమయ్యాడు. ఆ విధంగా చూస్తే బైబిల్‌లో ఉన్న ప్రవక్తలందరూ ఏసు కంటే గొప్పవారని అర్థం వస్తుంది.

ఇంకా ఏసు వ్యక్తిత్వంలో ఒక గమ్మత్తయిన విషయం ఏమిటంటే పరిస్థితుల ప్రభావం వల్ల కావచ్చు, స్పష్టత లేకపోవడం వల్ల కావచ్చు, ఒకే విషయంపై వేరువేరుగా స్పందించాడు, ఒకే అంశంపై పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేశాడు. అవేంటో చూద్దాం.

1) యోహాను-5:31 నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనిన యెడల నా సాక్ష్యము సత్యము కాదు.

యోహాను-8:14 నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనిననూ నా సాక్ష్యము సత్యమే.

పై రెండింటిలో ఏది నిజం?

2) మత్తయి-19:29 నా నామము నిమిత్తము అన్నదమ్ములనైననూ అక్కచెల్లెండ్రనైననూ పిల్లలనైననూ భూములనైననూ ఇండ్లనైననూ విడిచిపెట్టిన ప్రతివాడును నూరురెట్లు పొందును. ఇదిగాక నిత్యజీవమును స్వతంత్రించుకొనును.

మత్తయి-10:22 మీరు నా నామము నిమిత్తము అందరిచేత ద్వేషింపబడుదురు. అంతమువరకును సహించినవాడు రక్షింపబడును.

ఒక చోటేమో నన్ను నమ్ముకుంటే 100 రెట్లు లాభపడతారని అంటాడు. ఇంకోచోటేమో

నన్ను నమ్ముకుంటే అంతం వరకు కష్టాలే మిగుల్తాయి. వాటిని తట్టుకున్నవాడే విశ్వా
అంటాడు.

మరోచోటైతే నన్ను నమ్ముకుంటే ఏకంగా మిమ్మల్ని చంపేస్తారు అని కూడా చెప్పాడు.

**<u>మత్తయి-24:9</u> అప్పుడు జనులు మిమ్మును శ్రమల పాలుజేసి చంపెదరు. మీరు నా నామము నిమిత్తము సకల జనముల చేత ద్వేషింపబడుదురు.**

వీటిలో ఏది నిజం?

3) **<u>యోహాను-3:17</u> లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు.**

**<u>యోహాను-5:23</u> తండ్రిని ఘనపరుచునట్లుగా అందరును కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించియున్నాడు.**

బైబిల్‌లో తీర్పు తీర్చడం అంటే శిక్షించడం అని అర్థం.

ఒక చోటేమో దేవుడు నన్ను లోకాన్ని రక్షించడానికి పంపాడు. తీర్పు తీర్చటానికి కాదు అన్నాడు. ఇంకోచోట తీర్పు తీర్చుటకు నాకు సర్వాధికారం ఇచ్చాడు అంటున్నాడు. ఇవి పరస్పర విరుద్ధమైన ప్రకటనలు.

<u>ముగింపు:</u> ఇన్ని రకాల వైరుధ్యాలు తన జీవితంలో చూపించాడు కనకే ఆనాటి సమాజానికి ఏసు అపరిచితుడిగా మిగిలిపోయాడు.

## 8. ఏసు రక్తం - పాప పరిహారం - నిత్యజీవం

ఒక్క వాక్యంలో చెప్పాలంటే ఈనాడు చెలామణిలో ఉన్న క్రైస్తవమత సిద్ధాంతం ఇదే. మనిషి పుట్టుకతో పాపి. ఏసు మానవాళి పాప క్షమాపణ కోసం రక్తం చిందించాడు. ఈ విషయాన్ని నమ్మితే పాప పరిహారం అయ్యి నిత్యజీవం పొందుతారు. నమ్మకపోతే నిత్యనరకానికి పోతారు.

ఎన్ని రకాల పేర్లతో సభలు పెట్టి ఎన్నిరోజులు ప్రసంగాలు చేసినా, కిందది మీదకి మీదది కిందకి పెట్టి తలకిందులు చేసినా, చివరాఖరకి క్రైస్తవ మత ప్రచారకులందరూ వచ్చి ఆగేది ఇక్కడే.

క్రైస్తవ మతంలోకి మారకపోతే మీకు నరకమే గతి అంటూ ఒక రకమైన బెదిరింపు ధోరణిలో విశృంఖలంగా ప్రచారం సాగిస్తూ వస్తున్నారు.

**ఐతే ఒళ్ళు గగుర్పొడిచే నిజం ఏమిటంటే క్రైస్తవ మత ప్రచారకులు ఇంత ఉధృతంగా ప్రచారం చేస్తున్న ఈ సిద్ధాంతాన్ని ఏసు అసలు చెప్పనేలేదు. పైగా ఈ సిద్ధాంతానికి ఆయన పూర్తి వ్యతిరేకి.**

పోనీ బైబిల్ దేవుడు యెహోవా ఈ సిద్ధాంతాన్ని చెప్పాడా అంటే; ఆయన సంగతి సరేసరి.

మరి ఈ సిద్ధాంతాన్ని ఎవరు ప్రవేశపెట్టారు? ఎందుకు ప్రవేశపెట్టారు? ఈ విషయాన్ని ముందు ముందు తెలుసుకుంటారు.

**బైబిల్ దేవుడు యెహోవా "మానవులందరి పాపక్షమాపణ నిమిత్తం నా కుమారుణ్ణి పంపించి బలి చేస్తా" అని చెప్పినట్టుగా బైబిల్ మొత్తంలో భూతద్దం పెట్టి వెతికినా ఒక్క వాక్యం కూడా కనపడదు.**

యెహోవా ప్రకారం పాప క్షమాపణ కోసం జంతువుల్ని బలి ఇవ్వాలి. వేరు వేరు వ్యక్తులు వేరు వేరు పాపాలకి వేరు వేరు జంతువులని పాప క్షమాపణ బలిగా సమర్పించాలి.

**ఈ వివరాలన్నీ లేవీయకాండంలో ఉంటాయి.**

లేవీయకాండం మొత్తాన్ని, అక్షరం పొల్లుపోకుండా చదివి చూడండి.

ఇక ఏసు ఈ జంతుబలుల్ని సమర్థించినట్టుగా కాని, పూర్తిగా వ్యతిరేకించినట్టుగా కాని బైబిల్‌లో ఖచ్చితమైన వివరాలు లేవు.

మరైతే అసలు ఏసు దృష్టిలో పాపక్షమాపణ ఎలా కలుగుతుంది?

మనుషులు నిత్యజీవం(స్వర్గం) పొందడానికి కావలసిన అర్హతలేంటి?

ఈ విషయం గురించి ఇపుడు పూర్తి సమాచారం తెలుసుకుందాం.

ముందుగా మనం ఒక విషయం తెలుసుకోవాలి.
ఏసు దృష్టిలో మానవుడు జన్మతః పాపి కాదు. ఇది ఎలా చెప్పగలం అంటే **మత్తయి-9:12:13** లో **ఆయన ఆ మాట విని రోగులకేగాని ఆరోగ్యం గలవారికి వైద్యుడక్కరలేదు, గదా. అయితే నేను పాపులను పిలవ వచ్చితిని గాని నీతిమంతులను పిలవరాలేదు.** నీతిమంతులకి వైద్యుడు అక్కరలేదు అన్నాడు.
అనగా మానవులలో పాపులూ ఉన్నారు, నీతిమంతులూ ఉన్నారు. అందులో నేను పాపుల్ని రక్షించడానికి వచ్చాను అంటున్నాడు. మానవులందరూ జన్మతః పాపులైతే నేను పాపభూయిష్టమైన మానవజాతి కోసం వచ్చాను అని చెప్పి ఉండేవాడు.
ఐతే ఆ పాపులు ఎలా రక్షించబడతారు? వారికి పాపక్షమాపణ ఎలా కలుగుతుంది?
**లూకా-7:48** **నీ పాపములు క్షమింపబడియున్నవని** ఒక పాపాత్మురాలైన స్త్రీతో ఏసు అంటాడు.
ఇక్కడ ఆమె పాపాలు ఎలా క్షమించబడ్డాయి?
ఏసు అప్పటికి సిలువ వేయబడలేదు. ఇపుడు క్రైస్తవ ప్రచారకులు చెప్తున్నట్టుగా రక్తంలో కడుగబడటానికి అప్పటికి ఇంకా ఏసు రక్తం చిందించనేలేదు.
మరి ఎలా ఆమె పాపాలు క్షమించబడ్డాయి? అంటే ఆ కింద ఏసు చెప్తున్నాడు 50వ.
**అందుకాయన నీ విశ్వాసము నిన్ను రక్షించెను. సమాధానము గలదానివై వెళ్ళుమని ఆ స్త్రీతో చెప్పెను.**
ఆ స్త్రీకున్న విశ్వాసమే ఆమెను రక్షించింది అంటున్నాడు. ఏమిటా విశ్వాసం? అదికూడా ఏసే చెప్పాడు.
**యోహాను-17:3 అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును నీవు పంపిన ఏసు క్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము.**
ఇదీ అసలు విషయం. ఏసు దృష్టిలో నిత్యజీవానికి అర్హులు ఎవరంటే అద్వితీయ సత్యదేవుడైన తండ్రి తనని పంపాడని ఎరిగి, ఆయనయందు విశ్వాసముంచితే వారు రక్షించబడతారు తప్ప నా సిలువమరణాన్ని నమ్మినవాడు రక్షించబడతాడు అని ఏసు ఎక్కడా చెప్పలేదు.
పాపక్షమాపణ పొంది నిత్యజీవంలోకి ప్రవేశించడానికి, ఏసు సిలువ మరణం, పునరుత్థానాలతో పనిలేదు అనే విషయాన్ని మరింత స్పష్టంగా ఏసు మాటల్లోనే తెలుసుకుందాం.
**లూకా-10:25 ఇదిగో ఒకప్పుడు ధర్మశాస్త్రోపదేశకుడు లేచి బోధకుడా నిత్యజీవనమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెనని ఆయనను శోధించుచు అడిగెను.**
**అందుకాయన ధర్మశాస్త్రమందేమి వ్రాయబడియున్నది? నీవేమి చదువుచున్నావని అతని**

నడుగగా అతడు నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణహృదయముతోనూ, నీ పూర్ణమనస్సుతోనూ, నీ పూర్ణశక్తితోనూ, నీ పూర్ణ వివేకముతోనూ ప్రేమించవలెననియూ, నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించవలెననియూ వ్రాయబడియున్నదని చెప్పెను.

అందుకాయన నీవు సరిగా ఉత్తరమిచ్చితివి ఆలాగు చేయుము అపుడు జీవించెదవని అతనితో చెప్పెను.

ధర్మశాస్త్రం రద్దుచేయబడింది, పాతనిబంధన కొట్టేయబడింది, ఏసు రక్తాన్ని నమ్ముకోండి అంటూ ఊదరగొడుతున్న క్రైస్తవ ప్రచారకులారా ఇప్పుడేమంటారు? తన సిలువ మరణంతో సంబంధం లేకుండా ధర్మశాస్త్రంలో ఉన్న ఆజ్ఞలని అనుసరిస్తేనే నిత్యజీవం అంటున్నాడు ఏసు. బైబిల్ నిజమైన దైవగ్రంథమైతే దీనికి వేరుగా ఎవరు మాట్లాడినా తెగుళ్ళతో చస్తారు.

**ఇదొక్కటి చాలదా! మీరంతా క్రీస్తు విరోధులు, సైతాను ప్రతినిధులు అని చెప్పటానికి.**

ఇంకా పైత్యం ముదిరి బైబిల్‌లోనే కాదు వేదాలలో కూడా ఏసు బలి గురించి రాయబడింది అంటూ ప్రేలాపిస్తున్న వారి మానసిక స్థితి గురించి ఏమనుకోవాలి.

వాళ్ళకి బైబిలే అర్థం కాలేదు. ఇంకా వేదాలు గురించి చెప్తారంట. ఇలాంటి వంకర బోధకుల గురించి ఏసు ఏమంటున్నాడో చూడండి.

**<u>మార్కు-12:38-40</u> శాస్త్రులను(బోధకులను) గూర్చి జాగ్రత్త పడుడి. వారు నిలువుటంగీలు ధరించుకొని తిరుగుటను, సంత వీధులలో వందనములను సమాజ మందిరములలో అగ్రపీఠములను విందులలో అగ్రస్థానములను కోరుచు విధవరాండ్ర ఇళ్ళు దిగమ్రింగుచు మాయ వేషముగా దీర్ఘ ప్రార్థనలు చేయుదురు.**

**వీరు మరి విశేషముగా శిక్ష పొందుదురనెను.**

దొంగ ప్రార్థనలు చేసే ఈ బోధకులకే ఎక్కువ శిక్ష అని చెప్తున్నాడు.

అర్థమౌతుందా భక్తులూ! ఈ కొలతతో చూస్తే ఈనాటి ప్రసంగీకులలో ఎందరో శిక్షకు తగినవారవుతారు.

ఇక ఏసు దృష్టిలో తీర్పుదినంరోజు తన సిలువ మరణం, పునరుత్థానం అనే విషయాలని అంగీకరించారా లేదా? అని కాకుండా తాను ప్రకటించిన సువార్తని అంగీకరించారా లేదా? అనే ప్రాతిపదికనే తీర్పు జరుగుతుందని చెప్పటానికి ఒక బలమైన ఆధారం చూడండి.

**<u>మత్తయి-10:5-15</u> వాక్యాలలో ఏసు తన పన్నెండు మంది శిష్యులను సువార్త ప్రకటించమని పంపిస్తాడు. పంపిస్తూ వారితో కొన్ని విషయాలు చెప్తాడు.**

**మీరు అన్యజనుల దారిలోకి వెళ్ళకుడి, సమరయుల ఏ పట్టణములోనైననూ ప్రవేశింపకుడి**

గాని ఇశ్రాయేలు వంశములోని నశించిన గొర్రెల వద్దకే వెళ్ళుడి. వెళ్ళుచూ పరలోక రాజ్యం సమీపించియున్నదని ప్రకటించుడి.

(ఏసు సిలువ మరణం సమీపించియున్నదని పక్రటించండి అని చెప్పలేదు గమనించండి.)

మీరు ఏ పట్టణములోనైననూ గ్రామములోనైననూ ప్రవేశించునప్పుడు అందులో ఎవడు యోగ్యుడో విచారణ చేసి అక్కడనుండి వెళ్ళువరకు అతని ఇంటనే బస చేయుడి. ఎవడైనను మిమ్మును చేర్చుకొనక మీ మాటలు వినకుండిన యెడల మీరు ఆ ఇంటినైననూ ఆ పట్టణమునైననూ విడిచిపోవునప్పుడు మీ పాద ధూళి దులిపివేయుడి. విమర్శ దినమందు ఆ పట్టణపు గతికంటే సొదొమ గొమొఱ్ఱా ప్రదేశముల గతి ఓర్వతగినదై యుండునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.

అంటే ఏసు శిష్యులు ప్రకటించిన సువార్తని ఎవరు అంగీకరించరో వారిమీద సాక్ష్యం కోసం మీ పాదధూళి దులిపి రండి విమర్శ అంటే తీర్పు దినం రోజు వారి గతి భయంకరంగా ఉంటుంది అని ఏసు ఇక్కడ స్పష్టం చేశాడు. మరి సువార్త అంటే ఏమిటి? నేను సిలువపై మరణించబోతున్నాను నన్ను నమ్ముకోండి అనా?

కానేకాదు. సువార్త అంటే ఏమిటో చూడండి.

<u>మార్కు-1:15</u> ఏసు- కాలము సంపూర్ణమైయున్నది. దేవుని రాజ్యము సమీపించియున్నది. మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని చెప్పుచూ దేవుని సువార్త ప్రకటించుచూ గలిలయకు వచ్చెను.

అర్థమయిందా సువార్త అంటే! కాలము సంపూర్ణమై ఉన్నది. అంటే ఇక ఈ లోకం గతించిపోతుంది. దేవుని రాజ్యము సమీపించియున్నది. ఇక్కడ ఈనాటికీ కొంతమంది క్రైస్తవ మేధావులు దేవుని రాజ్యం అంటే ఏసు సిలువ వేయబడటం అని, ఏసు పేరుతో సంఘం ఏర్పడుట అని సొంతంగా వక్రభాష్యాలు చెప్తారు.

దేవుని రాజ్యం అంటే పరలోక రాజ్యం. అందుకే <u>మత్తయి-10:7</u> శిష్యులని సువార్త ప్రకటించమని పంపిస్తూ చెప్పినమాట. "వెళ్ళుచూ పరలోక రాజ్యం సమీపించియున్నదని ప్రకటించండి" అన్నాడు. దేవుని రాజ్యం అంటే ఏమిటి? అనే విషయాన్ని ముందు భాగంలో మరింత స్పష్టంగా వివరిస్తాను.

ఇదే ముఖ్య విషయం. పరలోక రాజ్యం సమీపించియున్నది గనుక పాపక్షమాపణ కోసం మారుమనస్సు పొంది ఏసుని దేవుడు పంపించిన ప్రవక్తగా అంగీకరిస్తే నిత్యజీవాన్ని పొందుతారు అని ఏసు విస్పష్టంగా చెప్పాడు.

అలాగే ధర్మశాస్త్రంలోని ఆజ్ఞలని అనుసరించినా కూడా నిత్యజీవం పొందవచ్చు అని చెప్పటం కూడా పైన చూశాం.

ఇవేకాక నిత్యజీవాన్ని పొందటానికి మరికొన్ని మార్గాలున్నాయని కూడా ఏసు తెలియజేశాడు.

**<u>మత్తయి-18:3</u> మీరు మార్పునొంది బిడ్డలవంటివారైతేగాని పరలోకరాజ్యములో ప్రవేశింపలేరు.**

**<u>మత్తయి-7:21</u> ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడు పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారం చేయువాడే ప్రవేశించును.**

**<u>మత్తయి-12:36,37</u> నేను మీతో చెప్పునదేమనగా మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుందురు. నీ మాటలను బట్టియే నీతిమంతుడవని తీర్పునొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు.**

**<u>మత్తయి-19:12</u> తమునితాము నపుంసకులుగా చేసుకొనినవారు కూడా పరలోక రాజ్యం పొందుతారు** అని చెప్పాడు.

పరలోక రాజ్యం పొందటానికి ఏసు తనని ప్రవక్త అని విశ్వసించడంతోపాటు ఇన్ని మార్గాలున్నాయి అని చెప్పాడు. **ఒక్కచోట కూడా క్రైస్తవ ప్రచారకులు చెప్తున్నట్లుగా తన సిలువ మరణాన్ని నమ్ముకోండి అని చెప్పవేలేదు.**

సరే అంతా బాగానే ఉంది. ఏసు దృష్టిలో నిత్యజీవం పొందటానికీ తాను రక్తం చిందించి సిలువపై బలి అవ్వడానికీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా తెలిసిపోయింది.

**మరి ఆయన ఎందుకు సిలువ వేయబడినట్టు?**

**అది అవసరమా? నెట్టుకువచ్చిన తప్పనిసరి పరిస్థితా?**

కొన్నిచోట్ల ఏసు నేను పాపులకోసం చనిపోతున్నాను అని అనిపించేలా కొన్ని వాక్యాలు చెప్పాడు కదా! వాటి సంగతి ఏంటి?

అని సహజంగా క్రైస్తవులతోపాటు బైబిల్ చదువుతున్న వారెవరికైనా సందేహాలు వస్తాయి. కనుక ఇపుడు ఏసు సిలువ వేయబడటానికి గల కారణాలను, సిలువ మరణం గురించి ఏసు చెప్పిన విషయాలను సవివరంగా తెలుసుకుందాం.

## 9. సిలువ రహస్యం

ఏసుకి సిలువ శిక్షను అమలు చేసింది అప్పటి రోమా ప్రభుత్వం. ఐతే ఆయనకి మరణశిక్ష విధించాల్సిందే అని పట్టుబట్టింది, ఇందుకోసం రోమా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది మాత్రం యూదులే. ఏసు కూడా యూదా జాతీయుడే.

తమ స్వజాతీయుణ్ణి యూదులు అంత కర్కశంగా కొట్టి శిలువ వేయించి చంపాల్సిన అవసరం ఎందుకొచ్చింది? వారు ఏసుపై మోపిన అభియోగాలేంటి? నిజంగా ఏసు అంత తీవ్రమైన నేరం చేశాడా అని చూస్తే... ఇందుకు ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తాయి.

1) ఏసు ధర్మశాస్త్రాన్ని పాటించకపోవడం. ఏసు ధర్మశాస్త్రంలో ఉన్న మంచిని మాత్రం తీసుకొని అందులో ఉన్న మూఢనమ్మకాల్ని, ఆటవికమైన ఆజ్ఞలని ఖండిస్తూ మార్పులు, చేర్పులు చేసిన సంఘసంస్కర్తగా ఇంతకముందు భాగంలో మేము చెప్పడం జరిగింది. అయితే దీనివల్ల ఇశ్రాయేలీయులు ఏసుపై ఒక అభిప్రాయానికి వచ్చారు.

**<u>యోహాను-9:16</u> కాగా పరిసయ్యులలో కొందరు ఈ మనుష్యుడు విశ్రాంతి దినము ఆచరించుట లేదు గనుక దేవునియొద్దనుండి వచ్చినవాడు కాడనిరి.**

తమ దేవుడైన యెహోవా ఆజ్ఞలని ఏసు ఉల్లంఘిస్తున్నాడు కనుక ఇతను ప్రజలని మోసపుచ్చేవాడిగా, దుష్టశక్తి సంబంధితుడిగా వారు భావించారు.

-(యోహాను-7:12, మత్తయి-12:24)

ఎవరైనా ధర్మశాస్త్రాన్ని ఉల్లంఘించినా, మార్పులు చేర్పులు చేసినా వారిని రాళ్ళతో కొట్టి చంపాలని మోషేకిచ్చిన ధర్మశాస్త్రంలో యెహోవాయే స్పష్టంగా ఆదేశించాడు కదా!

**<u>ద్వితీయోపదేశ కాండం-13:1-5</u> ప్రవక్తయే గాని కలలు గను వాడేగాని నీమధ్యలేచి నీ ఎదుట సూచకక్రియ అయిననూ మహత్కార్యమైననూ చేసి... నీవు నడువవలెనని నీ దేవుడైన యెహోవా నీకాజ్ఞాపించిన మార్గములోనుండి నిన్ను తొలగించునట్లు మీ దేవుడైన యెహోవామీద తిరుగుబాటు చేయుటకు మిమ్ములను ప్రేరేపించెను గనుక ఆ ప్రవక్తకేమి ఆ కలలు కనువానికేమి మరణశిక్ష విధింపవలెను.**

అంటే ఎవరైనా వచ్చి నేను ప్రవక్తని అని చెప్పుకుని, యెహోవా ఇశ్రాయేలీయులకి ఆజ్ఞాపించిన మార్గం (ధర్మశాస్త్రం) నుంచి ఇశ్రాయేలీయులు తొలగిపోవునట్లు ప్రేరేపిస్తే, ఆ ప్రవక్త అద్భుతాలు చేసినా కూడా నమ్మొద్దు. వెంటనే వాడిని చంపేయండి అంటున్నాడు. మీరు నన్ను నిజంగా పూర్ణమనసుతో అనుసరిస్తున్నారో లేదో తెలుసుకోవడానికి అప్పుడప్పుడు ఇలాంటి పరీక్షలు పెడుతుంటాను అంటాడు(3వ). దీని ప్రకారం యూదులు ఏసుని చంపితేనే వారు నిజమైన దైవభక్తులు అవుతారు. లేదా విశ్వాస ఘాతకులు

అవుతారు. అందువల్ల వారు తమ దేవుడు చెప్పిన దానిని అక్షరాల పాటించారు. ఇందులో వాళ్ళ తప్పేముంది? వాళ్ళ దేవుడైన యెహోవా ఆజ్ఞని అమలు చేశారంతే. కాని ఇప్పుడు క్రైస్తవులు యెహోవాని వదిలేసి, యెహోవా ఆజ్ఞ అమలు చేసిన యూదుల్ని ద్వేషిస్తారు. వాళ్ళని దైవద్రోహులుగా పరిగణిస్తారు. వాళ్ళు నరకానికి పోతారంటారు. ఇదేం విడ్డూరమో మరి: **ఇది యూదులు ఏసుని చంపడానికి గల మొదటి కారణం.**

**2) రెండవ కారణం కూడా బైబిల్‌లోని అంశాలతోనే ముడిపడి ఉన్నప్పటికీ ఇందులో రాజకీయ కోణం కూడా ఉంది.** అదెలాగంటే ఏసు తాను క్రీస్తుని అని చెప్పుకున్నాడని, క్రీస్తు అంటే ఇశ్రాయేలీయులని పరాయి రాజుల దాస్యం నుంచి విడిపించి వారికి స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరిచి వారిపై రాజుగా అభిషిక్తుడయ్యే ఇశ్రాయేలు రక్షకుడు అని ఇంతకముందు భాగాలలో తెలుసుకున్నాం.

ఇశ్రాయేలీయులు అప్పుడు రోమీయుల పరిపాలనలో ఉన్నారు. ఇపుడు క్రీస్తు వచ్చి రోమీయుల పాలననుండి ఇశ్రాయేలీయులకి స్వాతంత్రం తేవాలి. అంటే వారితో యుద్ధం చేయాలి. కాని రోమీయులతో యుద్ధం చేసేంతటి శక్తిసామర్థ్యాలు అప్పుడు ఇశ్రాయేలీయులకి లేవు.

ఒకవేళ ఇప్పుడు ఏసుని చూసి యూదుల రాజైన క్రీస్తు పుట్టాడని, మనకు త్వరలో స్వాతంత్ర్యం వచ్చేస్తుందని కొంతమంది ఇశ్రాయేలీయులు భావించి, రోమీయులపై తిరుగుబాటు ప్రకటిస్తే, రోమీయులు వచ్చి ఇశ్రాయేలీయులందరినీ చితగ్గొట్టి అణచివేస్తారు. అప్పుడు తమకి తీవ్ర నష్టం జరుగుతుంది అని అప్పటి యూదా పెద్దలు భావించేవారు. **అందువల్ల ఎవరైనా ఏసుని క్రీస్తు అని ఒప్పుకుంటే వారిని వెలివేస్తామని హెచ్చరిక జారీచేస్తారు యూదు పెద్దలు -(యోహాను-9:22)**

అయినా కొంతమంది ఇశ్రాయేలీయులు ఆయనపై విశ్వాసముంచుతారు. అప్పుడు యూదా పెద్దలు సమావేశమై ఏమనుకొంటున్నారో చూడండి.

**<u>యోహాను-11:47,48</u> కాబట్టి ప్రధాన యాజకులును పరిసయ్యులును మహాసభను సమకూర్చి మనమేమి చేయుచున్నాము? ఈ మనుష్యుడు అనేకమైన సూచకక్రియలు చేయుచున్నాడే. మనమాయనను ఈలాగు చూచుచూ ఊరకుండినయెడల అందరూ ఆయనయందు విశ్వాసముంచెదరు. అప్పుడు రోమీయులు వచ్చి మన స్థలమును మన జనమును ఆక్రమించుకొందురని చెప్పిరి.**

అదన్నమాట విషయం. ఇశ్రాయేలీయులందరూ ఏసుని క్రీస్తుగా నమ్మి అత్యుత్సాహంతో ఒకవేళ రోమీయులపై తిరుగుబాటు చేస్తే అప్పుడు వాళ్లొచ్చి మనల్నందరినీ చావగొట్టి చెవులు మూస్తారు అని యూదాపెద్దలు భయపడుతున్నారు. ఏసుని పిలాతుకి

అప్పగించినపుడు కూడా వారు చేసిన ఆరోపణ ఇదే.

**లూకా-23:1,2 అంతట వారందరును లేచి ఆయనను పిలాతునొద్దకు తీసికొనిపోయి ఇతడు మా జనమును తిరుగబడ ప్రేరేపించుచు కైసరుకు పన్నియ్య వద్దనియు తానే క్రీస్తను ఒక రాజుననియు చెప్పగా మేము వింటిమని ఆయనమీద నేరము మోపసాగిరి.**

అయితే యూదా పెద్దలు సమావేశమైన రోజు అందులో కయిప అనే ఒక ప్రధానయాజకుడు ఒక మాట చెప్తాడు.

**యోహాను-11:49,50 వారిలో కయప అను ఒకడు ఆ సంవత్సరము ప్రధానయాజకుడైయుండి మీకేమియు తెలియదు. మన జనమంతయు నశింపకుండునట్లు ఒక మనుష్యుడు ప్రజల కొరకు చనిపోవుట మీకు ఉపయుక్తమని మీరు ఆలోచించుకొనరు.**

ఇపుడు క్రైస్తవ ప్రచారకులు దీనిని పట్టుకొని ఇదొక ప్రవచనంగా అంటే జనమందరి కోసం ఒకడు చనిపోవాలనేది తప్పనిసరి అందుకే కయిప అలా చెప్పాడు అని ప్రచారం చేస్తున్నారు.

కాని అక్కడ సందర్భం ఏంటి? కయిప ఏమంటున్నాడు?

మన జనమంతయూ అంటే మన ఇశ్రాయేలీయులందరూ నశింపకుండనట్లు. ఇశ్రాయేలీయులందరికీ ప్రమాదం ఎలా వస్తుంది? ఏసువల్లే కదా. ఏసుని క్రీస్తు అని ఇశ్రాయేలీయులు నమ్మి రోమీయులపై తిరుగుబాటు చేస్తే వారొచ్చి ఇశ్రాయేలీయులందరినీ నిర్మూలిస్తారు. అందువల్ల అసలు నేను క్రీస్తుని అని చెప్పుకుంటున్న ఈ ఏసునే చంపేస్తే సమస్య తీరిపోతుంది కదా! మీకెందుకు అర్థం కావడం లేదు? అంటున్నాడు.

అందుకే అక్కడ మన జనమంతయూ నశింపకుండనట్లు ఒక మనుష్యుడు ప్రజల కొరకు చనిపోవుట మీకు ఉపయుక్తమని మీరు ఆలోచించుకొనరు అన్నాడు.

అపుడు కయిప చెప్పిన ఈ ఆలోచనకి మిగిలినవారు కూడా మద్దతు తెలిపారు. ఆ కింద వాక్యం చూడండి.

**53వ. కాగా ఆ దినమునుండి వారు ఆయనను చంపనాలోచించుచుండిరి.**

ఇవీ ప్రధానంగా యూదులు ఏసుని చంపడానికి గల కారణాలు.

**1) ఏసు ధర్మశాస్త్రాన్ని ధిక్కరించడం, ధర్మశాస్త్రాన్ని ధిక్కరించినవాడు ప్రవక్త అయినా వాడు అద్భుతాలు చేసినా నమ్మకుండా చంపేయాలని యెహోవా వారికి ఖచ్చితమైన ఆదేశం ఇవ్వడం.**

**2) ఏసు-క్రీస్తు అని ఇశ్రాయేలీయులు నమ్మి రోమీయులపై తిరుగుబాటు చేస్తే రోమీయులు వచ్చి తమని నాశనం చేస్తారని యూదా పెద్దలు భయపడటం.**

ఐతే ఈ సిలువ శిక్ష గురించి ఏసు ఏవిధంగా స్పందించాడు?
ఈ విషయంపై ఆయన దృక్కోణం ఏమిటి?
అసలు ఏసు వచ్చిందే చనిపోవడానికి అని క్రైస్తవ ప్రచారకులు చేస్తున్న ప్రచారం నిజమా? అనే విషయాలు చూద్దాం.
ఇందులో చాలావరకు ఇప్పటికే స్పష్టత వచ్చేసింది. సిలువ శిక్ష గురించి కూడా ఉన్న కొన్ని సందిగ్ధాల గురించి ఇపుడు పూర్తిగా తెలుసుకుందాం.
ముందుగా ఒక విషయం గమనిస్తే; ఏసు- నేను మానవుల పాపక్షమాపణ నిమిత్తం సిలువపై మరణించడానికి వచ్చాను అని ఎక్కడా చెప్పలేదు సరికదా తాను ఎందు నిమిత్తం వచ్చానని చెప్పాడో ఏసు మాటల్లోనే చూస్తే...
**<u>మార్కు-1:38</u> ఆయన ఇతర సమీప గ్రామములలోనూ నేను ప్రకటించునట్లు వెళ్ళుదుము రండి. ఇందు నిమిత్తమే గదా నేను బయలుదేరి వచ్చితినని వారితో చెప్పెను.**
తాను ఎందుకు వచ్చానని దానిపై ఏసుకి ఒక నిర్దిష్టమైన అభిప్రాయం ఉంది. అది సువార్త ప్రకటించడమే. ఆ విషయాన్నే పై వాక్యంలో ధృవీకరిస్తున్నాడు. అంతేకాదు సువార్త ప్రకటించడం అయిపోయాక ఏమంటున్నాడో చూడండి.
**<u>యోహాను-17:4</u> చేయుటకు నీవు నాకిచ్చిన పనిని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమి మీద నిన్ను మహిమ పరచితిని.**
సువార్త ప్రకటించడంతోటే తాను వచ్చిన పని సంపూర్ణంగా నెరవేరింది అంటున్నాడు. ఇందులోనే మరో విషయం కూడా ఉంది. ఆ సువార్త కేవలం ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే.
నేను ఇశ్రాయేలు వారి కోసమే పంపబడ్డాను అని ఏసు విస్పష్టంగా చెప్పాడు. అందుకే వారికి సువార్త ప్రకటించడం పూర్తవగానే నేను వచ్చిన పని సంపూర్ణంగా పూర్తి అయ్యింది అంటున్నాడు. సంపూర్ణంగా అంటే చెయ్యాల్సిన పని అంతా అయిపోయిందని అర్థం కదా!
ఇంకా ఈ విషయం గురించి రాబోవు భాగం సర్వలోకజగద్రక్షకుడులో విపులంగా పరిశీలిద్దాం.
ఐతే సిలువ మరణం గురించి ఏసు ఎక్కడా ప్రస్తావించలేదా? అంటే ప్రస్తావించాడు. నేను యెరూషలేం పట్టణానికి వెళ్తున్నాను అక్కడ నన్ను పట్టుకొని చంపుతారు. నేను మళ్ళీ తిరిగి లేస్తాను అని ఏసు చెప్పినట్టుగా బైబిల్‌లో కొన్ని వాక్యాలు కనపడతాయి. అయితే ఇందులో గమనించాల్సిన విషయం ఏంటంటే తాను చంపబడటం, తిరిగి లేవడం అనేది మనుషుల పాపక్షమాపణ కోసం అని ఆయన చెప్పలేదు.

ఉదా:కి ఏసు ఒక గాడిదని తోలుకురండి నేను దానిపై ఎక్కి యెరూషలేము పట్టణానికి వెళ్ళాలి అంటాడు. అంటే అర్థం ఆయన మన పాపముల నిమిత్తం గాడిదెక్కి యెరూషలేము పట్టణానికి వెళ్ళాడు. ఈ విషయం నమ్మితే రక్షించబడతావు లేదా శిక్షించబడతావు అని ఎవరైనా చెప్తే ఎలా ఉంటుంది? హాస్యాస్పదంగా ఉంటుంది. అలాగే తాను యెరూషలేముకి వెళ్ళాక అక్కడే నన్ను పట్టుకొని కొట్టి చంపుతారు అని చెప్పినపుడు ఆయన మన పాపముల నిమిత్తం చంపబడ్డాడు. ఈ విషయం నమ్మితే రక్షించబడతావు లేదా శిక్షించబడతావు అని చెప్పటం కూడా సబబుగా ఉండదు.
పైగా పై విషయంలాగే ఇది కూడా హాస్యాస్పదంగానే ఉంటుంది.

ఇంతకముందు చెప్పినట్టుగా ఏసు - నేను యెరూషలేము పట్టణానికి వెళ్ళిన తరువాత అక్కడ నన్ను పట్టుకొని కొట్టి చంపుతారు అనే విషయం ముందే చెప్పాడు. అయితే ఇక్కడ రెండు విషయాలు మనం గమనించాలి.

**1) అది మానవుల పాపక్షమాపణ నిమిత్తం అని ఏసు చెప్పలేదు.**

**2) తనని చంపుతారనే విషయం ముందే చెప్పాడు గనుక ఆయనకి అసాధారణ మానవాతీత శక్తులు/ సూపర్ పవర్స్ ఉన్నాయని అనడానికి లేదు.** ఎందుకంటే ఆ కాలంలో ఉన్న సామాజిక కట్టుబాట్లని, ఏసు ఉన్న పరిస్థితులని నిశితంగా పరిశీలిస్తే కామన్‌సెన్స్ ఉన్నవారెవరైనా ఈ విషయాన్ని అంచనా వేయగలరు. అదెలాగంటే.....?

ఏసు యూదుల ధర్మశాస్త్రానికి సవరణలు చేయడానికి నిశ్చయించుకొన్నాడు. ధర్మశాస్త్రంలో పొల్లుగాని, సున్నాగాని మార్చినా, మార్చడానికి ప్రయత్నించిన వారెవరికైనా మరణశిక్ష విధించాలన్నది ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా శాసనం. దానిని యూదులు ఖచ్చితంగా పాటిస్తారు కూడా. ఆ విషయం ఏసు కీ తెలుసు. ఈ సందర్భంలో ఇది చాలా కీలకమైన విషయం.
అందువల్ల నేను మీ ధర్మశాస్త్రాన్ని కొట్టేయడానికి రాలేదు. నెరవేర్చడానికే వచ్చాను అంటూ కొంచెం లౌక్యంగా మాట్లాడాడు.
**అంటే అందరిలాగే ఏసుకి కూడా ప్రాణభయం ఉన్నట్లుగా అర్థమౌతుంది.** అప్పటికే ఆధునిక భావజాలంగల కొంతమంది ఇశ్రాయేలీయులలో యెహోవా ధర్మశాస్త్రంలోని ఆటవికమైన ఆజ్ఞల పట్ల విముఖత, అసంతృప్తి ఉంది. అందువల్లనే యెహోవా ఆజ్ఞలని తృణీకరిస్తూ బోధిస్తున్నప్పటికీ ఏసు మాటలు వినడానికి జనం గుంపులు గుంపులుగా కూడి వచ్చేవారు.

ఐతే పారంపర్యంగా వస్తున్న సంప్రదాయాలని, కట్లుబాట్లని పరిరక్షిస్తున్న యూదాపెద్దలకి ఏసు అనుసరిస్తున్న ఈ ధోరణి నచ్చేది కాదు. వారు ఏసుని దుష్టశక్తుల

సంబంధిగా, ప్రజలను మోసపుచ్చేవాడిగా భావించారు.

**<u>మత్తయి-9:3</u> ఇదిగో శాస్త్రులలో కొందరు ఇతడు దేవదూషణ చేయుచున్నాడని తమలో తాము అనుకొనిరి.**

**<u>మార్కు-3:30</u> ఎందుకనగా ఆయన (ఏసు) అపవిత్రాత్మ పట్టినవాడని వారు చెప్పిరి.**

**<u>లూకా - 11:15</u> అయితే వారిలో కొందరు వీడు(ఏసు) దయ్యములకు అధిపతియైన బయెల్జెబూలు వలన దయ్యములను వెళ్ళగొట్టుచున్నాడని చెప్పకొనిరి.**

ఏసుని అపవాది సంబంధిగా, అబద్ధ బోధకుడిగా భావించిన యూదులు ఆయన్ను ఒకసారి పట్టుకొని కొడతారు కూడా.

**<u>యోహాను-5:16</u> ఈ కార్యములను విశ్రాంతి దినమున చేసినందున యూదులు ఏసును హింసించిరి.** హింసించిరి అంటే శారీరికంగా/మానసికంగా బాధపెట్టారని అర్థం చేసుకోవచ్చు. అయినా ఏసు అదే తిరుగుబాటు ధోరణిని ప్రదర్శిస్తుండటంతో, ఆయన్ని చంపాలని పలుమార్లు ప్రయత్నించారు కూడా. అనేకమార్లు ఏసు వారిచేతి నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తూ వచ్చాడు.

**<u>లూకా-28:30</u> సమాజమందిరములో ఉన్నవారందరూ ఆ మాటలు విని ఆగ్రహముతో నిండుకొని లేచి ఆయనను పట్టణములోనుండి వెళ్ళగొట్టి, ఆయనను తలక్రిందులుగా పడద్రోయవలెనని తమ పట్టణము కట్టబడిన కొండపేటవరకు ఆయనను తీసికొనిపోయిరి. అయితే ఆయన వారిమధ్యనుండి దాటి తన మార్గమున వెళ్ళిపోయెను.**

**<u>యోహాను-7:1</u> అటు తరువాత యూదులు ఆయనను చంప వెదికినందున ఏసు యూదయలో సంచరించనొల్లక గలిలయలో సంచరించుచుండెను.** అంటే ఏసు యూదులకి కనపడకుండా అజ్ఞాతవాసం కూడా చేశాడు.

కొంతకాలమైతే పగలు ప్రజల మధ్య బోధిస్తూ రాత్రి కొండప్రాంతానికి వెళ్ళి రహస్యంగా తలదాచుకొనేవాడు.

**<u>లూకా-21:37</u> ఆయన ప్రతిదినము పగటియందు దేవాలయములో బోధించుచూ రాత్రివేళ ఒలీవల కొండకు వెళ్ళుచూ కాలము గడుపుచుండెను.**

ఈవిధంగా ఏసు తనని చంపడానికి వేటకుక్కల్లా తరుముతున్న యూదులనుంచి తప్పించుకోవడానికి ఒక మనిషి ఎన్ని ప్రయత్నాలు చేయగలడో అన్నిరకాల ప్రయత్నాలు చేశాడు. ఇటువంటి పరిస్థితుల్లో ఉన్న ఏ విప్లవకారుడైనా ఏదో ఒకరోజు వాళ్ళు నన్ను పట్టుకొని చంపుతారు అని ఊహించడం అసాధారణ విషయమేమీ కాదు. అలాగే ఏసు కూడా ఊహించాడు. అయినా ఆ చావుని ఎదుర్కోవడానికి నేను సిద్ధంగా ఉన్నానని ప్రకటించాడు. ఇది సమాజంలో ఉండే సాంప్రదాయక కట్టుబాట్లపై తిరుగుబాటు

చేయాలనుకునే ఏ ఉద్యమకారుడికైనా ఉండే లక్షణమే.

ప్రతి ఉద్యమకారుడు తన ప్రాణాలకి తెగించిన తరువాతనే సాంప్రదాయక వ్యవస్థపై విప్లవాత్మకమైన తిరుగుబాటు చేయగలడు.

ఐతే సమాజంలో తాను కోరుకున్న మార్పుకోసం ప్రాణాలివ్వడానికైనా సిద్ధమే అని దీరోధాత్తంగా ప్రకటించిన ఏసు తీరా సమయం ముంచుకు వచ్చేసరికి మానవ సహజమైన భయంతో చాలా అందోళనకు లోనయ్యాడు.

ఇక తనకు అంతిమ ఘడియలు సమీపించాయని నిర్ధారణకి వచ్చాక తనని రక్షించమని నేలపై సాగిలపడి దేవుడికి ప్రార్ధనలు చేశాడు.

**<u>మార్కు-14:34</u> అప్పుడాయన నా ప్రాణము మరణముగునంతగా దుఃఖములో మునిగియున్నది. మీరిక్కడ ఉండి మెలకువగా ఉండుడని వారితో చెప్పి కొంతదూరము "సాగిపోయి నేలమీద పడి" సాధ్యమైతే ఆ గడియ తనయొద్దనుండి తొలగిపోవలెనని ప్రార్థించుచూ...**

ఆ సమయంలో మానసికస్థైర్యం దెబ్బతిని, విపరీతమైన భయంతో గజగజ వణికిపోయాడు. అది ఏస్థాయిలో అంటే ఆయన చెమట కూడా రక్తంలా మారిపోయిందంట.

**<u>లూకా-22:44</u> ఆయన వేదనపడి మరింత ఆత్రముగా ప్రార్థన చేయుగా ఆయన చెమట నేల పడుచున్న గొప్ప రక్తబిందువులవలె ఆయెను.**

చివరికి ఏసు భయపడినట్టే జరిగింది. సైనికులు, యూదాపెద్దలు కలిసి వచ్చి ఏసుని పట్టుకోవడం సిలువ వేయడం చకచకా జరిగిపోయాయి.

ఐతే ఇక్కడ ఒక తిరకాసు ఉంది. ఏసు సిలువశిక్షను గూర్చి ఎంతో మనోవేదనతో సతమతమై భయంతో వణికిపోతుంటే ప్రధానయాజకులు, పెద్దలు ఏసుపై పడి బందిపోటు దొంగని పట్టుకున్నట్టుగా పట్టుకొని **"ఈడ్చుకుపోయారని"** <u>లూకా-22:54</u>లో ఉంటుంది. మత్తయి, మార్కు సువార్తలల్లో కూడా కొంచెం అటుఇటుగా ఇలాగే ఉంటుంది. యోహాను సువార్తలో మాత్రం సైనికులు వచ్చి ఏసుని వెదుకుతుంటుంటే ఏసే వారివద్దకు వెళ్ళి **మీరు ఎవరికోసం వెతుకుతున్నారు?** నేనే ఆ ఏసుని పట్టుకోండి అని ఎదురెళ్ళినట్టుగా ఉంటుంది. -(యోహాను-18:4-12).

**మరి ఇందులో ఏది నిజమో బైబిల్ రచయితలందరినీ ప్రేరేపించిన ఆ పరిశుద్ధాత్మకే తెలియాలి. ఇంత తేడా ఉన్న సువార్తల్ని తెగ చదివేసిన ఈ క్రీస్తు రక్షకులకు ఈ విషయంలో సందేహం ఎందుకు రావడం లేదో వారైనా తేల్చాలి.**

ఇక వాటన్నిటిని తలదన్నే మరో విషయం ఏసు మరణవాంగ్మూలం. ఏసు

తన ప్రాణంమీదకి వచ్చినపుడు పారిపోతూ, చివరికి గత్యంతరంలేని పరిస్థితులలో మరణం చేరువైనపుడు దుఃఖం, భయం కలగలిసి దేవుడికి ప్రార్ధనలు చేస్తూ, తప్పించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా, అప్పుడప్పుడు మాత్రం తనకి ప్రాణం అంటే తీపి లేదని, నేను నమ్మిన సిద్ధాహాంతాల కోసం అవలీలగా నా ప్రాణం ఇవ్వగలనని అందరు **విప్లవకారులమల్లేనే మాట్లాడుతూ ప్రవర్తిస్తూ వచ్చాడు.**

ఇలా రకరకాలుగా సందర్భావసరాలకి అనుగుణంగా ప్రవర్తించడం అనేది మనిషి సహజ స్వభావం. ఈ స్వభావమే ఏసులో కూడా ప్రతిబింబిస్తుంది. ఐతే సాధారణ పరిస్థితులలో ఎన్నిమాటలు మార్చినప్పటికీ ఒక మనిషి మనసులో ఉన్న అసలు విషయం తన మరణ సమయంలో బయటపడిపోతుంది. ఏ మనిషీ కూడా చివరి ఘడియలలో నటించలేడు, అసత్యం చెప్పలేడు.

అందుకే చట్టం కూడా ఒక వ్యక్తి చివరి ఘడియలలో చెప్పే సాక్ష్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుంది. దానినే మరణవాంగ్మూలం అంటారు. ఏసు కూడా మరణ వాంగ్మూలం ఇచ్చాడు. అదే **"ఏలీ ఏలీ లామా సబక్తానీ". నాదేవా! నాదేవా! నన్నెందుకు చేయి విడిచితివి? -(మత్తయి-27:46)** అంతకముందు కూడా తనని సైనికులు బంధించినపుడు ఇపుడు నేను గనుక వేడుకుంటే నా తండ్రి 72,000 మంది దూతలని నా తరపున యుద్ధం చేయడానికి పంపిస్తాడు అన్నాడు -(మత్తయి-26:53)

కాని చివరి ఘడియలలో ఉన్నప్పుడు మాత్రం నా తండ్రి నన్ను దిక్కులేని అనాధగా వదిలేశాడు అని **తన మనసులో ఉన్న నిజాన్ని పైకి చెప్పేశాడు.**

ఇపుడు క్రైస్తవ మత బోధకులు సిలువ వేయబడటానికి ముందు సిలువ వేయబడిన తరువాత ఏసు పడిన ఈ ఆవేదనని, అంతర్మధనాన్ని దాచేసి, ఆయన సిలువపై చనిపోవడానికే వచ్చాడు. ఇష్టప్రకారమే సిలువ ఎక్కాడు. మనకోసమే మరణించాడు. కాబట్టి మనం పండగచేసుకోవాలి ఆహా! ఒహో! అని గంతులేస్తున్నారు.

ఇంకొంతమంది మోసగాళ్ళైతే దీనిని సిలువయాగం అనీ, ఇదే వేదాలలో చెప్పబడిన యజ్ఞం అనీ, ఏసు యజ్ఞపురుషుడు, బలిపశువు అంటూ పుస్తకాలు కూడా రాసేశారు. **ఒక చెంపమీద కొడితే ఇంకో చెంప చూపించండి అని చెప్పిన ఏసే కనక ఇపుడు తిరిగొస్తే చెప్పు తీసుకొని వీళ్ళ రెండు చెంపలు పగలగొడతాడు. ఇంత అడ్డగోలు, అసత్య ప్రచారాలు చేస్తున్నందుకు.**

ఇక ఏసు ఇశ్రాయేలీయుల చేత తృణీకరించబడి, శ్రమలు పొంది, సిలువపై మరణిస్తాడనే విషయం ఆయనకన్నా ముందు వచ్చిన ప్రవక్తలు చెప్పారని, ఈ విషయాన్ని ఏసు కూడా ధృవీకరించాడని క్రైస్తవ ప్రచారకులు ఊదరగొడుతుంటారు. ఇది ఎంతవరకు

నిజమో చూద్దాం.
నిజంగా ఏసు-'క్రీస్తు' అయితే ఇశ్రాయేలీయులకి రాజవ్వాలి. క్రీస్తు అనే ప్రవక్త వచ్చి ఇశ్రాయేలీయులని కష్టాలనుండి గట్టెక్కిస్తాడు. పరాయి రాజుల దాస్యం నుంచి విడిపిస్తాడు. ఇశ్రాయేలీయులపై రాజుగా అభిషిక్తుడై వారిని పరిపాలిస్తాడు అనేవి ఏసుకి ముందు వచ్చిన ప్రవక్తలు చెప్పిన ప్రవచనాలు తప్ప; క్రీస్తు అనే ప్రవక్త వచ్చి ఇశ్రాయేలీయులని నమ్మించడంలో విఫలమౌతాడు, వారిచేతిలో హత్య చేయిబడతాడు అని ప్రవక్తలు చెప్పనేలేదు. కాని ఏసు విషయంలో మాత్రం వారి ప్రవచనాలు విఫలమయ్యాయి. ఐతే ఈ విషయంపై ఏసు ఏవిధంగా స్పందించాడు? తన గురించి ప్రవక్తలు ఏమి ప్రవచించారని ఆయన ప్రకటించాడు? అని చూస్తే...

ఈ విషయంలో కూడా ఏసు ద్వంద్వ వైఖరిని అవలంబించాడు. అనగా రెండు రకాలుగా పరస్పర విరుద్ధంగా మాట్లాడాడు. ఎలాగంటే?

కొన్నిసార్లు తనకి ఇలా అవమానం జరగడం అనేది ఇంతకముందే వ్రాయబడింది అంటాడు.

**మత్తయి-26:24 మనుష్యకుమారుని గూర్చి వ్రాయబడిన ప్రకారము ఆయన పోవుచున్నాడు గాని యెవనిచేత మనుష్యకుమారుడు అప్పగింపబడుచున్నాడో ఆ మనుష్యునికి శ్రమ.**

**లూకా-18:31,32 ఆయన తన పండ్రెండు మంది శిష్యులను పిలిచి ఇదిగో యెరూషలేముకు వెళ్ళుచున్నాము. మనుష్యకుమారుని గూర్చి "ప్రవక్తల చేత వ్రాయబడిన మాటలన్నియూ" నెరవేర్చబడును. ఆయన అన్యజనుల కప్పగింపబడును. వారు ఆయనను అపహసించి, అవమానపరిచి ఆయనమీద ఉమ్మి వేసి ఆయనను కొరడాలతో కొట్టి చంపుతారు. మూడవ దినమున ఆయన లేచునని చెప్పెను.**

కాని కొన్నిచోట్ల దీనికి పూర్తి విరుద్ధంగా మాట్లాడాడు.

**యోహాను-5:45-47 (ఏసు యూదులతో) మీరాశ్రయించుచున్న మోషే మీ మీద నేరము మోపును. అతడు నన్ను గూర్చి వ్రాసెను గనుక మీరు మోషేను నమ్మినట్లయిన నన్నునూ నమ్ముదురు. మీరతని లేఖనములను నమ్మనియెడల నా మాటలు ఏలాగు నమ్ముదురనెను.**

పై వాక్యంలో ఏసు ఏమంటున్నాడు? మోషే నన్ను గూర్చి వ్రాశాడు. ఏమని వ్రాశాడు? ఏసు ఇశ్రాయేలీయులచేత అవమానించబడతాడు, అపహసించబడతాడు అని. గనక వ్రాసి ఉంటే అపుడు ఏసు ఇశ్రాయేలీయులతో మోషే వ్రాసిన ప్రకారమే మీరు నాయెడల ప్రవర్తిస్తున్నారు, ఇందులో మీ తప్పేమీలేదు, అనాలి. కాని ఏసు ఏమంటున్నాడు?

మీరు మోషేను నమ్మినట్టయిన నన్నునూ నమ్ముదురు. మీరతని లేఖనములను నమ్మనియెడల నా మాటలు ఏలాగు నమ్ముదురు?
అంటే మీకు నిజంగా మోషేపై నమ్మకముంటే అతడు నాగురించి మంచిగా అతని లేఖనాలలో వ్రాశాడు గనుక మీరు నన్ను గౌరవించాలి. నన్ను ప్రవక్తగా ఒప్పుకోవాలి. కాని మీరు నన్ను అంగీకరించడం లేదు గనుక మీకు మోషేపై కూడా నమ్మకం లేదని అర్థం అంటున్నాడు.
అంటే ఏసు అవమానించబడతాడు అని మోషే వ్రాయలేదు. ఏసు గౌరవించబడతాడు అని వ్రాశాడు. కాని ఇశ్రాయేలీయులు మోషేని అనుసరించడంలేదు అని అర్థం వస్తుంది. అలాగే మరో సందర్భంలో...
**<u>యోహాను 7:19</u> మోషే మీకు ధర్మశాస్త్రము ఇయ్యలేదా? అయిననూ మీలో ఎవడును ఆ ధర్మశాస్త్రమును గైకొనడు మీరెందుకు నన్ను చంపజూచుచున్నారని వారితో చెప్పెను.** అంటే ఏసుని చంపడం అనేది ధర్మశాస్త్రానికి విరుద్ధం. మోషే ఇచ్చిన ధర్మశాస్త్రం అర్థమైతే మీరు నన్ను చంపరు. అది అర్థం కాకే నన్ను చంపాలనుకుంటున్నారు అని ఇక్కడ చెప్తున్నాడు.
మరోచోట అయితే ఏసు ఇలా అంటున్నాడు.
**<u>యోహాను-8:44</u> మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు, మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు.** అని తనని చంపాలని ప్రయత్నంలో ఉన్న యూదులతో అంటున్నాడు. అంటే తనని చంపడం అనేది దేవుడి ప్రణాళిక కాదు, దుష్టశక్తి ప్రణాళిక. మీ తండ్రియైన అపవాది నన్ను చంపాలనుకుంటున్నాడు. మీరు అతని దురాశలను నెరవేర్చాలనుకుంటున్నారు. అని యూదుల్ని తిడుతున్నాడు.
అంతకముందు 31వ వచనంలో **మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు** అంటాడు.
అంటే ఏసు చెప్పిన వాక్యము వారిలో నిలిచి ఉంటే వాళ్ళు ఏసుకి శిష్యులవుతారు. ఆ వాక్యం వారిలో లేదు కనుకే తనని చంపాలనుకుంటున్నారు అని స్పష్టం చేశాడు. అందుకే 42వ వచనంలో **దేవుడు మీ తండ్రియైన యెడల మీరు నన్ను ప్రేమింతురు అంటాడు.**
ఈ వాక్యాలన్నీ గమనిస్తే ఏసుని చంపడం అనేది దుష్టశక్తి ప్రణాళిక అనిపిస్తుంది. ఇశ్రాయేలీయులు మోషే ధర్మశాస్త్రాన్ని గాని, లేఖనాలనిగాని నమ్మినట్లయితే ఏసుని ప్రవక్తగా అంగీకరించి గౌరవించేవారు. అంటే ఏసుని సిలువ వేయడం (చంపడం) అనేది మోషేకి, ధర్మశాస్త్రానికి, లేఖనాలకి, దేవుడికి విరుద్ధం అని ఏసు స్వయంగా

చెప్పాడు.
మరి అంతకముందేమో నన్ను అవమానించి కొరడాలతో కొట్టి చంపుతారనే విషయాలు ముందే రాయబడింది, అందుకే ఇలా జరుగుతుంది అన్నాడు. అంటే ఇక్కడ కూడా ఏసులో బైబిల్ ప్రచారకులు దాచిపెడుతున్న మరొక కోణం మనకి దర్శనమిస్తుంది.

---

**లూకా-22:3-5 అంతట పండ్రెండుమంది శిష్యుల సంఖ్యలో చేరిన ఇస్కరియోతు అనబడిన యూదాలో సాతాను ప్రవేశించెను. గనుక వాడు వెళ్ళి ఆయనను వారికేలాగు అప్పగింపవచ్చునో దానిని గూర్చి ప్రధాన యాజకులతోను, అధిపతులతోను మాటలాడెను. అందుకు వారు సంతోషించి వానికి ద్రవ్యమియ్య సమ్మతించిరి.**

ఏసు శిలువ వేయబడటం అనేది దేవుని ప్రణాళిక అంటున్నారు క్రైస్తవ ప్రచారకులు. బైబిల్‌లోనేమో అది సాతాను ప్రణాళిక అని ఉంది. అంటే బైబిల్‌లో దేవుడు సాతానా?

ఏసు వచ్చిందే శిలువ వేయబడటానికి ఐతే మరి ఆ మహత్కార్యానికి కారణభూతుడైన కారణజన్ముడు ఇస్కరియోతు యూదా స్వర్గానికి వెళ్ళాలి కదా!

క్రైస్తవులు అతన్నెందుకు ద్వేషిస్తున్నారు?

# 10. సర్వలోక జగద్రక్షకుడు

అజ్ఞానంతోనో, అమాయకత్వంతోనో, పంతం కోసమో, లేక స్వార్థప్రయోజనాల కోసమో బైబిల్‌లో ఉన్న ఏసుని సర్వలోక జగద్రక్షకుడిగా చిత్రీకరించే పనిలో పడ్డారు క్రైస్తవ ప్రచారకులు. ఇందుకు బైబిల్ సహకరించకపోయినప్పటికీ తమ మేధకి పదును పెట్టి, కిందా, మీదా పడి సర్కస్ ఫీట్లు చేస్తూ ఎలాగైనా సరే 'మమ' అనిపించాలని ఆరాటపడుతున్నారు. పోనీ వీళ్ళు చెప్తున్నట్టుగా బైబిల్‌లో ఏసు సర్వలోక జగద్రక్షకుడిగా ఉన్నాడేమో చూద్దాం. ముందుగా ఒక వ్యక్తిని సర్వలోక జగద్రక్షకుడు అని పిలవాలంటే అతనికి ప్రధానంగా ఉండవలసిన లక్షణం ఒకటుంటుంది. అదేమిటంటే...

**ఆయనకి కుల, మత, వర్గ, ప్రాంత బేధాలు ఉండకూడదు, సర్వమానవాళిని సమభావంతో ఆదరించగలగాలి.** ఒకవేళ మనుషుల మధ్య భేదభావాన్ని చూపదలిస్తే అది ధర్మాధర్మాల ప్రాతిపదికపై ఉండాలి తప్ప; కుల, మత, జాతి, వర్గ, ప్రాంతాల ప్రాతిపదికపై ఉండనేకూడదు.

ఐతే ఏసులో ఈ లక్షణం ఉందా? ఆయన సర్వమానవాళిని సమభావంతో చూడగలిగాడా? ఒకవేళ మనుషుల మధ్య భేదభావాన్ని చూపితే దేని ఆధారంతో ఆ భేదభావాన్ని చూపించాడు? అనే విషయాన్ని కనిపెట్టాలంటే బైబిల్‌ని మరికాస్త జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుంది.

ముందుగా మనం ఒక విషయాన్ని గమనించినట్లయితే; ఇశ్రాయేలీయుల్లో ఒకరకమైన జాత్యహంకారం ఉంటుంది. తమదే ఈ భూమి మీద గొప్పజాతని, తమ జాతినే దేవుడు తన సొంత జనంగా ఎంచుకున్నాడని ఇశ్రాయేలీయులు భావించేవారు. ఇందులో వారి తప్పేమీ లేదు. వారు అలా భావించడానికి గల ప్రధాన కారణం **బైబిల్ దేవుడు యెహోవానే.**

మోషే వ్రాసిన ధర్మశాస్త్రంలో యెహోవా ఏమంటున్నాడో చూడండి.

***<u>ద్వితీ-7:6</u> నీవు (ఇశ్రాయేలీయులు) నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత జనము, నీ దేవుడైన యెహోవా భూమిమీద ఉన్న సమస్త జనములకంటే నిన్ను ఎక్కువగా ఎంచి నిన్ను తనకు స్వకీయ జనముగా ఏర్పరచుకొనెను.***

ఇలా భూమిపై ఉన్న సమస్త జనం కంటే ఇశ్రాయేలీయులుగా పుట్టినవారు గొప్పవారని బైబిల్ దేవుడే చెప్తుంటే ఇశ్రాయేలీయులు మాత్రం ఏంచేస్తారు? వారికి జాత్యహంకారం వచ్చేసింది. ఇతరులని హీనంగా, తక్కువజాతివారిగా పరిగణించారు. అది ఎంతవరకు వెళ్ళిందంటే అన్యులని(ఇశ్రాయేలీయులు కానివారిని) తాకడం కూడా అపరాధంగా భావించేవారు. అనగా అంటరానితనాన్ని అవలంబించారు.

ఇందుకు సంబంధించిన ఆధారాలు బైబిల్ క్రొత్త నిబంధనలో కూడా దొరుకుతాయి.

<u>అ.పొ.10:28</u> **అప్పుడతడు(పేతురు)- అన్యజాతివారితో సహవాసము చేయుటయైనను, అట్టివానిని ముట్టుకొనుటయైనను యూదునికి ధర్మం కాదని మీకు తెలియును.**

<u>అ.పొ.11:3</u> **నీవు(పేతురు) సున్నతి పొందనివారి యొద్దకు పోయి వారితో కూడా భోజనము చేసితివని అతనితో వాదము పెట్టుకొనిరి.**

పై వాక్యాలలో ఎంత అంటరానితనం ఉందో గమనించవచ్చు. ఇవేకాక మరో వాక్యం ఉంది చూడండి.

<u>అ.పొ.21:28</u> **మరియు పౌలు, గ్రీసు దేశస్థులను దేవాలయములోనికి తీసికొనివచ్చి ఈ పరిశుద్ధ స్థలమును అపవిత్రపరచియున్నాడని కేకలు వేసిరి.**

అంటే ఇశ్రాయేలీయులు కానివారు దేవాలయంలోనికి వస్తే ఆ దేవాలయం అపవిత్రమైపోయినట్టుగా భావించేవారు.

ఈ స్థాయిలో ఇశ్రాయేలీయుల్లో జాత్యహంకారం ఉండేది. ఇశ్రాయేలీయుల్లో స్వతహాగా ఉండే ఈ భావజాలం **ఏసులో కూడా** అప్పుడప్పుడు దర్శనమిస్తుండేది. ఒక సందర్భంలో ఒక కనాను స్త్రీ ఏసు వద్దకు వచ్చి తన కుమార్తెకు పట్టిన దయ్యాన్ని వదిలించమని అడుగుతుంది. అందుకు ఏసు నేను కేవలం ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే పంపబడ్డాను, వేరే ఎవరికోసమూ కాదు అంటాడు. అయినా కూడా ఆమె ఏసుని మొక్కి బ్రతిమలాడుతుంది. అపుడు ఏసు **పిల్లల(ఇశ్రాయేలీయుల) రొట్టెలు తీసి కుక్కపిల్లలకు(అన్యులకు) వేయుట యుక్తము కాదని** అంటాడు.

అంటే ఇశ్రాయేలీయులు కాని అన్యులు ఏసు దృష్టిలో కూడా అల్పులే(కుక్కలు) అన్నమాట.

ఆ తరువాత ఆ స్త్రీ ఏసుతో **"నిజమే ప్రభువా కుక్కపిల్లలు కూడా తమ యజమానుల బల్లమీదనుండి పడు రొట్టె ముక్కలు తినును గదా" అని చెప్పగా అపుడు ఏసు ఆమె కుమార్తెను స్వస్థపరచెను** అని ఉంటుంది. - **(మత్తయి-15:21-28).**

అంటే; ఎవరైనా అన్యులు వచ్చి ఇశ్రాయేలీయులు యజమానులు, మేము వారి మోచేతి నీరు తాగి బ్రతికే కుక్కపిల్లలము అని అంగీకరిస్తే అప్పుడు సహాయం చేస్తాడన్నమాట. **సర్వలోకజగద్రక్షకుడు అనబడే వానికి ఉండవలసిన లక్షణమేనా ఇది?** ఏసులో ఉన్న ఈ స్వజాతి అభిమానాన్ని గమనిస్తే, ఒకసారి ఒక శతాధిపతి తన దాసుని స్వస్థపరచమని ఏసుని అడగటానికి యూదా పెద్దలని పంపిస్తాడు. యూదాపెద్దలను మాత్రమే ఎందుకు పంపించాడు? ఎందుకంటే ఏసు కూడా యూదుడే గనుక. ఆ తరువాత ఆ యూదా పెద్దలు వెళ్ళి ఏసుతో ఏమని సంభాషించారో చూస్తే...

**లూకా-7:4 వారు యేసునొద్దకు వచ్చి నీ వలన ఈ మేలు పొందుటకు అతడు యోగ్యుడు. అతడు మన జనులను ప్రేమించి మనకు సమాజమందిరము తానే కట్టించెనని ఆయనతో చెప్పి మిక్కిలి బతిమాలుకొనిరి.**

అంటే ఆ శతాధిపతి మనజనులను అనగా మన యూదులను ప్రేమించి, మనకు ఒక సమాజమందిరం కూడా కట్టించాడు. కనుక అతనికి సహాయం చేయమని అడుగుతున్నారు. అప్పుడు ఏమైందో చూడండి.

**లూకా-7:6 కావున యేసు వారితో కూడా వెళ్ళను.**

అద్గది అసలు సంగతి. అతను యూదులకి మేలు చేశాడు కనుక ఏసు కూడా అతనికి మేలు చేయటానికి వెళ్ళాడు.

ఇది స్వజాతి అభిమానం. ఇది కొంతవరకు పర్వాలేదు. కాని అన్యులను కుక్కలుగా చూడటమే గర్హించదగినది. అసలు సర్వలోక జగద్రక్షకుడు అనేవాడికి **వసుధైక కుటుంబం** అనే భావన ఉండాలి కదా. స్వజాతిపై అభిమానం ఉన్నవారిని కూడా జగద్రక్షకుడిగా పరిగణించలేం. ఏసు తాను చేసే బోధనలలో కూడా **ఇశ్రాయేలీయులు - అన్యులు** అంటూ విడదీసి సంబోధించేవాడు. తన బోధనలన్నీ ఇశ్రాయేలీయులని ఉద్ధరించటానికే అన్నట్లుగా ఉండేవి. ఉదాహరణకి కొన్ని వాక్యాలు చూస్తే...

**మత్తయి-6:7 మరియు మీరు ప్రార్థన చేయునపుడు అన్యజనుల వలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు.**

**మత్తయి-5:47 మీ సహోదరులకు మాత్రము వందనము చేసిన యెడల మీరు ఎక్కువ చేయుచున్నదేమి? అన్యజనులును ఆలాగు చేయుచున్నారు గదా.**

ఈ విధంగా ఇశ్రాయేలీయులని ఉద్దేశించి అన్యజనుల కన్నా మీరు పైస్థాయిలో ఉండాలి. లేకపోతే వారికి మీకు తేడా ఏముంటుంది? అని బోధించేవాడు.

అసలు దేవుడు లేదా దేవుని వద్దనుంచి వచ్చిన ప్రవక్త ఎవరైనా సర్వమానవాళిని ఉద్దేశించి తన సంధేశాన్ని వినిపించాలి గాని, ఇలా "ఒక జాతికి మాత్రమే పరిమితం అయిపోవడం ఏంటి?" ఇశ్రాయేలీయులు కానివారిని అన్యజనులు (పరాయి వాళ్ళు) అని సంబోధించే **'జాఢ్యం'** బైబిల్‌లో మొదటనుంచీ ఉంది. మోషే దగ్గర నుంచీ ప్రవక్తలందరూ **అన్యజనులు అన్యజనులు అన్యజనులు** అంటూ ఇతర మానవుల్ని హీనంగా, చులకనగా చూసేవారు.

బైబిల్ ప్రవక్తలందరికీ ఈ 'మానసిక రుగ్మత' ఉంది. ఏసుతో సహా.

**బైబిల్ దేవుడే నేను ఇశ్రాయేలీయుల దేవుణ్ణి అని నిస్సిగ్గుగా చెప్పుకుంటుంటే, ఇక మానవమాత్రులు వారు మాత్రం ఏం చేస్తారు?**

ఇకపోతే ఏసులో ఈ భావజాలం ఎంత బలంగా ఉండేదంటే...
నేను కేవలం ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే వచ్చాను అని చెప్పడం <u>మత్తయి 15:24</u> లో చూడొచ్చు. తన శిష్యుల్ని కూడా సువార్త ప్రకటించమని పంపించినపుడు వారికి ప్రధానంగా చెప్పిన విషయం **"మీరు ఇశ్రాయేలీయుల వద్దకు కాక అన్యజనుల వద్దకు వెళ్ళొద్దు. వారి పట్టణములలో కూడా ప్రవేశించవద్దు"** అని. (మత్తయి-10:5)
ఈ రెండు విషయాలు బైబిల్ ప్రవక్తలందరూ పాటించినవే. (బైబిల్ ప్రవక్తలందరూ ఇశ్రాయేలీయులేనన్నది చాలా ముఖ్యమైన విషయం).

అయితే ఏసు వాళ్ళందరికన్నా ఒక ఆకు ఎక్కువే చదివాడు.

తాను బోధించేటప్పుడు తన ఎదురుగా ఉన్న జన సమూహంలో ఎవరైనా అన్యులు ఉంటే ఎలా? అని ఒక సందేహం వచ్చింది ఏసుకి. దానికి ఆయన ఒక **చక్కటి** పరిష్కారం కనుగొన్నాడు. అదేమిటో మీరూ చూడండి.

ఏసు తన బోధనలలో ఎక్కువ ఉపమానాలతో చెప్పేవాడు. అందులో కొన్ని అర్థంకాక ఒకసారి ఏసుశిష్యులు, కొంతమంది ఇశ్రాయేలీయులు వాటి భావం ఏమిటని ఏసు ఒంటరిగా ఉన్నప్పుడు ఆయనను అడిగారు. అప్పుడు ఏసు ఏమని సమాధానమిచ్చాడో చూడండి.

**<u>మార్కు-4:11,12</u> అందుకాయన దేవుని రాజ్యమర్మము (తెలిసికొనుట) మీకు అనుగ్రహింపబడియున్నది గాని వెలుపలనుండువారు ఒకవేళ దేవునివైపు తిరిగి పాప క్షమాపణ పొందుదురేమోనని వారు చూచుటకైతే చూచియు కనుగొనకను, వినుటకైతే వినియు గ్రహింపకయు నుండుటకును అన్నియు ఉపమానరీతిగా వారికి బోధింపబడుచున్నవని వారికి చెప్పెను.**

*ఈ వాక్యం ఒక్కటిచాలు ఏసు మనస్తత్వం(అంతరంగం) ఏమిటో చెప్పడానికి. వెలుపలనుండువారు అంటే అన్యులు దేవునివైపుకి తిరిగి పాపక్షమాపణ పొందకుండా ఉండటానికి వారు చూచినా, వినినా కూడా అర్థం కాకుండా ఉపమానరీతిగా బోధిస్తున్నాను. దేవుని రాజ్యమర్మం గురించి తెలుసుకోవడం మీకు అంటే కేవలం ఇశ్రాయేలీయులకి మాత్రమే అనుగ్రహింపబడింది అంటున్నాడు ఏసు.

ఇక్కడ ఆయన ఎంత ఇశ్రాయేలీయుల పక్షపాతో అర్థమౌతుంది. ఇందులోనే మరొక ప్రధానాంశం కూడా ఉంది. వెలుపలనుండువారు దేవునివైపుకి తిరిగి పాపక్షమాపణ పొందకుండునట్లు వారికి అర్థం కాకుండా బోధిస్తున్నాను అంటున్నాడు. అంటే పాపక్షమాపణ అనేది తాను బోధించే వాక్యాన్ని విని అర్థంచేసుకొని అనుసరించడం ద్వారానే జరుగుతుందంటున్నాడు. క్రైస్తవులు ప్రచారం చేస్తున్నట్టు "ఏసు సిలువమరణం

ద్వారా పాపక్షమాపణ" అనే భావన ఏసు ప్రణాళిక కాదని ఇక్కడ స్పష్టంగా అర్థమౌతుంది. ఈ విషయాన్నే నేను ఇంతకుముందు భాగాలలో అనేక ఋజువులతో సహా వివరించాను. అయితే ఆ పాపక్షమాపణ పొందడం, దేవుని రాజ్యంలోకి ప్రవేశించడం కేవలం ఇశ్రాయేలీయులకి మాత్రమే అనుగ్రహించబడింది అని ఖరాఖండిగా చెప్పేశాడు ఏసు. ఈ విధంగా ఆయన **మనసా,వాచా,కర్మణా** త్రికరణ శుద్ధిగా ఇశ్రాయేలీయులని మాత్రమే రక్షించాలనుకున్నాడు. అదికూడా తన వాక్యాన్ని వారికి బోధిండం ద్వారా మాత్రమే. వారి పాపాల కోసం మరణించడం, రక్తం కార్చడం ద్వారా కాదు.

ఈ విషయాన్ని **క్రైస్తవుల దేవుడైన పౌలు** కూడా ధృవీకరిస్తున్నాడు. (పౌలు క్రైస్తవుల దేవుడెలాగో మరో భాగంలో చూద్దాం.)

***<u>అ.పొ. 13:23</u> అతని (దావీదు) సంతానము నుండి దేవుడు తన వాగ్దానము చొప్పున ఇశ్రాయేలీయుల కొరకు రక్షకుడగు ఏసుని పుట్టించెను.***

ఏసు ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే పుట్టిన రక్షకుడు అని ఇక్కడ ఒప్పుకున్నారు. దావీదు వంశంలోనుండి ఇశ్రాయేలీయులని రక్షించేవాణ్ణి పుట్టిస్తానని కదా బైబిల్ దేవుడి వాగ్దానం. ప్రపంచం మొత్తానికి రక్షకున్ని పుట్టిస్తాను అని కాదు కదా.

**అదలా ఉంచి ఆ ఇశ్రాయేలు రక్షకుడు ఏసే అయితే ఏసు ఇశ్రాయేలీయులని ఏవిధంగా రక్షించాడో క్రైస్తవ మత ప్రచారకులు చెప్పగలరా? బైబిల్ మొత్తంలో ఏసు ఇశ్రాయేలీయులని ఫలానా విధంగా రక్షించినట్లుగా ఒక్క వాక్యం అయినా చూపించగలరా? అడ్డగోలు మాటలు మాట్లాడకుండా సూటిగా దీనికి సమాధానం చెప్పండి.**

పాతనిబంధన ప్రకారం క్రీస్తు ఇశ్రాయేలీయులని పరాయి రాజుల దాస్యం నుంచి రక్షించాలి. కానీ ఏసుకి కనీసం ఆ ఆలోచన కూడా ఉన్నట్లు కనిపించదు. ఆయన తన వాక్యాన్ని వారికి బోధించడం ద్వారా వారికి పాపక్షమావణ కలగజేసి రక్షిద్దామనుకున్నాడు. ఇశ్రాయేలీయులందరూ ఏసుని దొంగబోధకుడు, అన్నారే గాని కనీసం ప్రవక్తగానైనా విశ్వసించలేదు.

అంటే; **ఏసు ఇశ్రాయేలు రక్షకుడిగా పుట్టాడు కాని ఇశ్రాయేలీయులని ఏ విధంగానూ రక్షించలేకపోయాడు.** వారిని రక్షించే ప్రయత్నాలలో అన్ని విధాలుగా విఫలమయ్యాడు అని బైబిల్ తెలియజేస్తోంది. ప్రపంచంలో ఒక చిన్న గుంపుకోసం వచ్చానని చెప్పుకున్న వ్యక్తి వారినే రక్షించలేనప్పుడు ఇంకా సర్వలోక జగద్రక్షకుడు ఎలా కాగలగుతాడు? **"ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందట"** అనే సామెత ఆ క్రైస్తవ ప్రచారకులని చూసే చెప్పి ఉంటారు. విడ్డూరమనిపించే ఒక మాట చెప్పనా! ఆయన రక్షకుడా కాదా? అదలా ఉంచితే ఈనాటి బుడిబుడి ప్రసంగీకులంతా ఎవరికివారు తాము ఏసును రక్షించడానికే పుట్టినట్లుగా రెచ్చిపోయి మాట్లేస్తున్నారు.

# 11. (విఫలమైన) ఏసు రెండవ రాకడ

ఈరోజు ప్రపంచాన్ని భయపెడుతున్న ప్రధానమైన విషయాలలో ఒకటి క్రైస్తవ మతబోధకులు ప్రచారం చేస్తున్న ఏసు రెండవ రాకడ. అదిగో పులి అంటే ఇదిగో తోక అంటారు ప్రచారకులు. 2,000 సంవత్సరం సమీపిస్తున్నప్పుడు ఒక క్రైస్తవ సమూహం వచ్చి యేసయ్య వచ్చేస్తున్నాడు త్వరగా మతం మారండి అంటారు. ఎక్కడైనా భూకంపాలు వస్తే ఇవి ఏసయ్య రాకడ సమీపమై ఉన్నాయనడానికి సూచన అంటూ ఇంకో సమూహం తయారవుతుంది.

వచ్చేస్తున్నాడు, వచ్చేస్తున్నాడు ఇదే చివరిరాత్రి, కాళరాత్రి అంటూ మైకులు విరగ్గొట్టేస్తుంటారు. సమయంలేదు మిత్రమా మతం మారడమా, నరకానికి పోవడమా? అంటూ అమాయకుల్ని బెదరగొట్టేస్తుంటారు. ఇంతకూ ఈ క్రైస్తవ మత ప్రచారకులు ఇంత హడావిడి సృష్టిస్తున్న ఈ రెండవ రాకడ కథాకమామీషు ఏంటి? అది ఎప్పుడు జరుగుతుంది? బైబిల్‌లో దాని గురించి ఏమి వివరాలు ఉన్నాయి? అవి చూద్దాం రండి...

ఏసు తాను మళ్ళీ భూమిపైకి వస్తానని అప్పుడు తాను వచ్చి కొంతమందిని స్వర్గానికి, కొంతమందిని నరకానికి పంపుతానని చెప్తాడు. అయితే తన రెండవ రాకడ ఎప్పుడు జరుగుతుందనే విషయంపై ఆయన చాలా స్పష్టమైన ప్రకటనలు చేశాడు.

***మార్కు-9:1*** ***ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచిచూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను.***

పైవాక్యంలో తనతోపాటు ఉన్న కొంతమంది చనిపోకముందే దేవుని రాజ్యం వచ్చేస్తుందని ఏసు సెలవిస్తున్నాడు. మరి వారిలో ఎవ్వరూ ఇప్పటిదాకా బ్రతికిలేరు. అందరూ వందల సంవత్సరాల క్రితమే మరణం రుచి చూశారనడంలో సందేహం లేదు. అయితే దేవుని రాజ్యం ఈ పాటికే వచ్చి ఉండాలి కదా! ఏసు చెప్పిన మాట ప్రకారం ఆ రాజ్యం వచ్చిందా? అని అడిగితే ఓహ్! ఎప్పుడో వచ్చేసింది అని సమాధానమిస్తారు ఉన్నది ఊడ్చేసి, లేనివి తగిలించడంలో సిద్ధహస్తులు, గండరగండులైన క్రైస్తవమత ప్రచారకులు.

ఐతే దేవుని రాజ్యం ఎక్కడ? ఏది? అని అడిగితే యథాప్రకారంగా ఈ విషయంలో కూడా క్రైస్తవ ప్రచారకుల సమాధానాలు ఎవరి గొడవ వారిదే అన్నట్లుగా ఉంటాయి.

కొంతమంది ఏసు సిలువ వేయబడటంతోనే దేవుని రాజ్యం వచ్చినట్లు అంటారు. ఇంకొందరేమో ఏసు మరణించి పునరుత్థానమైన రోజు నుంచి దేవుని రాజ్యం వచ్చినట్లు అంటారు.

మరికొందరు ఏసు పేరుతో కొత్త మతం (క్రైస్తవం) ప్రారంభమైనప్పుడు దేవుని రాజ్యం వచ్చినట్లు అంటారు.

ఇవన్నీ క్రైస్తవ ప్రచారకులు ఎవరి సామర్థ్యంమేర వారు చేస్తున్న కల్పిత ప్రచారాలు మాత్రమే.

కాని ఏసు దృష్టిలో దేవుని రాజ్యం అంటే ఏమిటి?

అది ఎప్పుడు రావాలి? అని బైబిల్‌ని పరిశీలిస్తే...

**<u>లూకా-21:29-31</u> మరియూ ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. అంజూరపు వృక్షమును సమస్త వృక్షములను చూడుడి. అవి చిగురించుట చూచి వసంతకాలమప్పుడే సమీపమాయెనని మీ అంతట మీరు తెలిసికొందురు గదా. అటువలె మీరు ఈ సంగతులు జరుగుట చూచినపుడు "దేవుని రాజ్యము" సమీపమాయెనని తెలిసికొనుడి.**

పై వాక్యంలో ఏసు ఏమంటున్నాడు? చెట్లు చిగురించడం చూస్తే వసంతకాలం సమీపముగా ఉన్నదని మీకు ఎలా తెలుస్తుందో, అలాగే ఈ సంగతులు జరిగినప్పుడు దేవుని రాజ్యము సమీపములో ఉన్నదని తెలుసుకోండి అంటున్నాడు. 'దేవుని రాజ్యం' రావాలంటే ఈ సంగతులు జరగాలి.

ఏమిటా సంగతులు? అంటే ఆపై వాక్యాలలో కొన్ని సంఘటనలను ఏసు వివరించాడు. ఇప్పుడు ఆ విషయాలు ఏమిటో చూద్దాం.

**<u>లూకా-21:5:28</u> కొందరు ఇది అందమైన రాళ్ళతోను అర్పితములతోను శృంగారింపబడియున్నదని దేవాలయమును గూర్చి మాటలాడుచుండగా ఆయన ఈ కట్టడములు మీరు చూచుచున్నారే వాటిలో రాతిమీద రాయి యుండకుండ అవి పడద్రోయబడు దినములు వచ్చుచున్నవని చెప్పెను. అప్పుడు వారు బోధకుడా ఆలాగైతే ఇవి ఎప్పుడు జరుగును? ఇవి జరగబోవుననుటకు సూచన ఏమని ఆయననడుగగా ఆయన - మీరు మోసపోకుండా చూచుకొనుడి. అనేకులు నాపేరట వచ్చి నేనే ఆయనననియు, కాలము సమీపించెననియు చెప్పుదురు.....**

**జనము మీదకి జనము, రాజ్యము మీదకి రాజ్యమును లేచును. అక్కడక్కడ గొప్ప భూకంపములు కలుగును. తెగుళ్ళను, కరువులను తటస్థించును.....**

**27. అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోనూ మహా మహిమతోనూ మేఘారూఢుడై వచ్చుట చూతురు. ఇవి జరుగ నారంభించినపుడు మీరు ధైర్యము తెచ్చుకొని మీ తలయెత్తుకొనుడి. మీ విడుదల సమీపించుచున్నదనెను.**

అంటే జనంమీదకి జనం లేవడం, యుద్ధాలు జరగడం, భూకంపాలు రావడం ఇవన్నీ అయ్యాక మనుష్య కుమారుడు అంటే ఏసు మహామహిమతో మేఘారూఢుడై రావాలి.

ఇదే రెండవ రాకడ. అలాంటివి జరిగినప్పుడు దేవుని రాజ్యం సమీపమై యున్నది అని తెలుసుకొనుము అంటున్నాడు. దీనినిబట్టి ఏసు రెండవరాకడ తరువాతే దేవుని రాజ్యం వస్తుంది అని స్పష్టమౌతుంది. క్రైస్తవ ప్రచారకులు చెప్తున్నట్లుగా ఏసు సిలువ వేయబడితేనో, ఏసు పేరుతో కొత్త మతం మొదలైనప్పుడో దేవుని రాజ్యం వచ్చినట్లు కాదు.

మరి ఈ దేవుని రాజ్యం ఎప్పుడొస్తుందని మార్కు సువార్తలో చెప్పబడింది? అక్కడున్న కొందరు మనుషులు మరణం రుచిచూడక మునుపే అంటే ఆ తరం నశించక మునుపే అని కదా! లూకా సువార్తలో కూడా ఈ విషయాన్ని విస్పష్టంగా చెప్పాడు ఏసు.

**<u>లూకా-21:32</u> అవన్నియూ జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.**

అదీ విషయం. పైన చెప్పిన సూచన క్రియలు, ఏసు మేఘాల మీద రావడం ఇవన్నీ ఎప్పుడు జరగాలి? ఆ తరం గతించకమునుపే జరగాలి. ఇదే విషయాన్ని ఏసు అనేకసార్లు చెప్పాడు. ఇంత ప్రాధాన్యత కలిగిన విషయాన్ని ఒక్కరు కూడా పట్టించుకోకుండా కాలం సమీపించి ఉందని 2000 యేండ్లుగా ఊదరగొడుతూనే ఉన్నారు దొంగ బోధకులు.

**<u>మత్తయి-16:27,28</u> మనుష్య కుమారుడు తన తండ్రి మహిమగలవాడై తన దూతలతో కూడా రాబోవుచున్నాడు. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును. ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు మనుష్య కుమారుడు తన రాజ్యముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను.** నేను మహిమతో మేఘారూఢుడనై ఈతరం గతించకమునుపే, అంటే ఇక్కడున్న కొందరు మనుషులు మరణం రుచిచూడక మునుపే వస్తానని ఏసు నిర్ద్వందంగా తేల్చి చెప్పేశాడు.

ఇదే విషయాన్ని <u>మత్తయి-24:29-34</u>, <u>మార్కు-13:26-30</u> లలో కూడా చూడవచ్చు.

**ఏసుతో పలు విషయాలలో విభేదించిన క్రైస్తవుల దేవుడు పౌలు కూడా ఈ ఒక్క విషయంలో మాత్రం ఏసుతో ఏకీభవించాడు.**

మనం బ్రతికుండగానే ఏసు రెండవ రాకడ ఉంటుంది. ఆయన వచ్చాక మనమందరం మేఘాలమీదెక్కి ఆకాశానికి వెళ్ళిపోతాం అని ఇంకొంచం విడమరచి చెప్పాడు.

**<u>1వ థెస్సలోనీకయులకు-4:15,16,17</u> మేము ప్రభువు(ఏసు) మాటనుబట్టి మీతో చెప్పునదేమనగా ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము** (అంటే ఏసు రెండవరాకడ వరకు మనం సజీవంగా అనగా బ్రతికే వుంటాం అంటున్నాడు.) **నిద్రించిన వారికంటె(మరణించినవారికంటే) ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును. <u>క్రీస్తు</u>నందుండి మృతులైనవారు మొదటలేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు**

***మనము వారితో కూడా ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము.***

అనగా ఏసు వచ్చినప్పుడు ఆయనయందు విశ్వాసముంచి చనిపోయినవారు మొదట లేస్తారు. ఆ మీదట బ్రతికి ఉన్న మనం వారితో (చనిపోయి తిరిగిలేచిన వారితో) కలిసి ప్రభువును ఎదుర్కొనడానికి ఆకాశమండలానికి మేఘముల మీద వెళ్ళిపోతాం అంటూ చాలా విషయాలలో ఏసుకి, యెహోవాకి విరుద్ధమైన భావజాలంతో క్రైస్తవాన్ని నిలబెట్టిన పౌలు ఈ ఒక్క విషయంలో మాత్రమే ఏసుతో ఏకీభవించడం క్రైస్తవానికి మరణశాసనంగా పరిణమించేలా ఉంది.

**"ఈ తరం గతించకమునుపే నేను రెండవసారి వస్తాను"** అని ఏసు చెప్పిన వాక్యాలకి కూడా పౌలు తన మేధ తో వక్రభాష్యం చెప్పినట్లయితే క్రైస్తవం మరో పదికాలాలపాటు నిలిచి ఉండేదేమో.

ఈ క్రైస్తవ ప్రచారకులు ప్రజలందరినీ హడలెత్తిస్తూ మతం మారండి ఎక్కువ సమయం లేదు అని భయపెట్టడానికి చూపిస్తున్న బూచి **"ఏసు రెండవరాకడ"**. ఇది కాస్తా కాలం చెల్లిపోయిందని తెలిస్తే పాపం వారి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లుగా అవుతుంది. కాకుంటే ఈ వాక్యాలకి రంగులేయడానికి ఎవరి బకెట్‌తో వారు పెద్దపెద్ద కుంచెలతో సిద్ధంగా ఉంటారు. మనం బ్రతికుండగానే ఏసు వచ్చేస్తున్నాడని చెప్పిన పౌలు అంతటితో ఆగలేదు. దానిని ఇంకా విస్తృతంగా ప్రచారం చేయడానికి విస్తుగొలిపే మరోవిషయం కూడా చెప్పాడు. అదేంటంటే **పెళ్ళిళ్ళు చేసుకోవద్దు** అని.

***<u>1వ కొరింథీయులు-6:8,9</u> నావలెనుండుట వారికి మేలని పెండ్లికాని వారితోనూ, విధవరాండ్రుతోనూ చెప్పుచున్నాను. అయితే మనస్సు నిలపలేనియెడల పెండ్లి చేసికొనవచ్చును. కామతప్తులగుటకంటే పెండ్లి చేసికొనుట మేలు.***

కొంతలో కొంత నయం ఏమిటంటే ఇది నిర్బంధం అని చెప్పలేదు. కామంతో కటకటలాడేవారయితే పెళ్ళి చేసుకోండి పాపం లేదు. కాని పెళ్ళిచేసుకోకపోవడం ఉత్తమం అంటాడు. ***"ఎందుకంటే పెళ్ళైనవాడు భార్యని ఎలా సంతోషపెట్టాలి అని, పెళ్ళైన స్త్రీ భర్తని ఎలా సంతోషపెట్టాలి అని ఆలోచిస్తున్నారు. పెళ్ళి కానివారు మాత్రం ప్రభువునెలా సంతోషపెట్టాలి అని ఆత్మ సంబంధమైన విషయం గురించి ఆలోచిస్తున్నారు. అందుకని ఇది మీ ప్రయోజనం కోసమే చెప్తున్నాను*** అంటాడు. (1వ కొరంథీయులు-7:32-36)

అందరూ పెళ్ళిళ్ళు చేసుకోకపోతే సృష్టే ఆగిపోతుంది కదా! అని ఎవరికైనా సందేహం రావచ్చు. అసలు పౌలు చెప్తున్నదేంటి? త్వరలో ఈ సృష్టే లేకుండా పోతుంది ఇంకా పెళ్ళిళ్ళేమిటి? అని.

**<u>1వ కొరంథీయులు-7:29</u> సహోదరులారా! నేను చెప్పునదేమనగా కాలము సంకుచితమైయున్నది. <u>31వ.</u> ఈ లోకపు నటన గతించుచున్నది.**

ఇప్పుడు క్రైస్తవ ప్రచారకులు వచ్చేస్తున్నాడు, వచ్చేస్తున్నాడు అని ఎంత ఆర్భాటంగా అరుస్తున్నారో ఈపోకడ 2,000 సంవత్సరాల క్రితం పౌలుతోనే ప్రారంభమయింది. అదే ఇప్పటివరకూ "పాడిందే పాడరా పాచిపళ్ళ దాసుడా" అన్నట్టుగా కొనసాగుతోంది.

అయితే ఈ విషయంలో మనం పౌలు మీద మాత్రమే నెపం వేయలేం. ఎందుకంటే మీరు బ్రతికుండగానే అంటే ఈ తరం గతించక మునుపే వస్తానని ఏసే స్వయంగా చెప్పాడు గదా. దానిని పౌలు ఇంకొంచెం విస్తృతంగా ప్రచారం చేశాడంతే. ఈ ఒక్క విషయంలో పౌలు తన మేధ కి పని చెప్పకుండా గ్రుడ్డిగా ఏసుని అనుసరించడం క్రైస్తవానికి గొడ్డలిపెట్టు అని చెప్పవచ్చు. ఎందుకనగా దానివల్ల 'ఏసు చెప్పిన రెండవ రాకడ విఫలమయింది' అని పౌలు కూడా నిర్ధారించినట్లు తేటతెల్లమవుతుంది.

ఏసు రెండవ రాకడకి కాలం చెల్లిపోయింది అనే విషయం అలా ఉంచితే, ఇందులో ఒక చమత్కారమైన విషయం బైబిల్‌లో కనబడుతుంది.

**<u>యోహాను-5:28,29</u> ఒక కాలం వచ్చుచున్నది. ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవపునరుత్థానమునకు కీడుచేసిన వారు తీర్పుపునరుత్థానమునకు బయటకి వచ్చెదరు.**

ఈ వాక్యం స్వయంగా ఏసే చెప్పాడు. దీనిప్రకారం ఏసు తన రెండవ రాకడలో విశ్వాసులందరినీ శాశ్వతంగా స్వర్గానికి, అవిశ్వాసులందరినీ శాశ్వతంగా నరకానికి పంపిస్తాడని అర్థం వస్తుంది. అలాగే పౌలు కూడా తాను బ్రతికుండగానే ఏసు వచ్చేస్తాడని, మనమందరం సశరీరంగా మరణించకుండానే మేఘాలమీదెక్కి ఆకాశానికెళ్ళిపోతాం, అక్కడ ప్రభువుతోపాటు సదాకాలం ఉంటామని చెప్పాడు.

కాని ఏసు శిష్యుడైన యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథంలో; ఏసు రెండవసారి భూమిపైకి వచ్చాక తన సువార్త ప్రచారం చేస్తూ ప్రాణాలు పోగొట్టుకున్నవారిని కొంతమందిని బ్రతికించి వారితోపాటు వెయ్యి సంవత్సరాలు భూమిపై పరిపాలన చేస్తాడు, ఇది ముగిశాక చెరలో ఉన్న సాతాను విడిపింపబడి కొంతమందిని పోగుచేసుకొని ఏసుపై యుద్ధానికి వస్తాడు. అప్పుడు అగ్ని దిగివచ్చి వారందరిని దహిస్తుంది. సాతాను అగ్నిగుండంలో పడవేయబడతాడు. -(ప్రకటన-20:4-10)

ఏసు, పౌలు చెప్పిన ఏసు రెండవ రాకడలో భూమిపై ఈ వెయ్యి సంవత్సరాల పరిపాలన లేదు. కాని యోహానుని పరిశుద్ధాత్మ ఇలా ఎందుకు ప్రేరేపించిందో!

## 12. ఏసు మహిమాన్వితుడా?

క్రైస్తవంపై విశ్వాసంతో బైబిల్ చదువుతున్న వారికి ఈ సందేహం రాదు గాని, యథార్ధ దృష్టితో బైబిల్ చదివితే మాత్రం ఏసు మహిమ తత్వంపై అనేక అనుమానాలు రాకమానవు. బైబిల్‌లో ఏసు అనేక అద్భుతాలు చేసినట్టుగా వ్రాయబడింది.
ఆ అద్భుతాలు ఏమిటంటే; దయ్యాలని వదిలించడం, కుంటివాళ్ళని, గుడ్డివాళ్ళని, రోగులని బాగుచేయడం, నీళ్ళని ద్రాక్ష రసంగా మార్చడం, ఐదు రొట్టెలు, రెండు చేపలని వేల మందికి పంచిపెట్టడం, సముద్రంలో నీటిపై నడవడం. ఇందులో చాలావరకు ప్రజల మధ్య బహిరంగంగానే చేసినట్టుగా కూడా బైబిల్‌లో చూడొచ్చు.
అయితే సాధారణంగా బైబిల్ పాఠకులకి వచ్చే సందేహం ఏమిటంటే; **ఇన్ని అద్భుతాలు, అసాధారణ మహత్కార్యాలు చేసిన ఏసుని ప్రజలు ఎందుకు ప్రవక్తగా అంగీకరించలేదు?** వారంతా మనుషులే కదా! కఠిన శిలలు కాదుగా? కొంతమంది మూర్ఖులు ఏకాలంలోనైనా, ఏ సమాజంలోనైనా ఉంటారనుకుందాం. కాని కొంతమందైనా కళ్ళముందు ప్రత్యక్షంగా ఇన్ని అద్భుతాలు జరుగుతున్నప్పుడు ఆయన్ని మహిమాన్వితుడిగా నమ్మి ఉండాల్సింది కదా.

**ఒక కుంటివాన్ని చూచి నీవు లేచి స్వస్థతనొందుము అనగానే వాడు లేచి తన పరుపెత్తుకుని పరిగెత్తడం, గ్రుడ్డివాన్ని ముట్టుకోగానే చూపు రావడం, కుష్టువారిని క్షణాలలో పరిశుద్ధులుగా మార్చేయడం ఇవేమైనా సాధారణ విషయాలా?**
ఒకసారి ఏసుని పరిసయ్యులు ఏమడుగుతున్నారో చూడండి.
***<u>మార్కు-8:11,12</u> అంతట పరిసయ్యులు వచ్చి ఆయనను శోధించుచు ఆకాశమునుండి ఒక సూచకక్రియను చూపుమని ఆయననడిగి ఆయనతో తర్కింపసాగిరి. ఆయన ఆత్మయందు పెద్ద నిట్టూర్పు విడిచి ఈ తరము వారు ఎందుకు సూచకక్రియ నడుగుచున్నారు? ఈ తరమునకు ఏ సూచకక్రియయు అనుగ్రహింపబడదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని చెప్పి వారిని విడిచి మరల దోనె ఎక్కి అద్దరికి పోయెను.***
పై సందర్భంలో పరిసయ్యులు ఏసుని సూచకక్రియ చేయమంటున్నారు. ఎందుకంటే నేను దేవుడు పంపగా వచ్చిన ప్రవక్తని అని ఏసు చెప్పుకున్నాడు కనుక వారు ఇలాంటి పరీక్ష పెడుతున్నారు. అపుడు ఏసు ఏంచేయాలి? తన దగ్గర నిజంగా మహిమ ఉంటే చేసి చూపించాలి. లేదా అంతకముందే అనేక అద్భుతాలు చేశాను వాటిని చూసి కూడా మళ్ళీ ఎందుకు అడుగుతున్నారు? అనాలి. ఈ రెండు కాకుండా ఈ తరం వారికి ఏ సూచకక్రియ అనుగ్రహింపబడదని లేచి వెళ్ళిపోవడమేంటి?

మరో సందర్భంలో ప్రజలు ఏసుతో ఏమంటున్నారో చూడండి.

యోహాను-10:24 ఎంతకాలము మమ్మును సందేహ పెట్టుదువు? నీవు క్రీస్తువైతే మాతో స్పష్టంగా చెప్పమనిరి.

ఇశ్రాయేలీయులు తమని రక్షించడానికి వచ్చే క్రీస్తు కోసం ఎంతో ఆతురతతో ఎదురు చూస్తున్నారన్నది కాదనలేని నిజం. అందుకే ఏసుని నీవే క్రీస్తు అయితే స్పష్టంగా చెప్పు అంటున్నారు. ఒకవేళ నిజంగా ఆయన క్రీస్తే అని వారికి నమ్మకం కలిగినట్లయితే వారంతా ఏసుకి బ్రహ్మరథం పట్టేవారు. కాని క్రీస్తుకి సంబంధించిన ప్రమాణాలు, లక్షణాలు వారికి ఏసులో కనిపించడం లేదు ఏసు సిలువ వేయబడిన సమయంలో కూడా ప్రజలు ఏమనుకుంటున్నారో చూడండి.

మత్తయి-27:42,43 వీడు ఇతరులను రక్షించెను. తన్ను తానే రక్షించుకొనలేడు. ఇశ్రాయేలు రాజుగదా. ఇప్పుడు సిలువ మీదనుండి దిగినయెడల వాని నమ్ముదుము. వాడు దేవునియందు విశ్వాసముంచెను. నేను దేవుని కుమారుడనని చెప్పెను గనుక ఆయనకిష్టుడైతే ఆయన ఇపుడు వానిని తప్పించునని చెప్పిరి.

మార్కు-15:36,37 ఒకడు పరుగెత్తిపోయి ఒక స్పంజీ చిరకాలో ముంచి రెల్లున తగిలించి ఆయనకు త్రాగనిచ్చి తాళుడి ఏలియా వాని దింపవచ్చునేమో చూతుమనెను. అంతట ఏసు గొప్ప కేకవేసి ప్రాణము విడిచెను.

అంటే ఇక్కడ ఏమి అర్ధమౌతుంది? ఏసుని సిలువ మీద నుంచి రక్షించడానికి ఎవరైనా ప్రవక్తలు వస్తారా? దేవుడు రక్షిస్తాడా? యేసు నేను దేవుని కుమారుణ్ణి అని చెప్పుకున్నాడు కదా. ఏదైనా అద్భుతం జరుగుతుందా? జరిగితే అపుడు నమ్ముదాం అని అక్కడి ప్రజలు ఎదురు చూస్తున్నారనే కదా!

ఏసు విషయంలో ఏదైనా మాహాత్మ్యం కనబడితే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మరి ఏసు అంతకముందే ఎన్నో అద్భుతాలు చేసి ఉంటే వారికి ఇంకా ఈ ఎదురు చూపులు ఎందుకు ఉండేవి?

ఏసుని పిలాతు దగ్గరికి విచారణ కోసం తీసుకు వచ్చినపుడు ఆయన చేసిన మహత్కార్యాలను ప్రత్యక్షంగా చూసిన వేలాదిమందిలో ఒక్కరంటే ఒక్కరు కూడా వచ్చి, ఈయన నిజంగా 'మహిమాన్వితుడే' అని ఎందుకు సాక్ష్యం చెప్పలేదు?. పైగా మీకు బరబ్బాని విడుదల చేయనా? ఏసుని విడుదల చేయనా అని పిలాతు అడిగినపుడు నరహంతకుడు, బందిపోటు దొంగ అయిన బరబ్బానే విడుదల చేయండి ఏసుని మాత్రం వదిలిపెట్టొద్దు చంపండి అని అందరూ కేకలు వేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇది మొదటి విషయం ఇక రెండవ విషయాన్ని చూస్తే... సాధారణ ప్రజల సంగతి అలా ఉంచితే; ఏసు శిష్యులు అయినా ఆయన్ని మహిమాన్వితుడిగా విశ్వసించారా? అంటే

**1) ఉన్న పన్నెండు మంది శిష్యులలో ఒకడు ముప్పై వెండి నాణేలకి దేవుని కుమారుణ్ణి అమ్మేశాడు.**

**2) ఏసుని సైనికులు బంధించగానే మిగిలిన శిష్యులందరూ పరారయ్యారు.**

**3) ఒక ప్రధాన శిష్యుడు పేతురు అయితే అసలు ఆ ఏసు ఎవరో నాకు తెలియనే తెలియదని చెప్పాడు.**

ఇదీ ఏసు మహత్కార్యాలని ప్రత్యక్షంగా సమీపంలోనుంచి చూసిన ఆయన శిష్యుల పరిస్థితి.

ఇక చివరికి ఏసు కుటుంబ సభ్యులైనా ఆయనలో ఉన్న విశిష్టతని గుర్తించారా? అంటే అదీలేదు. ఏసు రక్త సంబంధీకులకి ఆయనపై ఎలాంటి అభిప్రాయం ఉందో చూడండి.

***మార్కు-3:21*** ***ఆయన ఇంటివారు సంగతి విని ఆయన మతి చలించియున్నదని చెప్పి ఆయనను పట్టుకొనబోయిరి.***

అంటే ఏసుని పిచ్చోడిగా మతిభ్రమించిన వాడిగా భావించి ఆయనని బంధించబోయారు. ఇంకో సందర్భం చూడండి.

***యోహాను-7:4,5*** ***బహిరంగమున అంగీకరింపబడగోరు వాడెవడును తన పని రహస్యమున జరిగింపడు. నీవు ఈ కార్యములు చేయుచున్న యెడల నిన్ను నీవే లోకమునకు కనబరచుకొనుమని చెప్పిరి. ఆయన సహోదరులైననూ ఆయనయందు విశ్వాసముంచలేదు.***

అదీ పరిస్థితి. ఏసు పుట్టీ పుట్టగానే ఎవరో జ్ఞానులు వచ్చి ఆయనను పూజించడం చూస్తే అసలు ఏసుది సాధారణ జననం కాదు అనే విషయం ఆయన తల్లిదండ్రులైన మరియకి యోసేపుకి తెలిసి ఉండాలి కదా! **ఆయనకి మతి భ్రమించిందని ఆయన ఇంటివారు భావించడం ఏంటి?** ఏసు చేశాడని వ్రాయబడిన అసాధారణ అద్భుతాలకి, ఏసుపై ప్రజల్లో, శిష్యుల్లో, కుటుంబ సభ్యుల్లో ఉన్న అభిప్రాయాలకి ఎక్కడైనా పొంతన కుదురుతుందా? నిజానికి ఏసు చెప్పిన తన రెండవ రాకడ విఫలమయినపుడే ఆయన మహిమతత్వానికి గ్రహణం పట్టినట్టు అయ్యింది కదా!

# 13. ఆదరణకర్త

ఈనాడు ముస్లింలకి, క్రైస్తవులకి మధ్య ఇదొక పెద్ద వివాదాంశంగా ఉంది. ఇస్లాం క్రైస్తవం నుంచి విడిపోవడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి.

1) క్రైస్తవులు ఏసుని దేవుడంటారు. ముస్లింలు ప్రవక్త అంటారు.

2) ఏసు మానవుల పాపముల నిమిత్తం సిలువపై మరణించాడని క్రైస్తవుల విశ్వాసం. ఏసు సిలువపై చనిపోలేదని ఆయన్ని దేవుడు కాపాడి సజీవంగా పైకి తీసుకెళ్ళాడని ముస్లింల విశ్వాసం.

3) యేసు నాతర్వాత మరో ఆదరణకర్త వస్తాడని చెప్పాడు ఆయనే మహమ్మద్ అని ముస్లింల విశ్వాసం. కాదు యేసు చెప్పింది పరిశుద్ధాత్మ గురించి అని క్రైస్తవుల నమ్మకం

ఏసు దేవుడు కాదు, ఆయన పాపుల కోసం చనిపోలేదు. ఈ రెండు విషయాలవరకైతే ఏసు మద్దతు ముస్లింలకే ఉంటుంది. నిజంగానే తనని దేవుడిగా ప్రకటించుకునే ఉద్దేశం గాని, పాపులకోసం రక్తం చిందించాలనే ఉద్దేశం గాని ఏసుకి లేనేలేవు. ఈ రెండింటికీ ఆయన పూర్తి వ్యతిరేకి. ఇక బైబిల్ ప్రకారంగా పాత నిబంధనలో క్రీస్తు గురించి చెప్పబడిన ప్రవచనాలు ఏవీ ఏసు విషయంలో నెరవేరలేదు. ఏసు రెండవరాకడ విఫలమయింది. తదితర విషయాలు కూడా బైబిల్‌లో స్పష్టంగా ఉన్నాయి. ఈ విషయంలో ముస్లింల స్పందన ఎలా ఉంటుందో చూడాలి. నేను చూసినంతవరకు ఇస్లాం ప్రసంగీకులు బైబిల్‌లో వారికి అనుకూలంగా ఉన్నంతవరకు తీసుకొని, ప్రతికూల అంశాలు ఎదురైనప్పుడు బైబిల్ మార్పులు-చేర్పులు చేయబడింది, అది ప్రామాణికం కాదు అంటూ ఉంటారు. ఇది వారి ద్వంద్వ వైఖరిని సూచిస్తుంది. ఒకప్రక్క పూర్వం వచ్చిన గ్రంథాలన్నింటిని ఖురాన్ ధృవీకరిస్తుందని చెప్తూనే, మరలా వాటి ప్రామాణికతను ప్రశ్నించడం ఈనాటి ఆధునిక ఇస్లాం ప్రసంగీకులకి అలవాటుగా మారింది. ఇలా "అవసరం ఉన్నంతవరకూ ఓడమల్లన్న, అవసరం తీరాక బోడిమల్లన్న" అన్నతీరుగా ఉంటుంది వీరి నైజం. వీరు ఇతరులకి ఋజుమార్గాన్ని చూపిస్తున్నామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉంది.

ఇపుడు మన ప్రస్తుత అంశం ఏసు చెప్పిన ఆదరణకర్త ఎవరు? అనేది. ఈ ఆదరణకర్త గురించి ఏసు ఏం చెప్పాడో బైబిల్‌ని పరిశీలిస్తే; ఏసు శిష్యులు వ్రాసిన నాలుగు సువార్తలలో ఒక్క యోహాను సువార్తలో మాత్రమే ఈ వివరాలు లభ్యమౌతాయి. మిగిలిన మూడు సువార్తలలో ఆదరణకర్త ప్రస్తావనే లేదు. ఈ ఆదరణకర్త గురించి ఏసు ఈ విధంగా చెప్పాడు.

**యోహాను-14:16** (ఏసు శిష్యులతో) నేను తండ్రిని వేడుకొందును. మీ యొద్ద ఎల్లప్పుడూ నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు. ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు. మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడా నివసించును. మీలో ఉండును.

పైవాక్యాలను బట్టి ఏసు చెప్పిన ఆదరణకర్త క్రైస్తవులు నమ్ముతున్నట్టుగా పరిశుద్ధాత్మ అనుకుందామంటే, వేరొక ఆదరణకర్తను మీకనుగ్రహించును అంటున్నాడు. అంటే ఆదరణకర్తలు ఒకరికన్నా ఎక్కువమందే ఉన్నారు. అందుకే ఏసు వేరొక ఆదరణకర్తని అంటున్నాడు.

నేను ఒక ఆదరణకర్తని. నేను కాక వేరొక ఆదరణకర్తని మీదగ్గరికి పంపిస్తాను అంటున్నాడు. కాని పరిశుద్ధాత్మ బైబిల్ ప్రకారం ఒక్కటే ఉంది. ఒకటి కన్నా ఎక్కువ పరిశుద్ధాత్మలు ఉన్నాయా? బైబిల్ భక్తులే చెప్పాలి.

**యోహాను-14:26** లో ఆదరణకర్తని పరిశుద్ధాత్మ అని ఏసు సంబోధించినట్టుగా ఉంది. కానీ...

**యోహాను-16:7 నేను మీతో సత్యము చెప్పుచున్నాను. నేను వెళ్ళిపోవుట వలన మీకు ప్రయోజనకరము. నేను వెళ్ళనియెడల ఆదరణకర్త మీ యొద్దకు రాడు. నేను వెళ్ళినయెడల ఆయనను మీయొద్దకు పంపుదును. ఆయన వచ్చి పాపమును గూర్చియూ నీతిని గూర్చియూ తీర్పును గూర్చియూ లోకమును ఒప్పుకొనజేయును.** ఈ వాక్యం ప్రకారం ఏసు వెళ్తే తప్ప ఆదరణ కర్త రాకూడదు. ఏసు వెళ్ళి ఆయనని పంపిస్తాడు. పరిశుద్ధాత్మ అయితే ఏసు ఉండగానే ఆయనమీదకి వచ్చింది కదా!

అంటే ఇక్కడ యేసు చెప్పిన ఆదరణకర్త అనే పరిశుద్ధాత్మ, యేసు బాప్తీస్మం పొందినప్పుడు ఆయన మీదకి వచ్చిన పరిశుద్ధాత్మ ఒక్కటి కాదు. వేరు వేరు అయ్యుండాలి.అంటే కనీసం రెండు పరిశుద్ధాత్మలు ఉన్నాయని అర్థమౌతుంది. అప్పుడు క్రైస్తవులు నమ్మే త్రిత్వం (దేవుడు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అనే మూడు భాగాలుగా ఉన్నాడు) అనే సిద్ధాంతానికి గ్రహణం పడుతుంది.

యేసు చెప్పిన ఈ ఆదరణకర్త గురించి మరిన్ని వివరాలు చూస్తే; లోకాన్ని ఒప్పించడంలో నేను విఫలమయ్యాను కనుక ఆయన వచ్చి లోకాన్ని ఒప్పింపజేస్తాడు అని యేసు ఆ తరువాత వాక్యంలో చెప్పాడు చూడండి. **11వ. లోకులు నాయందు విశ్వాసముంచలేదు గనుక పాపమును గూర్చియూ.... నీతిని గూర్చియూ..... తీర్పును గూర్చియూ**

ఒప్పుకొనడేయును.

ఈ లక్షణాలు కాస్తో కూస్తో పరిశుద్ధాత్మ కన్నా పౌలుకి సరిపోలుతున్నాయి. ఏసుని క్రీస్తు అని నమ్మించడంలో పౌలు చాలావరకు విజయవంతమయ్యాడు. పైగా పౌలు ఏసు వెళ్ళిపోయిన తరువాతే వచ్చాడు.

కనుక ఏసు చెప్పిన ఆదరణకర్త పరిశుద్ధాత్మ అనే కంటే పౌలు అని చెప్తే క్రైస్తవులకి చాలావరకు సమస్య పరిష్కారం అయ్యేలా కనిపిస్తుంది.

(అయితే ఇందువల్ల కొన్ని కొత్త సమస్యలు కూడా రావొచ్చు.)

లేదు పరిశుద్దాత్మే ఆదరణకర్త అంటే; అది ఏ పరిశుద్ధాత్మ? ఆ పరిశుద్ధాత్మ ఆదరణకర్తగా ఎప్పుడొస్తాడు? లేక ఇంతకముందే వచ్చేశాడా?

పోనీ ముస్లింలు చెప్తున్నట్టుగా ఆ ఆదరణకర్త మొహమ్మదే అనుకుందామంటే ఏసు రెండవ రాకడ ఆ తరం గతించకముందే ఉంటుందని చెప్పాడు. అంటే ఆదరణకర్త కూడా ఆ తరంలోనే ఏసుకంటే ముందే రావాలి కదా!

కాని మొహమ్మద్ ఏసు తరువాత 5-6 వందల సంవత్సరాలకి గాని రాలేదు. (క్రీ.శ. 570-632 మొహమ్మద్ జీవితకాలం) **కనుక యేసు మాటను బట్టి ఆ ఆదరణకర్త క్రైస్తవులు చెప్తున్న పరిశుద్ధాత్మ కాదనేది ఎంత నిజమో మొహమ్మద్ కాదనేది కూడా అంతే నిజం.** అసలు మూలమే విఫలమైనప్పుడు ఇంకా అందులోని అంతర్భాగాల గురించి తల బద్దలు కొట్టుకోనవసరం లేదు.

ఏసు రెండవరాకడకే కాలం చెల్లిపోయినప్పుడు ఇంకా ఆయన చెప్పిన ఆదరణకర్త గురించి ఆలోచించడం అవివేకము గదా.

# 14. క్రైస్తవుల దేవుడు పౌలు

క్రైస్తవులకి దేవుడు యెహోవా గాని, పరిశుద్ధాత్మ గాని, ఏసు గాని అయి ఉండాలి. పౌలు దేవుడేంటి? అని ఆశ్చర్యపోతున్నారా?

ఇక్కడ దేవుడు అనే పదాన్ని సృష్టికర్త అనే అర్థంలో కాకుండా సుపీరియర్ అనే అర్థంలో చూడాలి. ఒక ఇంట్లోగాని, వ్యవస్థలో గాని ఎవరు సుపీరియర్ అనేదానికి ప్రమాణం ఏమిటి?

ఎవరు చెప్పిన మాట ఆ ఇంట్లో లేదా వ్యవస్థలో చెల్లుబాటు అవుతుందో, ఎవరి మాట శాసనం అవుతుందో, ఎవరిమాట ముందు మిగిలిన వారి అభిప్రాయాలు ద్వితీయ ప్రమాణంగా మిగిలిపోతాయో ఆ వ్యక్తినే మనం ఆ వ్యవస్థకి సుపీరియర్‌గా భావించవచ్చు. అయినా ఏదైనా ఒక విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడే ఎవరి మాట ప్రమాణం అనే చర్చ వస్తుంది కదా! అందరూ ఏకాభిప్రాయాన్నే వ్యక్తపరిస్తే అపుడు ఈ సమస్యే రాదు.

బైబిల్‌లో ఒకే విషయంపై ప్రవక్తల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఏసు, యెహోవా మధ్య కూడా సయోధ్య లేదనే విషయాలు ఇంతకుముందు భాగాలలో సందర్భానుసారంగా ప్రస్తావించాను. వీరందరిలో **ఎవరి మాట శాసనంగా చలామణి అయింది? ఎవరిమాట వేదంలా చెల్లుబాటు అయింది?** అని పరిశీలిస్తే బైబిల్‌లో ఎవరు సుపీరియర్ అనే విషయం ఇట్టే అర్థమైపోతుంది.

పాతనిబంధనలో యెహోవా ఇశ్రాయేలీయులకి ఇచ్చిన ధర్మశాస్త్రం రద్దు చేయబడింది అని క్రైస్తవుల విశ్వాసం.

ఈ ధర్మశాస్త్రం రద్దుచేయబడింది అని యెహోవా చెప్పలేదు, ఏసూ చెప్పలేదు. ధర్మశాస్త్రం గురించి వారిద్దరూ ఏం చెప్పారో చూడండి.

**<u>హోషయ-8:12</u> (యెహోవా) నేను అతనికొరకు (ఇశ్రాయేలీయుల కొరకు) నా ధర్మశాస్త్రమును సంపూర్ణముగా వ్రాయించాను.**

ఈ వాక్యాన్ని బాగా పరిశీలించండి. యెహోవా తాను చెప్పిన ధర్మశాస్త్రం పరిపూర్ణమైనది అంటున్నాడు. అసంపూర్ణమైనది అనడం లేదు. పరిపూర్ణమైనది అంటే అందులో ఇక చెప్పవలసినవి ఏమీలేవు, అన్నీ ఉన్నాయి అని అర్థం.

**<u>కీర్తనలు-119:151</u> యెహోవా ఆజ్ఞలు సత్యమైనవి. ఆయన శాసనములు నిత్యముగా స్థిరపరచబడినవి.**

అంటే యెహోవా ఆజ్ఞలు, శాసనాలు గల ధర్మశాస్త్రం సత్యమైనది శాశ్వతమైనది అని.

శాశ్వతమైనది అంటే నాశనము లేనిది. అందులో ఇంకా ఎలాంటి మార్పులు చేర్పులు అవసరం లేదు అని అర్థం. ఈ విధంగా యెహోవా ధర్మశాస్త్రం యొక్క గొప్పతనాన్ని, ఆధిక్యతను గురించి ప్రవక్తలు ప్రస్తావించిన, యెహోవా స్వయంగా చెప్పిన సందర్భాలు పాతనిబంధనలో చాలాచోట్ల దర్శనమిస్తాయి. ఆ ధర్మశాస్త్రం రద్దుచేయిబడుతుంది, కొట్టేయబడుతుంది అని యెహోవా ఎక్కడా చెప్పలేదు. ఇది ధర్మశాస్త్రంపై బైబిల్ దేవుడు యెహోవా అభిప్రాయం. ఇక ధర్మశాస్త్రంపై ఏసు అభిప్రాయాన్ని కూడా చూడండి.

**<u>మత్తయి-5:17,18</u> ధర్మశాస్త్రమునైననూ ప్రవక్తల వచనములనైననూ కొట్టివేయవచ్చితినని తలంచవద్దు. నెరవేర్చడానికే గాని కొట్టి వేయుటకు నేను రాలేదు ఆకాశమును భూమియూ గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయూ నెరవేరువరకు దానినుండి, ఒక పొల్లయినను ఒక సున్నాయైననూ తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పచున్నాను.**

భూమి, ఆకాశం గతించిపోయినా కూడా ధర్మశాస్త్రంలో ఒక పొల్లుగాని, సున్నాగాని తప్పిపోదు అంటున్నాడు ఏసు. అంటే ఇంచుమించు యెహోవా, ఏసు కూడా ధర్మశాస్త్రంపై ఒకే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారన్నమాట.

ఇక పౌలు సంగతి చూడండి. ధర్మశాస్త్రం గురించి పౌలు అభిప్రాయం ఏమిటో ఆయన మాటల్లోనే.

**<u>హెబ్రీయులకు-7:18, 19</u> ఆ ధర్మశాస్త్రం దేనికీ సంపూర్ణసిద్ధి కలగజేయలేదు. గనుక ముందియబడిన ఆజ్ఞ బలహీనమైనందున నిష్ప్రయోజనమైనందున అది నివారణ చేయబడియున్నది.**

ధర్మశాస్త్రం నిష్ప్రయోజనమైనది అనగా దానివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదు, ఎందుకూ పనికిరానిది గనుక అది నివారణ చేయబడింది అంటున్నాడు పౌలు. ధర్మశాస్త్రంలో పొల్లు తప్పిపోవడం కంటే భూమి, ఆకాశం గతించిపోవడం తేలిక అని ఏసు చెప్పాడు. **భూమి, ఆకాశం అలాగే ఉన్నాయి మొత్తం ధర్మశాస్త్రాన్నే చెత్తకుండీలో పడేశాడు పౌలు.**

ఇపుడు క్రైస్తవులు– యెహోవాకి, ఏసుకి వీసమెత్తు విలువ కూడా ఇవ్వకుండా **వర్ధిల్లాలి పౌలు నాయకత్వం! వర్ధిల్లాలి వర్ధిల్లాలి...** అని పౌలుకే జై కొట్టారు. ఏమంటారు పౌలు భక్తులూ! చెప్పుకునేది యేసు పేరు, నడిచేది పౌలు వెంట. "చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకోవడం" అంటే ఇదే కాబోలు.

అలాగే **<u>ద్వితీ-6:25</u>లో (మోషే) యెహోవా మనకు ఆజ్ఞాపించిన ఈ సమస్తమైన ఆజ్ఞలను (ధర్మశాస్త్ర ఆజ్ఞలను) అనుసరించి నడుచుకున్నప్పుడు మనకు నీతి కలుగును** అంటాడు. కానీ పౌలు ఏమంటాడంటే **<u>గలతీయులకు-2:16</u>లో ధర్మశాస్త్ర సంబంధ క్రియల వలన**

**ఏ శరీరియూ నీతిమంతుడని తీర్చబడడు అంటాడు.**

మోషే బ్రతికున్నట్లయితే పౌలుని రాళ్ళతో కొట్టి చంపించేవాడు. ధర్మశాస్త్రంలో ఒక చిన్న ఆజ్ఞ మీరి విశ్రాంతిదినం రోజు అడవిలో పుల్లలు ఏరినందుకే ఒకణ్ణి రాళ్ళతో కొట్టి చంపించాడు మోషే.(సంఖ్య-15:33)

**అలాంటిది ధర్మశాస్త్రంలోని అన్ని ఆజ్ఞలని పక్కకు తోసేస్తున్న పౌలుని మోషే బ్రతికున్నట్లయితే ఎంత భయంకరంగా చంపించేవాడో ఊహించుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.**

ఇక పాపక్షమాపణ ఎలా కలుగుతుంది? అనే విషయంలో కూడా పౌలు- యెహోవాని, ఏసుని ఖాతరు చేయలేదు.

**లేవీయకాండం 4వ అధ్యాయంలో మనుషులు చేసిన పాపాలకి జంతువుల్ని బలి ఇస్తే పాపక్షమాపణ కలుగుతుంది అని యెహోవా స్పష్టం చేశాడు.** కాకపోతే వేరువేరు హోదా కలిగిన వ్యక్తులకు అనగా ఇశ్రాయేలీయుల్లో అధికారులు పాపంచేస్తే ఒక రకమైన జంతువుని బలి ఇవ్వాలి, యాజకులు పాపం చేస్తే వారు వేరే జంతువును బలి ఇవ్వాలి, సాధారణ పౌరులు పాపం చేస్తే ఇంకో జంతువుని బలి ఇవ్వాలి. ఇలా రకరకాలైన బలి విధానాలని నిర్ధేశించినా మొత్తమ్మీద **జంతువుల బలి ద్వారా పాప క్షమాపణ కలుగుతుంది అనే విషయమైతే నిర్ద్వందంగా చెప్పాడు.**

యెహోవా ఈ జంతుబలుల గురించి చెప్తూ **యెహెజ్కేలు 46:13,14 మరియూ ప్రతిదినము నిర్దోషమైన ఏడాది మగ గొర్రెపిల్లలను దహనబలిగా అర్పింపవలెను..... ఇవి ఎవరునూ రద్దుపరచలేని నిత్యమైన కట్టడలు.** అని చెప్పాడు.

పై వాక్యంలో యెహోవా ఇవి ఎవరూ రద్దుపరచలేని నిత్యమైన కట్టడలు అన్నాడు గాని, పౌలు తప్ప ఎవరూ రద్దుపరచలేరు అనలేదు. అయినా పౌలు వాటిని రద్దుపరిచాడు. అదీ పౌలు స్టామినా.

ఏసు ఈ జంతుబలుల్ని సమర్ధించినట్టుగా గాని, వ్యతిరేకించినట్టుగా గాని స్పష్టమైన ఆధారాలు లేనప్పటికి పాపక్షమాపణ కోసం మారుమనసు పొంది తనను ప్రవక్తగా విశ్వసించాలి అని చెప్పాడు.

పౌలు మాత్రం యథావిధిగా **హెబ్రీయులకు-10:4 లో ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపమును తీసి వేయుట అసాధ్యము** అంటాడు.

పౌలు చెప్పిన కొన్ని వాక్యాలు చదువుతుంటే అతడు, బైబిల్ దేవుడు యెహోవాపై పగతో గాని రగిలిపోవడం లేదు కదా! 'అనిపిస్తుంది. బైబిల్ దేవుడి ప్రధానమైన ఆజ్ఞలన్నింటినీ పౌలు ఖండించేశాడు.

సున్నతి పాటించకపోతే చంపేస్తా అని యెహోవా చెప్పిన నియమానికి కూడా

పౌలు నీళ్ళొదిలాడు. సున్నతి పొందకపోయినా ఏం పర్వాలేదులే అంటాడతడు. ఈ ఆజ్ఞని ముస్లింలు మాత్రం ఈనాటికీ కచ్చితంగా పాటిస్తున్నారు.

నా ఆజ్ఞలని అతిక్రమిస్తే మీకు కుష్టు వ్యాధి రప్పిస్తా, మీ పీనుగుల్ని మీ బొమ్మల పీనుగులపై పడేయిస్తా, మీ పిల్లల మాంసం మీతో తినిపిస్తా, మీ భార్యలని పరాయివాళ్ళకి అప్పగిస్తా, మీ అంతు చూస్తా అని ఎన్ని రకాలుగా బెదిరించినా క్రైస్తవులు బైబిల్ దేవుడిని కూరలో కరివేపాకులా తీసివేశారు ఎందుకనో.

పోనీ ఏసు మాటకైనా విలువ ఇచ్చారా అంటే అదీలేదు. పౌలు ముందు ఏసు కూడా దిగదుడుపే అని ధర్మశాస్త్ర విషయంలో చూశాం.

నా రక్తం వలన పాపక్షమాపణ అని ఏసు ఎక్కడా చెప్పకపోయినా, పౌలు మాత్రం **<u>ఎఫెసీయులకు-1:7</u>లో ఏసు రక్తం వలన మనకి పాపక్షమాపణ కలిగియున్నది అంటాడు.**

రక్తప్రోక్షణం, పాపక్షమాపణ యెహోవాది ఒక రకం కాగా పౌలుది మరో రకం.

**<u>మత్తయి-7:21</u>లో <u>ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడు పరలోక రాజ్యములో ప్రవేశింపడు</u>** అని ఏసు అంటే

**<u>రోమా-10:9 లో</u> ఏసుని ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసిస్తే రక్షించబడతావు** అని పౌలు అంటాడు.

ఇవి మాత్రమే కాక ఏసు దేవుడు అని చెప్పడానికి క్రైస్తవులు ఉపయోగించే వాక్యాలు కూడా ప్రధానంగా పౌలు రాసిన పత్రికల్లోనుంచే తీసుకుంటారు. ఏసు ఎక్కడా నేను దేవుణ్ణని చెప్పుకోలేదు.

**<u>మార్కు-12:32</u> ఆ శాస్త్రి బోధకుడా బాగుగా చెప్పితివి. ఆయన అద్వితీయుడనియూ ఆయన తప్ప వేరొకడు లేడనియూ నీవు చెప్పిన మాట సత్యమే.**

అద్వితీయుడు అంటే తనలాంటి మరొకడు లేనివాడు. "ఆరాధింపదగిన వాడు ఒక్కడే ఆయనే నా తండ్రి" ఇది ఏసు సిద్ధాంతం. **ఇదే ఏసు సిద్ధాంతం.**

పౌలు, ఏసు శిష్యులు కలిసి అద్వితీయుడు అంటే తనలాంటి రెండవవాడు లేనివాడు కనుక ముగ్గురిని చేద్దాం అని చెప్పి **తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ** అనే సిద్ధాంతం తీసుకొచ్చినట్లున్నారు. క్రైస్తవంలో ఇప్పుడు చలామణిలో ఉన్న ఒక శాఖ 'త్రిత్వం' అనే భావనకి ఒక నిర్దిష్టమైన రూపం ఇచ్చింది ఎవరో చెప్పడం కొంచెం కష్టమైనా, అందుకు బీజాలు మాత్రం పౌలు, ఏసు శిష్యుల దగ్గరే పడ్డాయి. తదనంతర కాలంలో ఏ మహానుభావుడో, బైబిల్‌లో దేవుడు ముగ్గురుగా ఉన్నాడు అనే ఏసు, యెహోవాలకి విరుద్ధమైన భావనని వ్యాప్తిలోకి తెచ్చినట్లున్నాడు.

ఇలా యెహోవాతోనూ, ఏసుతోనూ అన్ని విషయాలలో విభేదించిన పౌలు ఒక్క విషయంలో

మాత్రం ఏసుని అనుసరించాడు. అదే ఏసు రెండవరాకడ ఆ తరం గతించక మునుపే రావాలి. పౌలు ఏసుని సమర్ధించిన ఈ ఒక్క విషయం క్రైస్తవానికి శాపంగా మారేలా ఉంది. పౌలు ఏసుతో విబేధిస్తేనే క్రైస్తవానికి కలిసివస్తుందేమో.

విచిత్రం ఏంటంటే ఏసు, పౌలు ఏకాభిప్రాయం కనబరిచిన రెండవరాకడ విషయంలో క్రైస్తవులు వారిద్దరితో విభేదిస్తారు. ఏసు రెండవ రాకడ ఆ తరం గతించక మునుపే జరగాలి అనే విషయాన్ని క్రైస్తవులు ఒప్పుకోరు. పౌలు, యెహోవా ఏసుతో భేదాభిప్రాయాలు కలిగి ఉన్న మిగిలిన అన్ని విషయాలలో మాత్రం తండ్రి, కుమారులిద్దరికీ తిలోదకాలిచ్చి పౌలుకే జిందాబాద్ కొట్టారు క్రైస్తవులు.

కనుక వీళ్ళు నిజానికి పౌలీయులు అవుతారు కాని క్రైస్తవులు అవ్వరు. అందుకే ఉపోద్ఘాతంలో "క్రైస్తవులు అనబడినవారు" చాలామంది రోజూ బైబిల్ చదువుతున్నారు అని చెప్పాల్సివచ్చింది.

ఇంతకీ పౌలు ఎవరు

<u>అ.పొ.కా.-21:39</u> నేను కిలికియలోని తార్సువాడనైన యూదుడను.

<u>రోమా-11:1</u> నేను ఇశ్రాయేలీయుడను, అబ్రాహాము సంతానమందలి బెన్యామీను గోత్రమునందు పుట్టినవాడను.

<u>అ.పొ.కా.-22:28</u> అందుకు పౌలు- నేనైతే పుట్టుకతోనే రోమీయుడనైనని.

పై మూడు సందర్భాలలోనూ మాట్లాడుతున్నది పౌలే. ఇందులో పౌలు యూదుడా? బెన్యామీయుడా? రోమీయుడా? అనేది ఆ పరిశుద్ధాత్మకైనా తెలుసో లేదో గాని, క్రైస్తవులు మాత్రం యథావిధిగా బైబిల్ ఆత్మసంబంధమైనది, అది అందరికీ అర్థం కాదు అనేసి జారుకుంటారు.

# 15. ఎవరు తీసిన గోతిలో వారే పడతారు

ఏసు రెండవ రాకడలో మనుషులందరికీ తీర్పు ఉంటుంది. ఆ తీర్పులో ఏసు మానవులందరి పాపక్షమాపణ నిమిత్తం రక్తం చిందించి, మరణించి, పునరుత్థానుడయ్యాడని నమ్మినవారు స్వర్గానికి పోతారు నమ్మనివారు నరకానికి పోతారు. ఇది క్రైస్తవుల విశ్వాసం.

ఈ సిద్ధాంతాన్ని పెట్టింది బైబిల్ దేవుడు యెహోవా కాదు, ఏసూ కాదు. ఏసు శిష్యులు, పౌలు. ఏసు దృష్టిలో నిత్యజీవం పొందాలంటే ఏమి చేయాలి? అనే విషయాన్ని ఇంతకుముందు భాగాలలో సవివరంగా వివరించాము. అందులో ఆయన సిలువ మరణ, పునరుత్థానాలని నమ్మాలి అని ఎక్కడా చెప్పలేదు గమనించండి. ఆయన ఆలోచన వేరు.

ఇక యెహోవాకి అసలు నిత్యజీవం అంటే తెలుసో లేదో కూడా సందేహమే. ఎందుకంటే అయన వాటి గురించి చెప్పనేలేదు. **గమ్మత్తైన విషయం ఏమిటంటే ఏసు శిష్యులు, పౌలు పెట్టిన ఈ సిద్ధాంతం ప్రకారం అందరికన్నా ముందుగా వారే నరకానికి పోతారు.**

అదేంటి? అని ఆశ్చర్యపోతున్నారా? ఇది నిజంగా నిజం. ఎలాగంటారా? మీరే చూడండి.ఏసు మరణించి తిరిగి లేచాడనే విషయం నమ్మకపోతే నరకం అంటున్నారు. మీరు బైబిల్ మొత్తం చదువుకోండి. పౌలు గాని, ఏసు శిష్యులు గాని ఒక్కరు కూడా ఏసు మరణించి తిరిగి లేచాడంటే ఒక పట్టాన నమ్మలేదు. ఆయన పునరుత్థానుడయ్యాడని మగ్ధలేని మరియ లాంటి వాళ్ళు వచ్చి చెప్పినా కూడా ఏసు శిష్యులు నమ్మలేదు. వాళ్ళకి పిచ్చిపట్టిందనుకున్నారు. -(మార్కు-16:9-13) మరి ఏసు శిష్యులు ఎప్పుడు నమ్మారో తెలుసా? ఏసు **వారికి ప్రత్యక్షమై స్వయంగా కనపడితే గాని నమ్మలేదు. ఏసు వారికి కనపడి తాను సజీవంగా ఉన్నాననే విషయం నమ్మనందుకు వారిని తిడతాడు కూడా.** - (మార్కు - 16:14)

ఏసు అంతకముందు శిష్యులతో నన్ను యెరూషలేములో కొట్టి చంపుతారు. మూడవ రోజున తిరిగిలేస్తాను అని చెప్పినట్టుగా బైబిల్‌లో పలుచోట్ల కనపడుతుంది.

సుమారు మూడు సంవత్సరాలు ఏసుతో పాటు కలిసి తిరిగి, ఆయన బోధనలు ప్రత్యక్షంగా విని, ఆయన మహిమలను ప్రత్యక్షంగా చూసిన శిష్యులే ఆయన పునరుత్థానాన్ని నమ్మకపోతే, ఇక ఏసుతో ఏ సంబంధం లేని ఇతర దేశాల ప్రజలు వందల సంవత్సరాలు గడిచిపోయిన తరవాత తమ సంస్కృతుల్ని-ధర్మాన్ని వదిలేసి, వారు చెప్పింది గ్రుడ్డిగా నమ్మాలా? లేకపోతే నరకంలో వేసి కాలుస్తారా? అయితే

ఆనాడు ఏసు తన శిష్యులకి కనపడి నమ్మించినట్టుగానే ప్రపంచ ప్రజలందరికీ కనపడి నమ్మించవచ్చుగా? **ఏసు శిష్యులలో ఒకడైన తోమా నేను ఏసు గాయాల్లో నా వ్రేళ్ళు పెట్టి చూస్తేగాని నమ్మనే నమ్మనంటాడు. ఏసు అలాగే అతనికి చేసి చూపిస్తాడు కూడా. (యోహాను-20:24-27)**

సాధారణ ప్రజలు అంత అవిశ్వాసులు కాదులే. ఏసు గాయాల్లో వ్రేళ్ళు పెట్టి పరీక్షలు చేయరు. కనపడితే చాలు నమ్ముతారు. అలాకాదు ఆయన కనపడడు అయినా సరే నమ్మాల్సిందే! లేకపోతే నరకమే గతి అంటారా. అప్పుడు ఏసు కనపడితే తప్ప నమ్మని ఏసు శిష్యుల్ని కూడా నరకంలో వేయాలి. సాధారణ ప్రజల కంటే వారికి వంద రెట్లు శిక్ష ఎక్కువ పడాలి కూడా.

ఇక పౌలు సంగతి సరేసరి. పౌలు కూడా ముందు ఏసు పునరుత్థానాన్ని నమ్మలేదనే బైబిల్‌లో ఉంది. నమ్మకపోగా క్రైస్తవుల్ని వేదించి చంపించేవాడు. ఒకరోజు అకస్మాత్తుగా వెలుగు రూపంలో ఏసు దర్శనం అయ్యి పౌలు క్రైస్తవుడిగా మారిపోయాడు. అంటే ఏసు శిష్యులది, పౌలుది ఒకటే బడి. కనపడితే గాని నమ్మరన్నమాట.

**కనుక ఏసుకి విరుద్ధంగా ఏసు శిష్యులు, పౌలు పెట్టిన ఈ సిద్ధాంతం ప్రకారం అందరికన్నా ముందుగా వారే నరకానికి పోతారు.**

క్రైస్తవ ప్రచారకులు ఒక విషయం చెప్తారు. ఏసు పునరుత్థానాన్ని శిష్యులు ముందు నమ్మకపోయినా, ఆ తరువాత క్రైస్తవాన్ని తమ ప్రాణాలకు తెగించి ప్రచారం చేశారు. కొంతమంది ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. అది ఏసుపై వారికున్న నిబద్ధత అని.

మత సిద్ధాంతాలను కాపాడుకోవడానికి ప్రాణాలకు తెగించి పోరాడింది ఏసు శిష్యులు మాత్రమే కాదు. యూదులు కూడా క్రైస్తవం వల్ల తమ మతానికి ఎదురవుతున్న ప్రమాదాన్ని ప్రాణాలకు తెగించి ఎదుర్కొన్నారు. ఎవరి సిద్ధాంతాల, సాంప్రదాయాల రక్షణ కోసం వారు పోరాడారు. అన్ని మతవిశ్వాసాల వారిలోనూ ఈ వైఖరి కనబడుతుంది.

**ఏసు ఎప్పుడైనా నన్ను దేవుణ్ణి చేసి ఆరాధించండి అని చెప్పాడా? లేదే.** అద్వితీయుడైన తండ్రిని మాత్రమే ఆరాధించమని చెప్పాడు. యూదా మతానికి, ఏసుకి విరుద్ధంగా క్రైస్తవ మతాన్ని స్థాపించి, ఏసుని కూడా దేవుణ్ణి చేయడానికి ప్రయత్నించి, మతకల్లోలాలకి కారణమైంది పౌలు మరియూ ఏసు శిష్యులే కదా!

ఆ తరవాత క్రైస్తవాన్ని కాదంటూ ఇస్లాం పుట్టుకొచ్చింది. అక్కడినుండి యూదా, క్రైస్తవ, ఇస్లాం మతాల మధ్య జరిగిన మత ఘర్షణలకి, మారణహోమాలకి కోట్లమంది

బలయ్యారు. లెక్కలేనంతమంది అమాయకులు అసువులు బాశారు.
దీనికి మూలకారణం ఎవరు? యూదా మతం నుంచి క్రైస్తవం అనే కొత్త మతాన్ని సృష్టించి, పెంచి పోషించిన ఏసు శిష్యులు, పౌలు కాదా?
అ.పొ.-5:1-10 లో తమ ఆస్తి మొత్తం ఇవ్వలేదని అననీయ, సప్పీరా అనే భార్యాభర్తలు పేతురు శాపానికి గురై చనిపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? పరిశుద్ధాత్మ ప్రేరణగానా?

## విశ్వాసుల్ని గుర్తించడం ఎలా?

విశ్వాసుల్ని పరీక్షించే విధానం గురించి బైబిల్‌లో ఏసు చెప్పినట్లుగా ఉన్న ఒక సందర్భాన్ని చూద్దాం.
**మార్కు-16:17,18 (సువార్త)నమ్మినవారి వలన ఈ సూచకక్రియ కనబడును. ఏవనగా, నా నామమున దయ్యములను వెళ్లగొట్టుదురు, క్రొత్త భాషలు మాటలాడుదురు, పాములను ఎత్తి పట్టుకుందురు, మరణకరమైనదేది త్రాగినను అది వారికి హాని చేయదు, రోగుల మీద చేతులుంచినప్పుడు వారు స్వస్థతనొందుదురని వారితో చెప్పెను.**
ఈ విధానంలో పరీక్ష చేస్తే ఈరోజు ఉన్న క్రైస్తవులలో ఎంతమంది విశ్వాసులు మిగులుతారు? అతి తెలివిగల కొందరు మేధావులు ఇందులో దయ్యాలని వెళ్ళగొట్టడం, రోగులని స్వస్థపరచడం వరకు తీసుకొని, ఏసుపై ఉన్న విశ్వాసంతో తమకీ అద్భుత శక్తులు సంక్రమించాయన్నట్లుగా అమాయక ప్రజల తలపై భస్మాసురుడిలా చేతులు పెడుతున్నారు. ఇంకొందరైతే జూనియర్ ఆర్టిస్ట్‌లతో ఫీట్‌లు చేయిస్తూ ఏసు నామంలో సర్కస్ కంపెనీలు కూడా నడుపుతున్నారు. వీళ్ళకి నిజంగా అద్భుత శక్తులే ఉంటే మిగిలిన ప్రవచనాలని కూడా వీరు ఋజువు చేయాలి కదా! కనుక ఎవరైనా ఏసు నామంలో రోగుల మీద చేతులుంచి స్వస్థపరుస్తాం అనేవారుంటే ముందుగా వారు పాముల్ని ఎత్తిపట్టుకొని, మరణకరమైనది త్రాగి చూపించాలి. పోనీ ఫారిన్ నుండి వచ్చే విశ్వాసులతో వారికి అనువాదకుల్ని పెట్టకుండా తెలుగులో మాట్లాడించండి. లేదా మీరైనా మేమడిగిన క్రొత్త భాషలు మాట్లాడి చూపించండి.

# 16. అదిగో దెయ్యం నాకేం భయం

బైబిల్ పాఠకులు, క్రైస్తవులు అంత పరిశీలనగా పట్టి చూడని ఒక విషయం : "బైబిల్ పాతనిబంధనలో ఎక్కడా దయ్యాల ప్రస్తావన లేదు."

**అకస్మాత్తుగా క్రొత్తనిబంధనలో ఈ దయ్యాలు ఎక్కడినుంచి ఊడిపడ్డాయి?**

పైగా ఈ దయ్యాలలో రకరకాల కేటగిరీలు ఉన్నాయి.

**మూగ దయ్యాలు, గుడ్డి దయ్యాలు, కుంటి దయ్యాలు.**

క్రొత్త నిబంధనలోకి ఈ దయ్యాలు ఎక్కడినుంచి వచ్చాయని క్రైస్తవ బోధకులని అడిగితే; వారు "దేవుణ్ణి ఎదురించిన లూసిఫర్ తన సైన్యంతో సహా పడద్రోయబడ్డాడు. అతని సైన్యమే ఈ దయ్యాలు" అని చెప్పేవారున్నారు.

కాని ఈ లూసిఫర్ కథ బైబిల్లో ఎక్కడా కనపడదు. ఏసుని మహిమాన్వితుడిగా చూపించే క్రమంలో ఈ దయ్యాల్ని పక్కింటి సాహిత్యం నుంచి అరువు తెచ్చుకొని ఉండొచ్చు.

**<u>లూకా-13:11</u>లో దయ్యం అనగా ఫుట్‌నోట్‌లో మూలభాషలో ఆత్మ అని ఇచ్చారు.**

**<u>మత్తయి-8:28, లూకా-8:27</u> లలో దయ్యాలు పట్టినవారు సమాధులలో ఉంటూ అక్కడే తిరుగుతున్నారని రాశారు. అంటే దయ్యాలని చనిపోయిన మనుష్యుల ఆత్మలు గానే వారు భావించారు. లూసీఫర్ అతని సైన్యం గురించి క్రైస్తవ ప్రచారకులకి తెలిసినంతగా ఏసు శిష్యులకి తెలిసి ఉండకపోవచ్చు.**

మళ్ళీ ఇక్కడ ఒక సందేహం వస్తుంది. దయ్యం అంటే చనిపోయిన వారి ఆత్మలు అనుకుంటే క్రైస్తవం ప్రకారం చనిపోయిన వారు సమాధులలోనే ఏసు రెండవ రాకడ వరకు వేచి ఉండాలి కదా! మధ్యలో లేచి బైటకి వచ్చి, ఇలా విహారయాత్రలు చేయడానికి అనుమతి ఎవరిచ్చారు?

ఈ దయ్యాల గురించి ఇంకో కోణంలో చూస్తే **<u>మార్కు-9:17,18</u> బోధకుడా *మూగ దయ్యం పట్టిన నా కుమారుని నీ యొద్దకు తీసుకొని వచ్చితిని. అది ఎక్కడ వానిని పట్టునో అక్కడ వానిని పడద్రోయును. అపుడు వాడు నురగ కార్చుకుని పండ్లు కొరుక్కొని మూర్ఛిల్లును. దానిని వెళ్ళగొట్టుడని నీ శిష్యులను అడిగితిని గాని అది వారిచేత కాలేదని ఆయనతో చెప్పెను.*

ఈ వాక్యంద్వారా ఏం అర్ధమౌతుంది? ఆ పిల్లాడికి మూర్ఛరోగం ఉందని అర్ధమౌతుంది. దానిని దయ్యంగా చెప్తున్నాడు ఆ పిల్లాడి తండ్రి. అంటే అనారోగ్యం పాలైన వారందరికీ దయ్యాలు పట్టినట్టుగా భావించడం జరుతుండేదేమో ఏసు కాలంలో.

అదలా ఉంచితే, ఈ దయ్యాల గురించి ఇంకో గమ్మత్తయిన విషయం ఏమిటంటే;

బైబిల్ ప్రకారంగా బైబిల్‌లో దయ్యాలన్నీ నిత్యజీవాన్ని పొంది స్వర్గానికి వెళతాయి. అదెలాగా అనుకుంటున్నారా?

ఏసుని క్రీస్తు అని విశ్వసించడమే నిత్యజీవం.

**అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును నీవు పంపిన ఏసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము** - (యోహాను-17:3) అని ఏసు అంటాడు.

బైబిల్‌లో ఏసుని క్రీస్తు అని నిస్సంశయంగా విశ్వసించినవారు ఒక్కరు కూడా లేరు ఏసు శిష్యులతో సహా. ఏదోఒక సమయంలో అందరూ ఆయనపై సందేహాన్ని, అపనమ్మకాన్ని వెలిబుచ్చినవారే. గొప్ప ప్రవక్తగా చెప్పబడ్డ యోహాను కూడా ఒక సమయంలో **రాబోవువాడవు నీవేనా? మేము మరియొకని కొరకు కనిపెట్టవలెనా?** అని ఏసుని అడిగి రమ్మని తన శిష్యులని పంపిస్తాడు. ఏసు చివరి సమయంలో శిష్యులందరూ ఆయనను విడిచి పారిపోతారు కూడా. అంటే ఆయన దేవుని కుమారుడైన క్రీస్తు కాదేమో అని వీరందరికీ ఏదోఒక మూల అనుమానం ఉందని అర్థమౌతోంది.

**కాని ఎలాంటి అనుమానాలకి తావివ్వకుండా, రెండవ ఆలోచన లేకుండా ఏసుని క్రీస్తు అని నమ్మింది మాత్రం బైబిల్‌లో ఉన్న దెయ్యాలే.** ఈ దెయ్యాలు ఏసుని చూడటమే ఆలస్యం "దేవుని కుమారుడైన క్రీస్తు" అని ఆయన్ని గుర్తించి ఆయనముందు సాగిలపడినట్లుగా బైబిల్‌లో అనేక సందర్భాలు గమనించవచ్చు. -(మత్తయి-8:29, మార్కు-5:7)

**కనుక ఏసుని క్రీస్తుగా విశ్వసించడమే నిత్యజీవం అని చెప్పిన ఏసు మాట ప్రకారం ఆయన్ని క్రీస్తుగా గుర్తించిన దెయ్యాలన్నీ నిత్యజీవానికి అర్హతపొందాయని చెప్పడంలో తప్పేముంది?**

# 17. ప్రశ్నలు సమాధానాలు

ఎ) బైబిల్‌లో యేసు దేవుడిగా ఉన్నాడా?

ఈ ప్రశ్నకి ఒకేఒక్క వాక్యంలో సరైన సమాధానం చెప్పాలంటే **"ఏసుని దేవుడు అన్నవారందరూ బైబిల్ ప్రకారంగా నిత్యనరకమైన అగ్నిగుండంలో పడద్రోయబడతారు."** ఆశ్చర్యంగా ఉంది కదూ! కానీ ఇది నిజం. ఇప్పుడు కొద్దిగా ఆ వివరణను పరిశీలిద్దాం. బైబిల్ మొత్తంలో బైబిల్ దేవుడైన యెహోవా తన సొంత ప్రజలుగా ఎంచుకున్న ఇశ్రాయేలీయులని అనేకమార్లు క్రూరాతిక్రూరంగా, చిత్రాతిచిత్రంగా శిక్షించడానికి గల ఒకేఒక్క కారణం- వారు యెహోవాని కాక వేరే దేవతలని పూజించారని.

యెహోవా బైబిల్ పాత నిబంధన అంతా మొత్తుకుంటూనే ఉంటాడు. **"నేనొక్కడినే దేవుడిని, నేను కాక వేరొక దేవుడు లేడు, మీరు నన్ను మాత్రమే పూజించాలి. నన్ను కాక వేరొకరిని మీ దేవుడిగా చేసుకుంటే మీపై నా ఉగ్రత రగులుకుంటుంది. మిమ్మల్ని అన్ని విధాలుగా నాశనం చేస్తా, మీకు తెగుళ్ళు, వ్యాధులు రప్పిస్తా"** అని ఎన్నో రకాలుగా భయపెడతాడు. అంటే బైబిల్ దేవుడైన యెహోవా ప్రకారం ఆయనని కాక ఇంకెవరినైనా దేవుడు అంటే వారు దైవద్రోహులు, ఘోర పాపాత్ములుగా తీర్పు తీర్చబడతారు.

**కనుక ఏసుని దేవుడు అన్న వారందరూ బైబిల్ దేవుడు యెహోవాకి శత్రువులే.** ఇక ఏసు ఉద్దేశ్యంలో కూడా దేవుడు ఒక్కడే. ఆయన పరలోకమందున్నాడు. ఆరాధింపదగినవాడు ఆయనొక్కడే. అందుకే అద్వితీయుడైన తండ్రి అని సంబోధిస్తాడు. అద్వితీయుడు అంటే తనలాంటి రెండవవాడు లేనివాడు అని కదా అర్థం. ఏసు స్వయంగా పలికిన మాటలలో ఎక్కడా కూడా తనని దేవుడిగా ప్రకటించుకునే ఆలోచన ఏ కోశానా ఉన్నట్లుగా కనిపించదు. ఏసు ఎక్కడైనా తాను దేవుణ్ణని చెప్పుకున్నాడా? అని క్రైస్తవ బోధకులని ప్రశ్నిస్తే వారు బైబిల్ మొత్తం భూతద్దంతో వెతికి ఒక్క వాక్యాన్ని తీసుకొస్తారు. అదికూడా ఏసు స్వయంగా చెప్పింది కాదు. ఆ వాక్యమేమిటో దాని పూర్వాపరాలేమిటో ఒకసారి మనమూ చూద్దాం.

**<u>యోహాను-10:33</u> అందుకు యూదులు నీవు మనుష్యుడవై యుండి దేవుడనని చెప్పుకొనుచున్నావు గనుక దేవదూషణ చేసినందుకే నిన్ను రాళ్ళతో కొట్టుదుము గాని మంచి క్రియ చేసినందుకు కాదని ఆయనతో చెప్పిరి.**

పై వాక్యంలో యూదులు చెప్పినదాన్ని బట్టి ఏసు తనని తాను దేవుడిగా ప్రకటించుకున్నాడు అంటారు బోధకులు. కాని ఆ వాక్యంలో ఏసు తనని దేవుడిగా ప్రకటించుకున్నాడని 'యూదులు భావించినట్లుగా' ఉంది తప్ప అసలు ఏసు ఏమన్నాడో లేదు.

యూదులు, ఏసు ఆ సందర్భంలో చెప్పిన వాక్యం అర్థంకాక ఇలా పొరపాటుగా భావించినట్లుగా పరిశీలనగా బైబిల్ చదివినవారికి ఇట్టే తెలిసిపోతుంది. అదెలాగంటే... ఏసే ప్రకటించిన నిర్దిష్టమైన అనేక అభిప్రాయాలు ఆయనని దేవుడనటానికి విరుద్ధంగా ఉన్నాయి. ఇందుకు సంబంధించిన అనేక ఆధారాలు ఈ పుస్తకంలోనే వివిధ సందర్భాలలో చెప్తూ వచ్చాను. ఇక ఈ వాక్యంలో యూదుల భావనని ప్రామాణికంగా తీసుకొని ఏసుని దేవుడనాలి అంటే **యూదులు అనేకసార్లు ఏసుని సాతాను ప్రతినిధిగా, దుష్టశక్తి సంబంధిగా, అబద్ధపు బోధకుడిగా కూడా భావించారు.** అంటే ఇప్పుడు వారి భావనలని ప్రామాణికంగా తీసుకుంటే ఏసు ఏమౌతాడు? ఆ వాక్యంలోనే వెంటనే ఏసుని నీవు దేవుడనని చెప్పుకున్నందుకు నిన్ను రాళ్ళతో కొట్టి చంపుతాం అని కూడా అంటున్నారు. అంటే వారి ధర్మశాస్త్రం ప్రకారం యెహోవాని కాక వేరొకరిని దేవుడంటే వారిని రాళ్ళతో కొట్టి చంపాలి అనే కఠినమైన నియమం ఉందని తెలిసిపోతుంది.

అసలింతకూ ఆ సందర్భంలో ఏసు దేవుడనని ప్రకటించుకున్నట్లుగా యూదులు భావించడానికి గల కారణం ఆ పై వాక్యంలో **నేనునూ తండ్రియునూ ఏకమై ఉన్నామని** ఏసు వారితో చెప్పడమే. నేనూ తండ్రి ఏకమై ఉన్నామంటే మా ఆలోచనలు ఏకంగా ఉన్నాయని ఏసు ఉద్దేశ్యం తప్ప, ఆయనా నేను ఒక్కటేనని కాదు. అలాకాకుండా ఏకమై ఉండటమంటే మేమిరువురమూ సమానులమే అనే అర్థంలో చెప్పాడనుకుంటే...

***<u>యోహాను-17:21</u> తండ్రీ నాయందు నీవునూ నీయందు నేనునూ ఉన్నలాగున వారునూ (ఏసు శిష్యులు) మనయందు ఏకమైయుండవలెనని...***

అంటే తన శిష్యులని కూడా తమతో ఏకమైయుండవలెనని అనే పదం వాడాడు కనుక తండ్రితోపాటు ఏసు, వారిరువురితో పాటు శిష్యులు కూడా సమానులే. కనుక వారుకూడా దేవుళ్ళే అందామా? కించిత్ ఇంగితజ్ఞానమూ, ఏ మాత్రం భాషా పరిజ్ఞానం ఉన్నా ఈ వాక్యానికి ఆ అర్థం రావడం లేదని అర్థమౌతుంది.

**ఏసుని దేవుడిగా చూపించడానికి బైబిల్ మొత్తంలో ఏసు నేను దేవుణ్ణని స్వయంగా చెప్పిన వాక్యం ఒక్కటి కూడా దొరకక యూదులు చెప్పిన వాక్యాన్ని పట్టుకొచ్చినప్పుడే వారి వాదన ఎంత బలహీనమైనదో తెలిసిపోవడం లేదూ!**

## బి) బైబిల్ ప్రకారంగా యేసు పరిశుద్ధుడా ?

క్రైస్తవ ప్రచారకుల ప్రధాన ప్రచారాస్త్రం- "ఈ లోకంలో యేసు ఒక్కడే పరిశుద్ధుడు, అయన తప్ప ఇంకో పరిశుద్ధుడు లేడు అందరూ పాపం చేసిన వాళ్ళే" అని.

యేసు ఏవిధంగా అంత పరిశుద్ధుడు అయ్యాడు? అని వారిని అడిగినట్లయితే, వారు చెప్పే సమాధానం ఏసు పాపంతో సంబంధం లేకుండా పుట్టాడు, పాపం చేయకుండా బ్రతికాడు అంటారు. **అంటే వాళ్ళ ఉద్దేశ్యంలో పాపం అంటే స్త్రీ పురుషుల కలయికతో సంబంధం లేకుండా పరిశుద్ధంగా కన్యకి పుట్టాడు. పాపం లేకుండా జీవించడం అంటే స్త్రీ తో కలవకుండా బ్రతికాడు అని.**

అంటే సృష్టికి మూలాధారమైన స్త్రీ, పురుష, కలయిక ఘోరపాపం అని వారి ఉద్దేశ్యం. చాలామంది అమాయక హిందువులను మాతం మార్చడానికి వీరు ఉపయోగిస్తున్న అస్త్రం ఇదే "మీ దేవుళ్ళందరూ పెళ్ళిళ్ళు చేసుకుని పాపం చేశారు మా దేవుడొక్కడే పెళ్ళి చేసుకోకుండా పాపం లేకుండా పరిశుద్ధంగా జీవించాడు" అని. హిందూ ధర్మంలో భార్యస్థానంలో ఉండే రూపానికి అర్థం చర్చించడం ఇక్కడ సాధ్యంకాదు. కనుక ఆవిషయాన్ని అలా ఉంచితే, **బైబిల్ లో మొదటనుంచి పురుషాధిక్య భావజాలం, స్త్రీపై వివక్ష కొనసాగుతూవస్తుంది.**

మా మొదటి పుస్తకం **'బైబిల్ దేవుని నిజ స్వరూప స్వభావాలు'** లో బైబిల్‌లో ఉన్న స్త్రీ వివక్ష గురించి ఒక అధ్యాయంలో వివరించాము. అయితే కొంతమంది క్రైస్తవ బోధకులు అది పాత నిబంధన అది కొట్టేయబడింది, దానికి అంత విలువలేదు అనే ధోరణిలో మాట్లాడతారు. కొత్త నిబంధనలో స్త్రీ అని, పురుషుడని ఏ బేధమును లేదు అని వ్రాయబడింది అంటారు. కానీ **క్రైస్తవుల దేవుడైన పౌలు** కొత్త నిబంధనలో కూడా ఏమంటున్నాడో చూడండి.

***<u>1వ తిమోతి-2:11,12</u> స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదేగాని, ఉపదేశించుటకైననూ, పురుషునిమీద అధికారము చేయుటకైననూ ఆమెకు సెలవియ్యను.***

పాత నిబంధన కొట్టేయబడింది, అది ఎందుకూ పనికిరానిది అని చెప్పిన పౌలే ఇక్కడ పాత నిబంధనలోని వాక్యాన్ని ప్రస్తావిస్తూ పురుషుని ముందు స్త్రీకి ఉన్న పరిమితుల గురించి, ఆమె మాట్లాడటానికి కూడా అనుమతి లేదని గుర్తుచేస్తున్నాడు. అంటే తనకు అడ్డం ఉన్నంతవరకు ధర్మశాస్త్రాన్ని చెత్తబుట్టలో పడేసిన పౌలు- ధర్మశాస్త్రంలో స్త్రీపై ఉన్న వివక్షాపూరిత ఆజ్ఞలు మాత్రం శిరోధార్యం అంటున్నాడు. బైబిల్ ప్రవక్తలకి

ఇదొక మచ్చు తునక.
స్త్రీలపట్ల ఎంత చులకన భావం ఉందో చెప్పడానికి ఇదొక మచ్చు తునక.
స్త్రీలపట్ల ఎంత చులకన భావం ఉందో చెప్పడానికి
స్త్రీని భోగవస్తువుగా చూడటం, స్త్రీని ముట్టకుంటేనే

అందులో భాగంగానే స్త్రీని భోగవస్తువుగా చూడటం, స్త్రీని ముట్టకుంటేనే
పాపం అనే భావన క్రైస్తవ ప్రచారకులలో కనిపిస్తుంది. కాని విడ్డూరం ఏంటంటే వృద్ధ
మహిళల దగ్గర నుంచి పసిపిల్లల వరకు ఎక్కువగా లైంగిక వేధింపులకు గురౌతున్నది
కూడా చర్చిలలోనే. ఇందుకు వాటికన్‌సిటీ నే ప్రధాన సాక్ష్యం. ఇంకా పత్రికలలో,
టీవీలలో "పసిపిల్లలపై పాస్టర్ అత్యాచారం, కామాందుడైన పాస్టర్ కామదాహానికి
బలైన బాలిక..." ఈ విధమైన వార్తలు ప్రతిరోజూ మనకి దర్శనమిస్తూనే ఉంటాయి.
ఈ వైపరీత్యానికి కారణం ఏమైయుంటుందో మరో సందర్భంలో పరిశీలన చేద్దాం.
ఇప్పుడు మన ప్రస్తుత అంశంలోకి వస్తే...

**యేసు కన్యకి పుట్టాడు కనుక పరిశుద్ధుడు అని బైబిల్ లో ఎక్కడా లేదు. కన్యకి పుట్టని వాళ్ళు అపరిశుద్ధులు అనికూడా లేదు.**

పరిశుద్ధత విషయంలో బైబిల్ కొలమానం ఏమిటి?

క్రైస్తవ ప్రచారకులు చెప్తున్నట్లుగా యేసుని పరిశుద్ధుడు అనడం బైబల్ ప్రకారంగా సాధ్యమౌతుందా? అనిచూస్తే...

స్త్రీ, పురుష, కలయిక లేకుండా పుట్టడమే పరిశుద్ధతకి ఋజువు అయితే **ఆదాము ఏసుకన్నా పరిశుద్ధుడు.** ఎందుకంటే యేసు పురుషప్రమేయం లేకుండా పుట్టాడు అనుకున్నా, తొమ్మిది నెలలు మలమూత్రాలతో స్త్రీ గర్భంలో ఉండి ఆపై స్త్రీ యోని లోనుంచి బైటకు వచ్చాడని క్రైస్తవ బోధకులు అంగీకరించవలసిందే.

**కాని ఆదాము అసలు స్త్రీ ప్రమేయం కూడా లేకుండా పుట్టాడని బైబిల్ చెప్పింది. ఆవిధంగా ఆదాము ఏసుకన్నా పరిశుద్ధుడు అనే అర్థం వస్తుంది**

కాని ఆదాము పాపం చేశాడు, యేసు పాపం చేయలేదు అంటారు.

వసున్నా అక్కడికే వస్తున్నా.

**ఆదాము చేసిన పాపం ఏమిటి? పండు తినటం అంతేగా!** అంటే యెహోవా తినొద్దన్న పండు తిని యెహోవా ఆజ్ఞని ధిక్కరించాడు అంటారు బోధకులు. నిజమే, బైబిల్ ప్రకారంగా పాపం అంటే యెహోవా ఆజ్ఞని ధిక్కరించడమే ఈ విషయం బైబిల్ మొదటినుంచి ఉపదేశిస్తూనే ఉంటుంది.

ఈ కొలత ప్రకారం చూస్తే; **యేసు కూడా పాపి అవుతాడు, ఆదాం కన్నా పెద్ద పాపి అవుతాడు.** ఎందుకనగా ఆదాం ఒకేఒక్కసారి యెహోవా ఆజ్ఞని ధిక్కరించాడు. ఏసు మాత్రం అడుగడుగునా యెహోవాపై తిరుగుబాటు చేశాడు. యెహోవా ధర్మశాస్త్రంలోని అమానుషమైన, ఆటవికమైన ఆజ్ఞలని నిరసించాడు.

**విశ్రాంతి దినం రోజ పనిచేస్తే రాళ్ళతో కొట్టి చంపడం**

వ్యభిచారం చేస్తే రాళ్ళతో కొట్టి చంపడం
భర్తకి ఇష్టం తప్పిపోతే భార్యని పరిత్యజించడం
ఇలాంటి ఆజ్ఞలపై తిరుగుబావుటా ఎగురవేశాడు. కంటికి కన్ను పంటికి పన్ను అని చెప్పిన యెహోవా మాటని కాదని, ఒక చెంప కొడితే ఇంకోచెంప చూపించు అంటూ యెహోవాకి పూర్తి విరుద్ధమైన బోధనలు చేశాడు. ఈ విదంగా యేసు యెహోవా అజ్ఞలని ధిక్కరించడం కాదు తన జీవితమంతా యెహోవాపై పోరాదాడు. ఆ పోరాటంలోనే యెహోవా భక్తులైన యూదుల ఆగ్రహనికి గురై ప్రాణాల్ని కూడా పోగొట్టుకున్నాడు.

కనుక యెహోవా అజ్ఞలని ధిక్కరించేవాడు పాపి అనే బైబిల్ కొలమానం ప్రకారం యేసు అందరికన్నా పెద్ద పాపి అవుతాడు.

ఆయన చేసింది మంచే కదా అని అనిపించొచ్చు కొందరికి. కాని అలాంటి అభిప్రాయాలని బైబిల్ ఒప్పుకోదు. యెహోవా ఆజ్ఞలు అలాగే ఉంటాయి.

**బైబిల్ దేవుడు- పొరుగు రాజ్యాలపై పడి దోచుకోండి అంటాడు, ఆ రాజ్యాలలోని స్త్రీలను చెరపట్టండి అంటాడు, వాళ్ళ దేవతా విగ్రహాలను పగలగొట్టి ఆ పట్టణాలను తగలబెట్టండి అంటాడు, పసిపిల్లలని కూడా వదలకుండా చంపండి అంటాడు.**

ఈ ఆజ్ఞలను తూ.చ. తప్పకుండా అమలు చేసేవాడే నీతిమంతుడు అంటుంది బైబిల్. అమాలేకీయులు అనే జాతి మెత్తాన్ని సర్వనాశనం చేయమని యెహోవా సౌలు అనే ఇశ్రాయేలు రాజుని ఆజ్ఞాపిస్తే సౌలు కొన్ని జీవుల్ని ప్రాణాలతో విడిచిపెట్టనందుకు ఈ సౌలు నా ఆజ్ఞనే ధిక్కరిస్తాడా? వీణ్ణి అనవసరంగా ఇశ్రాయేలీయులపై రాజుని చేశానే అని కుమిలిపోయాడు. ఆపై నీవు నాప్రజలపై రాజుగా ఉండటానికి పనికిరావు అని శెపిస్తాడు. కనుక యెహోవా చంపమంటే చంపాలి కాని మానవత్వంతో జాలి దయ ప్రదర్శిస్తే నీతిమంతుడు అనిపించుకోడు సరికదా; యెహోవా ఆగ్రహానికి గురి కావాల్సివస్తుంది.

ఇదిమాత్రమే గాక యేసు మధ్యపాని అనేవిషయం కూడా గమనించదగినది. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా చెప్పాడు.

**<u>లూకా-7:33,34</u> బాప్తిస్మమిచ్చు యోహాను రొట్టె తినకయు ద్రాక్షారసము త్రాగకయు వచ్చెను గనుక వీడు దయ్యము పట్టినవాడని మీరనుచున్నారు. మనుష్య కుమారుడు తినుచును త్రాగుచును వచ్చెను గనుక మీరు ఇదిగో వీడు తిండిపోతును, మధ్యపానియు సుంకరులకును పాపులకును స్నేహితుడని అనుచున్నారు.**

ఇక్కడ ఇంత స్పష్టంగా ఏసు స్వయంగా నేను ద్రాక్షరసం త్రాగడంవల్ల నన్ను మధ్యపాని అని అంటున్నారు అని చెప్పినా క్రైస్తవులు ఈ విషయాన్ని ఒప్పుకోరు. ద్రాక్షరసం అంటే

మధ్యం కాదు ఫ్రూట్‌జ్యూస్ అంటారు. కాని ఆదికాండంలో లోతుకి ద్రాక్షరసం త్రాగించి అతను మత్తుడై ఉన్నపుడు లోతు కూతుర్లు అతనితో వ్యభిచారం చేసినట్లుగా చూడవచ్చు. అంతకుముందు నోవహు కూడ ద్రాక్షరసం త్రాగి మత్తుడై బట్టలు లేకుండా పడిపోతే ఆయన కొడుకులు ఒంటిపై బట్టలు కప్పినట్లుగా ఉంది. ఇంకా

<u>1వ సమూయేలు 1:14</u> (యెహోవా) ఎంతవరకు నీవు మత్తురాలవై యుందువు? నీవు ద్రాక్షరసమును నీయొద్దనుండి తీసివేయుమని చెప్పగా

<u>న్యాయాధిపతులు 13:4</u> (దేవదూత ఒక స్త్రీతో) కాబట్టి నీవు జాగ్రత్తగా ఉండి ద్రాక్షరసమునే గాని మద్యమునేగాని త్రాగకుండుము. అపవిత్రమైన దేనినైనను తినకుండుము.

ఈ విధంగా బైబిల్ లో మొదటినుండి ద్రాక్షరసం అనగా మత్తుపదార్థం అని అపవిత్రత కలిగించేదని చెప్పబడింది.

<u>సామెతలు 23:20</u> "ద్రాక్షారసము త్రాగువారితోనైనను", మాంసము హెచ్చుగా తిను వారితోనైనను సహవాసము చేయకుము.

మరి ఇటువంటి ద్రాక్షారసాన్ని మాంసాహారంతో కలిపి తీసుకోవడం యేసుకి అలవాటు.

<u>లూకా -22:11-13</u> నేను నాశిష్యులతో కూడా కలిసి పస్కా (పశువును) భుజించుటకు ఒక గదిని సిద్ధం చేయించుమని ఒక ఇంటి యజమానికి యేసు వర్తమానం పంపిస్తాడు. అక్కడ ఇకమీదట దేవుని రాజ్యము వచ్చువరకు నేను ద్రాక్షారసము త్రాగనని మీతో చెప్పుచున్నాను అంటాడు.

అంటే దేవుని రాజ్యం అనగా పరలోక రాజ్యం లో కూడా ఈ తినడం త్రాగడం ఉంటుందన్నమాట. పోనీలే క్రైస్తవులకి ఏదో కాలక్షేపం ఉండాలిగా. అంతు పొంతు లేకుండా ఎంతకాలమని దేవునికి స్తోత్రం...స్తోత్రం అంటూ ఉంటారు?

కాని పరలోక రాజ్యం అనగానే ఆతరం గతించకమునుపే రావాలి కదా! అనే వాక్యం కూడా నాకు వెంటనే స్ఫురణ కొచ్చేస్తుంది. అదికూడా యేసే నొక్కి మరీ చెప్పాడు కదా.

పై విషయాలని బట్టి యెహోవా ఆజ్ఞలని ఉల్లంఘించి, ఆయనపై తిరుగుబాటు చేయడంవల్ల, బైబిల్‌లో మత్తు, అపవిత్ర పదార్థంగా చెప్పబడిన ద్రాక్షారసాన్ని సేవించడంవల్ల బైబిల్ ప్రకారంగా యేసుని పరిశుద్ధుడు అనడం సాధ్యపడదు. ఇందుకు ఏసు మాటలూ బలాన్నిస్తున్నాయి చూడండి.

<u>లూకా 18:19</u> అందుకు యేసు నేను సత్పురుషుడనని ఏల చెప్పుచున్నావు ? దేవుడొక్కడే తప్ప మరి ఎవడునూ సత్పురుషుడు కాడు. ఈమాట విన్న ఈనాటి బోధకులు ఏసు ఆమాట ఉత్తుత్తినే సరదాగా అన్నాడులే అనికూడా అనేయగలరు.

సి) యేసు ఇశ్రాయేలీయులకొరకు మాత్రమే వస్తే సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించండి అని శిష్యులతో ఎందుకన్నాడు?
యేసు కేవలం ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే వచ్చాడనే విషయం ఎవరో పుట్టించింది కాదు. స్వయంగా యేసే వివిధ సందర్భాలలో ఈ విషయాన్ని ఢంకా బజాయించి మరీ చెప్పాడు.

**నేను ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే వచ్చాను-<u>మత్తయి 15:24</u>**
**(యేసు శిష్యులతో) మీరు ఇశ్రాయేలీయుల వద్దకి తప్ప అన్యుల వద్దకి పోయి సువార్త <u>ప్రకటించకండి</u> <u>మత్తయి 10:5,6.</u>**
**నేను ఇశ్రాయేలీయులకి మాత్రమే అర్థమయ్యేలా నా సువార్త చెప్తున్నాను దేవుని రాజ్యంలోకి <u>ప్రవేశించడానికి</u> నారు మాత్రమే అర్హులు అన్యులకి <u>ప్రవేశం</u> లేదు <u>మార్కు - 4:10,11,12</u>**

ఇంత విస్పష్టంగా ఇన్ని సార్లు నేను నా బోధనలు ఇశ్రాయేలీయుల కొరకే అని చెప్పి, ఇంకొకచోట సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించండి అంటున్నాడేమిటి? ఆయనకి మానసిక స్థిరత్వం లేదని అనుకోవాలా? లేక ఇంకేమైనా జరిగి ఉంటుందా? అన్నది జాగ్రత్తగా పరిశీలించాలి.
ఈ విషయం మీద క్రైస్తవ బోధకులని వివరణ అడిగితే వారు చెప్పే సమాధానం యేసు సిలువ వేయబడకముందు ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే వచ్చాను అన్నాడు, సిలువ వేయబడి మరణించి తిరిగి లేచిన తరువాత మాత్రం సర్వలోకంలో ఉన్న సర్వసృష్టికి సువార్త ప్రకటించమన్నాడు అని ఏదేదో చెప్తారు.
పైన ఇచ్చిన బైబిల్‌లోని మూడు సందర్భాలను పరిశీలిస్తే యేసు ఇశ్రాయేలీయుల కొరకు ఎంతగా కట్టుబడ్డాడో అర్థమవుతుంది. అసలు తన సువార్త అన్యజనులకి అర్థమయితే వారు కూడా దేవుని రాజ్యంలోకి వచ్చేస్తారేమో అని వారికి అర్థం కాకుండా ఉండటానికే ఉపమాన రీతిగా బోధించే పథకం వేశాడంటే ఏమనుకోవాలి? ఇది **చదువుతున్నప్పుడు నాకు దిగ్భ్రాంతి కలిగింది.** మేము ఇశ్రాయేలీయుల కొరకే అని చెప్పుకున్న బైబిల్ ప్రవక్తలందరి కన్నా యేసే ముందువరసలో ఉన్నాడు అని చెప్పక తప్పదు.
అలాంటివాడు పూర్తిగా 'యు' టర్న్ తీసుకుని సర్వసృష్టికి సువార్త ప్రకటించండి అంటున్నాడంటే అక్కడ ఏదో జరిగి ఉండాలి. ఏం జరిగిందని పరిశీలిస్తే ఒక విస్తుగొలిపే నిజం బయటపడుతుంది.
**ఆమాటలు అసలు ఏసు చెప్పినవి కావు. సువార్తికులు వ్రాసినవి కావు.** తదనంతర కాలంలో బైబిల్ లో ఈ విషయాలు చేర్చబడ్డాయి. ఇందుకు చారిత్రిక ఆధారం క్రీ.శ.

4వ శతాబ్దానికి ముందు ఉన్న బైబిల్ లో మార్కు 16వ అధ్యాయం 8వ వచనంతో మార్కు సువార్త ముగిసి పోయింది. ఆ తరువాత లూకా సువార్త ప్రారంభమౌతుంది. యేసు శరీరం సమాధి నుంచి మాయం అవడం వరకే మార్కు సువార్తికుడు రాశాడు. అతరువాత యేసు పునరుత్థానమై శిష్యులకు కనబడి, అందరికి సువార్త ప్రకటించమని చెప్పి పరలోకానికి ఆరోహణ అయినట్లుగా ఉన్న కథనాలను కొందరు ఉత్సాహమంతులు లేదా స్వార్థపరులు తరువాతి కాలంలో బైబిల్ లో జోడించారు.

ఈ విషయం ఇంటర్నెట్‌లో పరిశీలిస్తే మార్కు 16-8 వరకే ఉన్న బైబిల్ మనకి దర్శనమిస్తుంది. ఈ విషయంపై వాటికన్‌సిటీ కూడా నోరు మెదపడం లేదు. 4వ శతాబ్దానికి ముందు ఉన్న బైబిల్ మాదగ్గర లేదని చేతులు దులుపుకుంటుంది. మొదటగా హెబ్రూ, గ్రీకు భాషల్లో రాయబడిన బైబిల్ ఆ తరువాత వేరే భాషల్లోకి అనువాదం చేసేటప్పుడు, కాలనుగుణంగా అనేకానేక మార్పులకి లోనవుతూ వచ్చిందన్న విషయాన్ని ఎక్కువమంది అంగీకరిస్తున్నారు. ఇదికూడా అందులో భాగమే.

ఇక ఇప్పుడు క్రైస్తవ బోధకులు చరిత్రతో మాకు పనేంటి? బైబిలే మాకు ప్రామాణికం. చరిత్రని చెత్తబుట్టలో పడేయండి అంటారు. అక్కడికి వాళ్ళేదో బైబిల్‌ని తెగ అనుసరిస్తున్నట్లు. బైబిల్‌లో ఉన్నదేంటి? వాళ్ళు ప్రచారం చేస్తున్నదేంటి? అని **"బైబిల్ దేవుని నిజ స్వరూప స్వభావాలు", "అదర్ సైడ్ ఆఫ్ జీసస్"** అనే రెండు పుస్తకాల ద్వారా దొంగ బోధకుల గుట్టు రట్టు చేశాం. ఒకవేళ వారుగాని ఈ విషయం బైబిల్‌లో ఉంటేనే నమ్ముతాం అని ఆవేశంగా నోరు జారితే మాత్రం వాళ్ళ పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డట్లే.

**ఎందుకంటే ఇందుకు ఆధారం చరిత్రలోనే కాదు బైబిల్‌లో కూడా ఉంది.**

ఈ లైను చదవగానే క్రైస్తవ ప్రచారకుల గొంతు తడారిపోయి ఉంటుంది. కొంచెం మంచినీళ్ళు త్రాగి రండి ఈ విషయంపై పూర్తి వివరాల్లోకెళ్దాం.

"సర్వలోకానికి వెళ్ళి సర్వ సృష్టికి సువార్త ప్రకటించండి" అనే ఈ విషయం బైబిల్‌లో మెదటినుంచి లేదు ఆ తరువాత చేర్చబడింది అనడానికి బైబిల్ లోనే ఉన్న ఆధారం చూడండి.

ఏసు సిలువ వేయబడి లేచిన తరువాత 40 రోజులపాటు శిష్యులకి కనిపిస్తూ, ఆ తర్వాత పరలోకానికి ఆరోహణ అయ్యాడని బైబిల్ కథనం. పరలోకానికి వెళ్ళకముందు 40 రోజులపాటు శిష్యులకి కనబడుతూ అంతర్థానమౌతూ ఉన్న సమయంలో సర్వసృష్టికి సువార్త ప్రకటించమని ఆజ్ఞ ఇస్తే; పేతురేంటి ఆయన పరలోకానికి వెళ్ళిన చాలాకాలం తరువాత అన్యజనులకి కూడా సువార్త ప్రకటించమని ఆజ్ఞ ఇచ్చినట్టుగా చెప్తున్నాడు అపొస్తులుల కార్యాలలో?

అ.పొ. 10-9-16 అధ్యాయాలు చదివితే పేతురుకి బాగా ఆకలి అవుతుంది. అప్పుడు అతని కొరకు ఆకాశం నుంచి వచ్చిన దుప్పటి వంటి ఒక పాత్రలో అన్ని రకాలైన జంతువులు, పక్షులు, పురుగులు ఉంటాయి. వాటిలో నుంచి చంపుకు తినమని ఆకాశం నుండి పేతురుకి ఒక శబ్దం వినిపిస్తుంది. అందుకు పేతురు అపవిత్రమైన వాటిని నేనెప్పుడూ తినలేదు అంటాడు. దేవుడు పవిత్రం చేసిన వాటిని నీవు నిషిద్ధమైనవిగా ఎంచవద్దని మరల ఆ శబ్దం అతనికి వినిపిస్తుంది.

దీని భావం ఏమిటంటే అపవిత్రమైన, నిషిద్ధమైన వాటిని నేనెప్పుడూ తినలేదు అనగా అపవిత్రులైన అన్యజనులకి సువార్త ప్రకటించడం, వారితో సహవాసం చేయడం నేనెప్పుడూ చేయలేదు అని. ఆ తరువాత దేవుడు పవిత్రం చేసిన వాటిని నీవు నిషిద్ధమైనవిగా ఎంచవద్దని ఆ శబ్దం పేతురుతో చెప్పడం అంటే; అన్యజనులని కూడా దేవుడు పవిత్రులుగా నిర్ణయించాడు కనుక వారితో స్నేహం చేస్తూ, సువార్త ప్రకటించమని అర్థం.

ఈ విషయాన్ని పేతురు ఆ తరువాతి వాక్యాలలో విడమరిచి చెప్తాడు. పేతురు శతాధిపతియైన కొర్నేలి ఆహ్వానం మేరకు అతని ఇంటికి ఆతిథ్యానికి వెళ్ళి అతని బంధువులకి, స్నేహితులకి బాప్తిస్మం ఇస్తాడు.

ఈ విషయం తెలిసిన మిగిలిన ఏసు శిష్యులు పేతురుతో వాదం పెట్టుకుంటారు. **నీవు సున్నతి లేని వారి దగ్గరికి పోయి వాళ్ళతో కలిసి భోజనం చేస్తావా?** అని.
ఇశ్రాయేలీయులకి జాత్యహంకారమూ, మిగిలిన జాతుల వారంటే చులకన భావమూ ఉన్నాయని బైబిల్ ఋజువులతో 'సర్వలోకజగద్రక్షకుడు' భాగంలో వివరించాను గమనించండి. అదే పోకడతో ఇక్కడ పేతురుతో నువ్వు వారితో కలిసి భోజనం చేయడమేంటి? వారికి బాప్తిస్మం ఇవ్వడం ఏంటి? అని వాదిస్తున్నారు.

అపుడు పేతురు అంతకముందు తనకు కలిగిన దర్శనం, ఆకాశం నుంచి దుప్పటి వంటి పాత్రలో జంతువులు దిగి రావడం, వాటిని చంపుకు తినమని ఒక శబ్దం వినపడగా పేతురు అపవిత్రమైనవని సందేహించడం, దేవుడు పవిత్రం చేసిన వాటిని అపవిత్రంగా ఎంచవద్దని ఆ శబ్దం మళ్ళీ వినపడటం ఇదంతా చెప్పి "**కాబట్టి ప్రభువైన ఏసు క్రీస్తునందు విశ్వాసముంచిన మనకు అనుగ్రహించినట్టు దేవుడు వారికి కూడా సమానవరము అనుగ్రహించి యుండగా దేవుని అడ్డగించుటకు నేను ఏపాటి వాడినని చెప్పెను.**"

అంటే అన్యజనులకి కూడా సువార్త ప్రకటించి వారు కూడా మారుమనసు పొందడానికి వీలుగా దేవుడే వారికి మనతో పాటు సమానవరం అనుగ్రహించాడు

దీన్ని నేనెలా కాదనగలను? అని పేతురు చెప్తున్నాడు.

ఆ తరువాత చూడండి...

**అ.పొ.-11:18 అట్లయితే అన్యజనులకును దేవుడు జీవార్థమైన మారుమనస్సు దయచేసి యున్నాడని చెప్పుకొనుచు దేవుని మహిమ పరచిరి.**

మిగిలినవారు ఆశ్చర్యపోతున్నారు. అన్యజనులకు కూడా దేవుడు జీవార్థమైన మారుమనసు పొందడానికి అవకాశం కల్పించాడు అని.

అంటే ఇప్పటివరకు వాళ్ళు కేవలం ఇశ్రాయేలీయుకి మాత్రమే దేవుని రాజ్యంలోకి ప్రవేశం ఉంది. వారికి మాత్రమే సువార్త ప్రకటించాలి అనుకున్నారు. కాని ఇకనుంచి అన్యజనులకి కూడా దేవుడు ఈ అవకాశం కలగజేశాడని ఆశ్చర్యపోతున్నారు. ఇది ఏసు పరలోకానికి వెళ్ళిపోయాక చాలా కాలానికి జరిగిన సంఘటన. ఏసు పరలోకానికి వెళ్ళకముందే సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించండి అని ఆజ్ఞ ఇచ్చినట్లుగా మార్కు సువార్తలో వ్రాయబడిన విషయం నిజమే అయితే; మళ్ళీ చాలాకాలం తరవాత పేతురు అన్యజనులకి బాప్తిస్మం ఇవ్వడం, అందుకు మిగిలిన శిష్యులు అభ్యంతరం చెప్పి అతనితో తగువు పెట్టుకోవడం, అపుడు పేతురు తనకి కలిగిన దర్శనం గురించి చెప్పి అపవిత్రములైన వాటిని పవిత్రములుగా అనగా అపవిత్రులైన అన్యజనులకి కూడా సువార్త ప్రకటించమని దేవుడు ఆజ్ఞ ఇచ్చినట్టుగా వారికి సంజాయిషీ ఇచ్చుకోవడం ఇంత పెద్ద సీన్ ఎందుకు క్రియేట్ చేయాల్సి వచ్చింది?

సర్వసృష్టికి సువార్త ప్రకటించమని ఏసు చెప్పినప్పుడు మీరూ ఉన్నారుగా అని పేతురు వారిని ఎందుకు ప్రశ్నించలేదు?

**ఎందుకంటే అసలు ఏసు అలా చెప్పలేదు, వీరు అలా రాయలేదు కాబట్టి.** ఏసు పరలోకానికి ఆరోహణ అవ్వడం, సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించండి అని చెప్పడం ఈ వాక్యాలన్నీ అనంతర కాలంలో బైబిల్‌లో జొప్పించబడ్డాయి అనడానికి ఇది తిరుగులేని ఆధారం.

అందుకే మిగిలిన ఏసు శిష్యులు కూడా పేతురు చెప్పిన సంగతి విని అన్యజనులకి కూడా దేవుడు సమానవరాన్ని అనుగ్రహించాడా? అని ఆశ్చర్యపోవలసి వచ్చింది.

సర్వసృష్టికి సువార్త ప్రకటించండి అని ఏసు ముందే చెప్పిఉంటే వాళ్ళు ఇపుడు ఇలా ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టడం జరిగేది కాదు.

## డి) క్రీస్తు కన్యకి పుడతాడా?

<u>యెషయా-7:14</u> కన్యక గర్భవతియై కుమారుని కనును. అతనికి ఇమ్మానుయేలు అని పేరు పెట్టుదురు.

ఇది ఏసు జననం గురించి 700 సంవత్సరాలకి ముందే యెషయా అనే ప్రవక్త చెప్పాడని క్రైస్తవుల విశ్వాసం. అసలు యెషయా ఈ వాక్యం ఎవరి గురించి చెప్పాడు? ఆ సందర్భం ఏమిటి? అని బైబిల్‌ని పరిశీలిస్తే ఈ వాక్యానికి ఏసుకి ఎలాంటి సంబంధం లేదని తేలుతుంది.

ముందుగా ఒక విషయం; ఇది ఏసు గురించి చెప్పబడిందే అయితే ఆయనికి ఇమ్మానుయేలు అని పేరు పెట్టాలి కదా. కాని ఏసు అని పేరు పెట్టారు. ఇది మొదటి విషయం.

రెండవ విషయం :

<u>యెషయా-7:1,2</u> వచనాలు చూస్తే సిరియా రాజు, ఇశ్రాయేలు రాజు కలిసి యెరూషలేం మీద యుద్ధం చేయడానికి వస్తారు. ఈ విషయం తెలిసి యూదులు అంటే దావీదు వంశస్థులు భయపడతారు.

<u>7:3,9</u> వచనాలు చూడండి అప్పుడు యెహోవా యెషయాని యూదుల రాజైన ఆహాజు దగ్గరికి పంపి మీరు భయపడవద్దు. మీమీదకి వచ్చిన ఆ ఇద్దరు రాజులు ఇశ్రాయేలు రాజు, సిరియారాజు నాశనమవుతారు. అంటాడు.

మళ్ళీ 10 నుంచి 16 వ వచనం వరకు చూడండి.

ఆ ఇద్దరు రాజులు నాశనమవుతారు అని మీకు నమ్మకం కలగడానికి ఏదైనా ఒక సూచకక్రియ అడుగు అంటాడు. అప్పుడు యూదా రాజైన ఆహాజు లేదు నాకు నమ్మకం ఉంది నేను సూచకక్రియని అడిగి యెహోవాని శోధించను అని, తన ప్రజలతో దావీదు వంశస్తులతో ఇలా చెప్తాడు. ఆ ఇద్దరు రాజుల్ని యెహోవా నాశనం చేస్తాడంటే మీరు నమ్మడం లేదుకదా. అయితే వినండి కన్యక గర్భవతియై కుమారుని కనును. అతనికి ఇమ్మానుయేలు అని పేరు పెట్టుదురు. ఆ బాలుడుకి తెలివి అంటే ఆలోచనా వయసు రాకమునుపు ఆ ఇద్దరు రాజుల దేశము పాడు చేయబడును అంటాడు.

అంటే కన్యక గర్భవతియై కుమారుని కనడం అనేది ఎందుకు? అది యూదా మీదకి వచ్చిన ఆ ఇద్దరు రాజులు నాశనం చేయబడతారు అనడానికి గుర్తు. ఇది ఎప్పుడు జరగాలి? **700** సంవత్సరాల తరువాత కాదు కదా. ఆ ప్రవచనం ఆ తరంలోనే జరగాలి.

8వ అధ్యాయం చూడండి. 8:3లో ఒక ప్రవక్తి గర్భవతియై కుమారుని కంటుంది. ఆ బాలుడికి మహేరు షాలాల్ హష్‌బజ్ అని పేరు పెడతారు. ఆ బాలుడికి తెలివిరాక మునుపు ఆ ఇద్దరు రాజులు నాశనమవుతారు అని ఉంటుంది.

(8వ వచనము ఇమ్మానుయేలు అని ఉంటుంది) అంటే కన్యక గర్భవతియై కుమారుని కనడం అనే విషయానికి ఏసుకి ఎలాంటి సంబంధమూ లేదన్నమాట. హెబ్రూ బైబిల్‌లో అయితే ఆ వచనంలో కన్యక అని కాక యువతి గర్భవతియై కుమారుని కనును అని ఉంటుంది.

ఏసు కన్యకి పుట్టాడు అనే విషయాన్ని యూదులు కూడా విశ్వసించలేదు. వారు ఏమంటున్నారో వారి మాటల్లోనే...

**యోహాను-8:41 అందుకు వారు మేము వ్యభిచారం వలన పుట్టిన వారము కాము దేవుడొక్కడే మాకు తండ్రి** అని ఏసుని ఎత్తిపొడుస్తున్నట్టుగా ఉంది.

క్రీస్తు కన్యకి పుడతాడు అనే ప్రవచనం కనుక ఉండి ఉంటే వారు ఇలా ఏసుని నిందించాల్సిన అవసరం ఏముంది?

## ఇ) క్రీస్తు పెళ్ళి చేసుకోకూడదా?

క్రీస్తు అనే ప్రవక్త ఇశ్రాయేలీయుల పాపముల నిమిత్తం మరణిస్తాడని పాతనిబంధనలో ఎక్కడాలేదు. అలాగే అతడు పెళ్ళి చేసుకోడు అనే విషయం కూడా లేదు. అయితే అతను పెళ్ళి చేసుకుంటాడు అనే విషయం అయినా ఉందా? అని చూద్దాం.

ఈ విషయం నేరుగా లేకపోయినప్పటికీ దానిగురించిన కొంత సమాచారం మాత్రం బైబిల్‌లో ఉంది. ఈ సమాచారం ప్రకారం క్రీస్తు పెళ్ళిచేసుకోవాలి. అదెలాగంటే...

**<u>యెహెజ్కేలు-34:22</u> నా గొఱ్ఱెలు ఇక దోపుడు కాకుండా గొఱ్ఱెకునూ, గొఱ్ఱెకునూ మధ్య తీర్పు తీర్చి నేను వాటిని రక్షించెదను. వాటిని మేపుటకై నేను నా సేవకుడైన దావీదును వాటిమీద కాపరిగా నియమించెదను.**

పై వాక్యంలో గొఱ్ఱెలు అంటే ఇశ్రాయేలీయులు. వారిని రక్షించి వారిపై తన సేవకుడైన దావీదుని కాపరిగా అంటే రాజుగా నియమిస్తానని యెహోవా చెప్తున్నాడు. ఇది చెప్పేటప్పటికి దావీదు చనిపోయాడు. మరి దావీదుని ఎలా రాజుగా నియమిస్తాడు? అంటే దావీదు వంశంలో పుట్టినవాణ్ణి రాజును చేస్తాడని అర్థం. ఇది క్రీస్తుని గురించిన ప్రవచనం. అలాగే ఇంకొకచోట ఈ విధంగా చెప్తున్నాడు.

**<u>యెహెజ్కేలు-37:25</u> మీ పితరులు నివసించునట్లు నా సేవకుడైన యాకోబునకు నేనిచ్చిన దేశములో వారు నివశింతురు. వారి పిల్లలను, వారి పిల్లల పిల్లలను అక్కడ నిత్యం నివసింతురు. నా సేవకుడైన దావీదు "ఎల్లకాలమూ" వారికి అధిపతియై ఉండును.**

దావీదు అంటే దావీదు వంశంలో పుట్టినవాడు అని అర్థం వస్తుంది అని ఇంతకుముందు చూశాం. అలాగే దావీదు ఎల్లకాలమూ వారికి అధిపతియై ఉండును అంటే దావీదు వంశంలో పుట్టినవారు తరతరాలు ఇశ్రాయేలీయులని పరిపాలిస్తారు అన్న అర్థం వస్తుంది. కనుక దావీదు వంశంలో పుట్టిన క్రీస్తు ఇశ్రాయేలీయులకి రాజయ్యాక అతని సంతానం, ఆ తరువాతి సంతానం ఎల్లకాలమూ ఇశ్రాయేలీయులని పరిపాలించాలి.

**ఈ ప్రవచనం నెరవేరాలంటే క్రీస్తు పెళ్ళి చేసుకోవాలి.**

## 18. క్రైస్తవుల సందేహాలు-సమాధానాలు

ఏసు-నేను పాపుల కోసం చనిపోతున్నాను అని చెప్పినట్టుగా క్రైస్తవ బోధకులు బైబిల్‌లోనుండి కొన్ని వాక్యాలు చూపిస్తారు. నిజానికి ఆ వాక్యాల అసలు అర్థం అదికాదు. ఏసు ఏ సందర్భంలో ఆ మాటలు చెప్పాడో ఆ మాటలు చెప్పటం వెనుక ఆయన ఉద్దేశ్యం ఏమిటో తెలుసుకోవడం చాలా అవసరం.

ఎ) <u>మత్తయి-20:28</u> మనుష్య కుమారుడు అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణాన్ని ఇవ్వటానికి వచ్చాడు.

సమాధానం: ఇక్కడ ఏసు అనేకులకు అంటున్నాడు. అనేకులకు అంటే అందరికీ అని అర్థం కాదు. ఏకం అంటే ఒకటి. అనేకం అంటే ఏకం కానిది. రెండు అంతకన్నా ఎక్కువ అని, చాలామంది అని అర్థం వస్తుంది. ఆ అనేకులు ఎవరు?...... వారు ఇశ్రాయేలీయులే. ఎందుకనగా నేను ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే పంపబడ్డానని ఏసే స్వయంగా చెప్పాడు గనుక.

అంటే దానర్థం ఇశ్రాయేలీయులకు ప్రతిగా అని, మానవులందరికీ ప్రతిగా అని కానేకాదు. ఇక విమోచన క్రయధనముగా అంటున్నాడు. విమోచనం అంటే ఏమిటి? విడిపించడం అనేకదా. దేనినుంచి విడిపించడం? పాపం నుంచి అంతేకదా! ఏసు ప్రకారంగా పాపం నుంచి విడిపించగలిగేదేమిటి? ఏసు ప్రాణమా? కాదు. పాపంనుంచి విడిపించేదేంటో ఏసు చెప్తున్నాడు. యోహాను సువార్త చూడండి.

<u>యోహాను-8:31,32</u> వచనాలు చూసినట్లయితే ఏసు యూదులతో అంటున్నాడు. "***మీరు నా వాక్యముందు నిలిచినవారు కాదు. నిలిచినట్లయితే మీరు సత్యమును గ్రహించేవారు. ఆ సత్యం మిమ్మలను స్వతంత్రులుగా చేయును.***" అంటున్నాడు. **అందుకు యూదులు మేమెవ్వంకీ దాసులం కాదే మేము స్వతంత్రులం అవ్వడం ఏంటి?** అని అడిగితే ఏసు అంటున్నాడు **పాపంచేయు ప్రతివాడు పాపానికి దాసుడు** అంటున్నాడు. అంటే మీరు పాపానికి దాసులుగా ఉన్నారు. నా వాక్యాన్ని గ్రహించినట్లయితే నా వాక్యంలో ఉన్న సత్యం మిమ్మల్ని పాపంనుంచి విడిపించి స్వతంత్రులుగా చేస్తుంది అంటున్నాడు.

అంటే ఇశ్రాయేలీయులని పాపంనుంచి విడిపించేది ఏసు బోధించే వాక్యమే తప్ప ఏసు ప్రాణం కాదు. మరి ప్రాణం ఇవ్వడానికి వచ్చాను అని ఎందుకన్నాడు? ఎందుకంటే ఆ వాక్యం బోధిస్తే యూదులు ఏం చేస్తారు? చంపేస్తారు. ఏసుని చంపడానికి యూదులు అనేకసార్లు ప్రయత్నించినట్లుగా ఇంతకముందు భాగాల్లో చూశాం. వాళ్ళు చంపినా సరే నా ప్రాణాన్ని ఫణంగాపెట్టి వారికి వాక్యాన్ని బోధించి పాపక్షమాపణ

కలుగజేస్తాను అని చెప్తూ మనుష్య కుమారుడు ఇశ్రాయేలీయులకి ప్రతిగా విమోచన క్రయధనముగా అంటే వాక్యాన్ని బోధించే విషయంలో తన ప్రాణాన్ని ఇవ్వటానికి సిద్ధపడ్డాను అంటున్నాడు. అంతే తప్ప ఆ మాటలకి అర్థం ఏసు ప్రాణం వారిని పాపంనుంచి విడిపిస్తుంది అని కాదు.

బి) ఇది నా రక్తము అనగా పాపక్షమాపణ నిమిత్తం అనేకుల కొరకు చిందింపబడుతున్నది నిబంధన రక్తము-మత్తయి-26:28

**సమాధానం:** ఈ వాక్యానికి కూడా పైన చెప్పిన వివరణే దాదాపుగా సరిపోతుంది. ఇంకొంచెం లోతుగా పరిశీలన చేసి ఏసు మాట్లాడే భాషని అర్థం చేసుకుందాం. ఉదా: **యోహాను-6:53** లో ఏసు ఇలా అంటున్నాడు. ***"మీరు నా శరీరం తిని నా రక్తం తాగితేనే గాని జీవం కలవారు కాదు"*** అని. అంటే నిజంగా ఆయన మీద పడి కొరికేసి, పీకేసి రక్తం తాగైమనా? కాదుకదా. తన శరీరాన్ని రక్తాన్ని ఉపయోగించి తాను బోధించే వాక్యాన్ని తినండి అంటే గ్రహించండి అంటున్నాడు. అలాగే చిందింపబడుచున్న రక్తం అని ఎందుకన్నాడంటే తాను వాక్యాన్ని బోధిస్తే యూదులు చంపేస్తారు. వాళ్ళు చంపినా నా రక్తాన్ని చిందించైనా సరే వాళ్ళకి పాపక్షమాపణ కలగజేసే వాక్యాన్ని బోధిస్తాను. కనుక ఇశ్రాయేలీయుల పాపక్షమాపణ నిమిత్తం రక్తం చిందించి బోధించబడుచున్న వాక్యం అంటున్నాడు.

సి) యోనా మూడు రాత్రింబగళ్ళు తిమింగలం కడుపులో ఏలాగుండెనో అలాగు మనుష్య కుమారుడు మూడు రాత్రింబగళ్ళు భూగర్భములో ఉండును. <u>మత్తయి-12:40</u>

సమాధానం: ఏసు శిలువ మరణానికి, పాపక్షమాపణకి ఎలాంటి సంబంధం లేదు అని చెప్పడానికి ఏసు ప్రస్తావించిన యోనా సూచకక్రియ ఒక చక్కని ఆధారం. అసలు ఆయన ఉద్దేశ్యం ఏంటో ఇక్కడ అర్థమైపోతుంది.

యోనా మూడు రాత్రింబగళ్ళు చేప కడుపులో ఏలాగుండెనో నేను కూడా ఆ విధంగానే మూడు రాత్రింబగళ్ళు భూగర్భంలో ఉంటాను అంటున్నాడు ఏసు. ఇందులో ఎక్కడైనా ఈ సంఘటనకి పాపక్షమాపణకి సంబంధం ఉంది అని ఆయన చెప్పాడా? లేదుకదా. అసలింతకూ యోనా చేప కడుపులో ఎందుకున్నాడు? అనే విషయాన్ని బైబిల్లో చూసినట్లయితే యోనా 1వ అధ్యాయం చదివితే అక్కడ యెహోవా యోనాతో చెప్తున్నాడు. **నీవు వెళ్ళి నీనెవే పట్టణస్తులకు ఈవిధంగా చెప్పు "మీరు యెహోవా దృష్టికి ఘోరమైన పాపం చేశారు కనుక ఆయన ఈ పట్టణాన్ని నాశనం చేయుబోతున్నాడు." అని. కాని యోనా వాళ్ళకి ఈ విషయం చెప్పడానికి భయపడి ఓడ ఎక్కి పారిపోతుంటే యెహోవా ప్రమాదం కలగజేసి అతన్ని చేప మింగేలా చేస్తాడు. యోనా మూడు రోజులు ఆ చేపకడుపులో ఉంటాడు. ఆ తరవాత వెళ్ళి ఆ పట్టణం వారికి యెహోవా చెప్పిన వాక్యం చెప్తాడు. అప్పుడు వారు భయపడి తమ పాపాలకి పశ్చాత్తాపం చెందితే యెహోవా వారిని క్షమించి విడిచిపెడుతాడు. (యోనా-3:6-10)**

ఇక్కడ ఒక విషయం గమనించండి. యోనా వాళ్ళకి ఏం బోధించాడు? **నేను మీ పాపక్షమాపణ నిమిత్తం మూడురోజులు చేప కడుపులో ఉన్నాను. కనుక మీరు ఈ విషయం నమ్మితే రక్షించబడతారు. లేకపోతే శిక్షించబడతారు. అని చెప్పాడా?** లేదు కదా. మీరు చేసిన పాపాలకి యెహోవా శిక్షించబోతున్నాడు అని చెప్తే వారు భయపడి మారుమనసు పొందారు.

అంటే యోనా చేపకడుపులో మూడురోజులు ఉండటానికి ఆ పట్టణస్తుల యొక్క పాపక్షమాపణకి ఎలాంటి సంబంధం లేదు. అది యోనా జీవితంలో ఒక ప్రమాదం. అయితే యోనా ఆ ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

అదే విధంగా ఏసు మూడు రోజులు భూగర్భంలో ఉండటానికి పాపక్షమాపణకి కూడా ఎలాంటి సంబంధం లేదు. అదికూడా ఏసు జీవితంలో ఒక ప్రమాదం. అయితే నేను ఆ ప్రమాదం నుంచి బయట పడతాను అని చెప్పాడు.

ఇశ్రాయేలీయులకి పాపక్షమాపణ ఏసు తాను బోధించిన వాక్యం ద్వారా కలుగుతుంది అని చెప్పాడు. ఏమిటా వాక్యం? **పరలోక రాజ్యం సమీపించియున్నది.**

మారుమనసు పొందండి. ఆజ్ఞలను గైకొనండి, నేను దేవుడు పంపిన క్రీస్తునని విశ్వసించండి. అంతేకాని నేను శిలువపై మరణించబోతున్నాను నా రక్తాన్ని నమ్ముకోండి అని కాదు.

అయితే యోనా చెప్పిన వాక్యం విని నీనెవే పట్టణం వారు మారుమనసు పొందారు రక్షించబడ్డారు. యోనా వారిని రక్షించగలిగాడు.

కాని ఏసు చెప్పిన వాక్యాన్ని ఇశ్రాయేలీయులు అంగీకరించలేదు. అంటే ఏసు ఇశ్రాయేలీయుల్ని రక్షించడంలో విఫలమయ్యాడు.

**డి) <u>యోహాను-3:14</u> అరణ్యములో మోషే సర్పమును ఏలాగు ఎత్తెనో అలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక నిత్యజీవం పొందునట్లు మనుష్యకుమారుడు ఎత్తబడవలెను.**

**సమాధానం:** ఇక్కడ ఎత్తబడవలెను. అంటే హెచ్చింపబడవలెను అని అర్థం వస్తుంది. మోషే ఎలాగైతే ఇత్తడి సర్పాన్ని ఎత్తి ఒక ఉన్నత స్థానంలో ఉంచితే, ఆ ఇత్తడి సర్పాన్ని చూసి అనేకులు ఎలా రక్షించబడ్డారో, అలాగే నేను కూడా ఘనత కలిగి హెచ్చింపబడితే అప్పుడు అందరూ నన్ను చూసి, విశ్వసించి రక్షింపబడతారు అంటున్నాడు. ఇదే విషయాన్ని యోహాను కూడా చెప్పాడు.

**<u>యోహాను-3:30</u> ఆయన అంటే ఏసు హెచ్చవలసియున్నది. నేను తగ్గవలసియున్నది.**

అంటే ఏసు హెచ్చింపబడి ఘనత కలిగితే అప్పుడు ఆయనను విశ్వసించినవారు నశింపక నిత్యజీవం పొందుతారు అని అర్థం. ఇదే విషయాన్ని ఏసు ఇంకోచోటా చెప్తున్నాడు చూడండి **<u>మార్కు-4:21</u> దీపము దీపస్తంభంమీద ఉంచబడుటకే గాని కుంచము క్రిందనైనను, మంచము క్రిందనైనను నుంచబడుటకు తేబడదు కదా.** ఇక్కడ ఎత్తబడటం అంటే హెచ్చింపబడటం కాదు సిలువపైకి ఎత్తబడటం అనుకుంటే **<u>యోహాను-8:28</u> మీరు మనుష్య కుమారుని పైకెత్తినప్పుడు నేనే ఆయననని మీరు గ్రహించెదరు.**

ఏసు సిలువపైకి ఎత్తబడినపుడు నేనే ఆయన అని అనగా; ఏసే క్రీస్తు అని, మీరు అంటే యూదులు గ్రహించెదరు అంటున్నాడు. మరి ఏసు సిలువపైకి ఎత్తబడినపుడు ఏసే -క్రీస్తు అని యూదులు గ్రహించారా? లేదు. కాబట్టి ఎత్తబడటం అంటే హెచ్చింపబడటం అని మాత్రమే అర్థం. సిలువపైకి ఎత్తబడటం అని కాదు.

ఇ) నేనే మార్గమును, సత్యమును, జీవమును నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు-<u>యోహాను-14:6</u>

సమాధానం: ఇక్కడ ఏసు నేనే మార్గం, సత్యం, జీవం అంటున్నాడు. అంటే నేను చెప్పే వాక్యం సత్యం, జీవం, మార్గం అని అర్థం.

అయితే బైబిల్ ప్రకారంగా ఏసు చెప్పిన మాటలు మాత్రమే సత్యం, జీవం అయి ఉన్నాయా? అని చూస్తే **<u>లూకా-16:19-31</u>** వచనాలలో ఏసు ధనవంతుడు, లాజరు అనే ఇద్దరి గురించి చెప్తున్నాడు. వాళ్ళిద్దరూ చనిపోయిన తరువాత లాజరేమో అబ్రహాం దగ్గర సుఖంగా ఉన్నాడు. ధనవంతుడు పాతాళంలో బాధపడుతూ అబ్రహాంని చూసి **తండ్రినైన అబ్రహామా! నాకింకనూ ఐదుగురు సహోదరులున్నారు వారు ఈ వేదనాకరమైన స్థలంలోకి రాకుండా లాజరుని వారియొద్దకు పంపి సాక్ష్యం చెప్పించు అంటాడు. అప్పుడు అబ్రహాం వారివద్ద మోషేయు ప్రవక్తలను ఉన్నారు. వారి మాట వినాలి. అప్పుడు ఈ వేదనాకరమైన స్థలానికి రారు అంటాడు. అంటే మోషే మొదలుకొని ప్రవక్తలందరి మాట విన్నవారు నిత్యజీవానికి వెళ్తారు.**

అలాగే <u>మత్తయి-12:41</u> లో ఏసు **నీనెవే పట్టణం వారు యోనా ప్రకటన విని మారుమనసు పొందారు** అంటున్నాడు. అంటే ఏం అర్థమౌతుంది. మోషే దగ్గర నుంచి యోనా వరకు ఎవరి సమయాల్లో వారు సత్యం, మార్గం, జీవం కలవారే బైబిల్ ప్రకారంగా. కాని బైబిల్లో ఉన్న ప్రవక్తలందరూ విజయవంతమయ్యారు. వారిని ఇశ్రాయేలీయులు ప్రవక్తలుగా అంగీకరించారు. ఏసు ఒక్కడే విఫలమయ్యాడు. ఆయన్ని ఇశ్రాయేలీయులు ప్రవక్తగా అంగీకరించలేదు.

## ఎఫ్) ఏసు గలిలియలోని అన్యులకి బోధించి వారిని స్వస్థపరిచాడా?

మత్తయి-4:16 అన్యజనులు నివసించుగలిలయ అని ఉంది.

**23వ వచనంలో ఏసు సువార్త ప్రకటించుచూ ప్రజల్లో ప్రతి వ్యాధిని, రోగమును స్వస్థపరచుచూ గలిలయ అంతట సంచరించెను.** కనుక ఏసు గలిలయలోని అన్యులకి బోధించి వారిని స్వస్థపరిచాడు అంటారు క్రైస్తవ ప్రచారకులు. కానీ నిజం ఏంటో చూద్దాం.

**వివరణ:** ఈ వాక్యంలో అన్యజనులు నివసించు గలిలయ అని ఉందా? అన్యజనులు మాత్రమే నివసించు గలిలయ అని ఉందా? గలిలయలో ఇశ్రాయేలీయులతో పాటు అన్యజనులు కూడా నివసిస్తున్నారు.

ఉదా: మార్కు-1:16 ఏసు గలిలయ సముద్ర తీరమున వెళ్ళుచుండగా సీమోను, అతని సహోదరుడగు అంద్రెయ సముద్రములో వలవేయుట చూచెను.

**గలిలయ సముద్ర తీరంలో ఉన్న సీమోను, అంద్రెయ ఇశ్రాయేలీయులు కారా?**

**లూకా-5:17 ఒకనాడు ఏసు బోధించుచుండగా గలిలయ, యూదయ దేశముల ప్రతి గ్రామమునుండి వచ్చిన పరిసయ్యులు, ధర్మశాస్త్రోపదేశకులు** అని ఉంది. వాళ్ళందరూ గలిలయలో ఉన్న ఇశ్రాయేలీయులు కారా?

అంటే గలిలయలో ఇశ్రాయేలీయులు, అన్యజనులు కలిసి ఉండేవారు. అయితే ఏసు ఇశ్రాయేలీయులకు మాత్రమే; వాళ్ళకి మాత్రమే అర్థమయ్యేలా బోధించేవాడు. (మార్కు-4:10,11,12)

**ఆయన కీర్తి సిరియా దేశమంతట వ్యాపించెను** అని ఉంది కదా. అన్యజనులకి సువార్త చెప్పకపోతే సిరియా దేశంలో కీర్తి ఎలా గడిస్తాడు? అని అడగవచ్చు.

మోషే కూడా ఐగుప్తీయుల దృష్టికి గొప్పవాడయ్యాడు (నిర్గమ-11:3 చూడండి).

మోషే ఎందుకు ఐగుప్తీయుల దృష్టికి గొప్పవాడయ్యాడు?

వారికి మేలు చేశాడనా? కాదు వాళ్ళకి కీడే చేశాడు. అయినా అతనిలో ఉన్న ప్రత్యేకతని బట్టి ఐగుప్తీయులకి గొప్పవాడయ్యాడు. అలాగే ఏసు కూడా సిరియా దేశంలో అన్యుల మధ్య కీర్తి గడించాడు.

# 19. పాత నిబంధన ప్రవచనాల మాటేమిటి?

సర్వ మానవాళి పాపక్షమాపణ నిమిత్తం ఏసు వచ్చి శిలువపై మరణిస్తాడని, ఆయన రాకకు కొన్ని వందల సంవత్సరాల ముందే ప్రవక్తలు ప్రవచించిన ప్రవచనాలు బైబిల్ పాత నిబంధనలో ఉన్నాయని క్రైస్తవ బోధకుల ప్రచారం. నిజానికి బైబిల్ పాత నిబంధనలో చెప్పబడిన రాబోవు రక్షకుడు సర్వ మానవాళి కోసం కాక, ఇశ్రాయేలీయుల కొరకు మాత్రమే అదికూడా వారిని పరాయి రాజుల దాస్యం నుంచి విడిపించి రాజ్యం తెస్తాడని మాత్రమే చెప్పబడింది. ఈ విషయాలకు సంబంధించిన వివరణలను ఇప్పటివరకు వివిధ భాగాలలో చూశాం. ఇక ప్రవచనాల పేరుతో క్రైస్తవ ప్రచారకులు ప్రచారం చేస్తున్న ఆ పాత నిబంధనలోని వాక్యాల సంగతి కూడా చూద్దాం.

మీరు ఎవరినైనా ఒక క్రైస్తవ మత బోధకున్ని ఒక మాట అడిగి చూడండి. ఏమనంటే; "పాత నిబంధనలో ఏసు గురించిన ప్రవచనాలు ఎన్ని ఉన్నాయి?" అని. అప్పుడు బోధకులలో ఎవరి సామర్థ్యాన్ని బట్టి వారు ఒక్కొక్కరు 1000, 2000, 3000, 5000 ఇలా చెప్పుకుంటూ పోతారు. అవేంటో చెప్పండని అడిగితే బైబిల్‌ని అటుతిప్పి- ఇటుతిప్పి, కిందామీద పడి 30 నుంచి 40 వాక్యాల వరకు చూపించి అప్పటికే గుడ్లు తేలేస్తారు. ఇంకా అత్యంత ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే వీరు చూపించే ఈ 30,40 వాక్యాలకి, ఏసుకి ఎలాంటి సంబంధమూ లేదు. కేవలం స్వర్గం-నరకం అనే ఆశా, భయాలను కలిగిస్తూ గ్రుడ్డి విశ్వాసం మీదే క్రైస్తవం నిలబడి ఉందన్నది నిష్ఠుర సత్యం. క్రైస్తవ ప్రచారకులు ప్రవచనాల పేరుతో చూపిస్తున్న ఆ వాక్యాల కథాకమామీషు మచ్చుకు కొన్ని చూద్దాం.

**<u>జెకర్యా-13:7</u> ఖడ్గమా నా గొర్రెల కాపరి మీదను నా సహకారి మీదను పడుము. ఇదే సైన్యములకధిపతియగు యెహోవా వాక్కు. - గొర్రెలు చెదిరిపోవునట్లు కాపరిని హతము చేయుము.**

పై వాక్యములో యెహోవా తన కాపరిని హతం చేస్తానంటున్నాడు కనుక ఆ కాపరి ఏసే. గొర్రెలు చెదిరిపోవడం అంటే ఏసు శిష్యులు ఏసుని విడిచి పారిపోవడం అని చెప్తూ, ఇది ఏసుని గురించిన ప్రవచనంగా ప్రచారం సాగిస్తున్నారు. కానీ ఆ వాక్యానికున్న పూర్వాపరాలను పరిశీలిస్తే...

**<u>జెకర్యా-11:8</u> ఒక నెలలోగా కాపరులలో ముగ్గురిని సంహరించితిని. ఏలయనగా నేను వారి విషయమై సహనము లేనివాడను కాగా వారు నా విషయమై ఆయాసపడిరి.**

అంటే ఒక నెలలో యెహోవా ముగ్గురు కాపరులను సంహరించాడంట. మరి ఈ ముగ్గురు కాపరులు ఎవరు? అలాగే...

జెకర్యా-11:15-17 ఇప్పుడు బుద్ధిలేని యొక కాపరి పనిముట్లను తీసికొమ్ము. ఏలయనగా దేశమందు నేనొక కాపరిని నియమింపబోవుచున్నాను; అతడు నశించుచున్న గొర్రెలను కనిపెట్టడు, చెదరిపోయినవాటిని వెదకడు, విరిగిపోయినదాని బాగుచేయడు, పుష్టిగా ఉన్నదాని కాపుకాయడు గాని క్రొవ్విన వాటి మాంసమును భక్షించుచు వాటి డెక్కలను తుత్తునియలగా చేయుచుండును. మందను విడనాడు పనికిమాలిన కాపరికి శ్రమ అతని చెయ్యియు కుడికన్నును తెగవేయబడును.

కాపరి అంటే రాజు లేదా నాయకుడు అనే అర్ధంలో చెప్పబడింది. అనగా ఇశ్రాయేలీయుల మీద యెహోవా నియమించిన కాపరులు ఆయన ఆజ్ఞలను తృణీకరించుచూ ప్రజల బాగోగులను పట్టించుకోకుండా విలాసాలకు అలవాటు పడ్డారు. అలాంటి పనికిమాలిన కాపరులను హతం చేస్తానంటున్నాడు యెహోవా. అంటే 13వ అధ్యాయం 7వ వచనంలో యెహోవా హతం చేస్తానన్న కాపరి ఏసే అయితే, **"ఏసు మందను విడనాడిన, యెహోవా ఆజ్ఞలను ధిక్కరించిన పనికిమాలిన కాపరి".** అని అర్థం వస్తుంది. ఇవేవి పట్టించుకోకుండా పాత నిబంధనలో ఎక్కడైనా రక్తం, శవం అనే పదాలు కనబడితే ఇక ముందూ వెనుక చూడకుండా ఆ వాక్యాలను ఏసుకి తగిలించేస్తున్నారు.

ఇక క్రైస్తవ ప్రచారకులు ఏసు శిలువ మరణాన్ని గురించిన పాత నిబంధన ప్రవచనాల్లు అంటూ చూపించేది ఎక్కువగా కీర్తనల గ్రంథంలోనుంచి. వాటి గురించి కూడా క్లుప్తంగా పరిశీలించుదాం.

కీర్తనలు-22 వ అధ్యాయాన్ని వీరు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అయితే అందులో సగం వరకు మాత్రమే వీరికి అనుకూలంగా ఉంటుంది. మిగిలిన సగం వీరికి ప్రతికూలంగా ఉంటుంది. **ఎందుకనగా అది దావీదు తనగురించి తాను చెప్పుకున్న కీర్తన.** అందులో మొదటగా తనకెదురైన కష్టాలను వివరిస్తాడు. ఆ తరువాత యెహోవా తనకి ప్రత్యుత్తరమిచ్చి తనని ఆదుకున్నాడని చెప్పాడు. ఇది మొత్తం తీసుకుంటే ఏసు శిలువపై నుంచి దేవుడికి మొరపెడితే; దేవుడు ఆలకించి ఆయన్ని రక్షించాడు అని అర్థం వస్తుంది. ఇది ఇస్లాం ప్రచారకులకు అనుకూలంగా ఉంది. కనుక వారుకూడా ఈ కీర్తనని విరివిగా ఉపయోగిస్తున్నారు. కానీ అసలు విషయమేమిటంటే దావీదు కీర్తనలన్నీ నేను పాపం చేశాను, యెహోవా నన్ను శిక్షించాడు, నాకు శ్రమ వచ్చియున్నది, నేను మొరపెట్టగా యెహోవా నన్ను ఆదుకున్నాడు. ఇదే ధోరణిలో ఉంటాయి. **వీటిని తీసుకువెళ్ళి ఏసుకి ఆపాదిస్తున్న ఇస్లాం మరియు క్రైస్తవ ప్రచారకులు ఇరువురూ కూడా ఏసు ఘోర పాపం చేశాడు అందుకే కష్టాలు వచ్చాయి అని పరోక్షంగా ధృవీకరిస్తున్నారు.**

కీర్తనలు-118:17,18 నేను చావను సజీవుడనై యెహోవా క్రియలు వివరించెదను. యెహోవా

***నన్ను కఠినముగా శిక్షించెను గాని మరణమునకు అప్పగింపలేదు.***
ఇది ఇస్లాం ప్రచారకులు ఏసుకి సంబంధించిన ప్రవచనంగా ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. మరి పై వాక్యాల ప్రకారం యెహోవా ఏసుని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎందుకొచ్చిందో కూడా వారే చెప్తే బాగుంటుంది.

**1) యెషయా 53 వ అధ్యాయం** క్రైస్తవానికున్న మూల స్తంభాలలో ఇదొకటి. బైబిల్‌పై అంతగా అవగాహన లేనివాళ్ళు చదువుతుంటే నిజంగా ఇది ఏసు గురించే చెప్పబడిందా అన్నట్లుగా ఉంటుంది. నిజానికి ఈ యెషయా 53 వ అధ్యాయానికి కూడా ఏసుతో ఎలాంటి సంబంధమూ లేదు. అది ఏసు గురించి కాకపోతే ఎవరి గురించి చెప్పబడిందో చూద్దాం.

మోషే దగ్గరనుంచి బైబిల్ ప్రవక్తలందరికీ ఉన్న ఒక అలవాటు ఏమిటంటే; ఇశ్రాయేలు సమాజమంతటినీ కలిపి ఒక వ్యక్తిగా సంబోధించడం. ఉదా: మోషే ధర్మశాస్త్రంలో అనేకసార్లు ఓ **ఇశ్రాయేలు!** అంటూ 'నీ' దేవుడైన ప్రభువు అద్వితీయుడు అనేవాడు. అంటే ఇశ్రాయేలు సమాజమంతటినీ ఉద్దేశించి ఒక వ్యక్తితో మాట్లాడుతున్నట్లుగా ఉంటుంది. ఇదే ధోరణి మిగిలిన బైబిల్ ప్రవక్తలు అనుసరించారు.

***<u>యిర్మియా-2:3</u> అప్పుడు ఇశ్రాయేలు యెహోవాకు ప్రతిష్ఠిత జనమును, ఆయన రాబడికి ప్రథమ ఫలమును ఆయెను. "అతని" లయు పరుచు వారందరూ శిక్షకు పాత్రులైరి.***

పై వాక్యంలో ఇశ్రాయేలు సమాజాన్ని ఉద్దేశించి యిర్మియా ప్రవక్త 'అతని' అనే పదాన్ని వాడాడు. ఇదేవిధంగా...

***<u>యిర్మియా-2:14</u> ఇశ్రాయేలు కొనబడిన దాసుడా? ఇంట పుట్టిన దాసుడా? కాదు గదా, "అతడేల" దోపుడు సొమ్మాయెను?***

పై వాక్యంలో కూడా ఇశ్రాయేలు సమాజాన్ని ఒక వ్యక్తిగా సంబోధించడం గమనించవచ్చు.

ఈ శైలిలోనే యెషయా ప్రవక్త కూడా ఇశ్రాయేలు సమాజాన్ని ఒక వ్యక్తిగా సంబోధిస్తూ 53వ అధ్యాయంలో ఇశ్రాయేలీయులు పడిన కష్టాలని కవితావేశంతో..

***అతడు గాయపరచబడెను***

***అతడు నలుగగొట్టబడెను***

***అతడు దౌర్జన్యమునొందెను.***

అంటూ వర్ణించాడు. అయితే ***మన యతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను, మన దోషములను బట్టి నలుగగొట్టబడెను*** అని ఉంది కదా! మరి మన అంటే ఎవరు? అతను అంటే ఎవరు? ఇక్కడ రెండు పర్సనాలిటీలు కనపడుతున్నాయి కదా! అని సందేహం వస్తుంది. బైబిల్ భాష ఎంత గందరగోళంగా ఉంటుందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

ఇక్కడ చెప్పబడిన రెండు పర్సనాలిటీలు కూడా ఇశ్రాయేలు సమాజాన్ని ఉద్దేశించి చెప్పబడినవే. ఆశ్చర్యంగా ఉంది కదూ! అదెలా కుదురుతుంది? అనుకుంటున్నారా. ఎలా కుదురుతుందో మీరే చూడండి.

బైబిల్ ప్రవక్తలకి ఇశ్రాయేలు సమాజాన్ని ఒక్కోసారి ఇద్దరు వ్యక్తులుగా సంబోధించడం కూడా అలవాటు. ఉదాహరణకు ఒక వాక్యం చూడండి.

**హోషయా-2:3 (యెహోవా ఇశ్రాయేలీయులతో) మీ తల్లి పోకిరి చూపు చూడకయు, దాని స్తనములకు పురుషులను చేర్చుకొనకయు ఉండునట్లు మీరు ఆమెతో వాదించుడి.**

ఈ వాక్యంలో ఆమె అంటే ఇశ్రాయేలు సమాజాన్నే స్త్రీగా చెప్తున్నాడు హోషయా ప్రవక్త. వెంటనే మీరు మీ తల్లితో వాదించండి అని ఇశ్రాయేలీయులతో అంటున్నాడు. అంటే ఇశ్రాయేలు సమాజాన్ని ఇద్దరు వ్యక్తులుగా పరిగణించడం కనబడుతుంది.

ఇంకా సంఖ్యాకాండం-23:21 లో **ఆయన(యెహోవా) యాకోబులో ఏ దోషమూ కనుగొనలేదు. ఇశ్రాయేలులో ఏ వంకరతనమూ చూడలేదు. అతని దేవుడైన యెహోవా అతనికి తోడైయున్నాడు.**

ఈ వాక్యములో ఇశ్రాయేలులో ఏ దోషమూ లేదు, యెహోవా అతనికి తోడైయున్నాడు అని ఉంది. కానీ **ద్వితీయోపదేశకాండం-31:27 (మోషే ఇశ్రాయేలీయులతో) నీ తిరుగుబాటును, నీ మూర్ఖత్వమును నేనెరుగుదును. నేను సజీవుడనైయుండగానే మీరు యెహోవా మీద తిరుగుబాటు చేసితిరి.**

చూశారా! పై రెండు వాక్యాలు వ్రాసింది మోషేనే. సంఖ్యాకాండంలో ఏ దోషంలేని ఇశ్రాయేలు అన్నాడు, అదే ద్వితీ లో తిరుగుబాటు, మూర్ఖత్వం కలిగిన ఇశ్రాయేలుగా వారిని సంబోధించాడు. అంటే ఇశ్రాయేలు సమాజాన్ని ఇద్దరు వ్యక్తులుగా; ఒకరు పాజిటివ్, ఇంకొకరు నెగిటివ్ వ్యక్తులుగా చూపించడం బైబిల్ ప్రవక్తలు అనుసరించిన పంథా. ఇదేవిధంగా యెషయా కూడా **మన దోషములను బట్టి అతను గాయపరచబడెను** అని రెండు వ్యక్తిత్వాల్ని చూపించాడు. ఇది యాధృచ్ఛికంగా ఏసుకి సరిపోయేలా ఉండటంతో క్రైస్తవ సమాజంలో బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. నిజానికి ఈ యెషయా 53 వ అధ్యాయానికి, ఏసుకి ఎలాంటి సంబంధమూ లేదు.

**యెషయా-53:9 అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడెను.**

ఈ వాక్యం యొక్క అర్థాన్ని పరిశీలిస్తే బైబిల్‌లో సమాధి అంటే చెరపట్టబడటం అనే అర్థంలో వాడారు. యెహెజ్కేలు-37:12-14 వచనాలలో పరాయి రాజుల వద్ద చెరలో ఉన్న ఇశ్రాయేలీయులని సమాధులలో ఉన్నవారితో పోల్చారు. కనుక యెషయా గ్రంథంలో

చెప్పబడిన భక్తిహీనులతో సమాధి నియమింపబడటం అంటే అన్యజనుల చేత ఇశ్రాయేలీయులు చెరపట్టబడటం అని అర్థం.

మొత్తం మీద క్రైస్తవులు ఎలాగైతే ఏసుకి సంబంధం లేని వాక్యాలను ఏసుకి ఆపాదిస్తున్నారో అదే సూత్రాన్ని ఇస్లాం ప్రచారకులు అనుసరిస్తున్నారు. నిజానికి ఏసు పాతనిబంధనలో చెప్పబడిన మెస్సీయ అయితే;

యెషయా-49:25, యిర్మియా-23:5-8, యెహెజ్కేలు-37:21-23, మీకా-5:2 ప్రవచనాల ప్రకారం ఇశ్రాయేలీయులని బానిసత్వం నుంచి విడిపించి వారికి రాజవ్వాలి. ఇవి క్రీస్తుని గురించిన అసలైన ప్రవచనాలు. వీటిని మాత్రం ఎవరూ పట్టించుకోకుండా ఎవరికి కావల్సినట్లుగా వారు బైబిల్‌ని వాడుకుంటున్నారు.

ఒకే బైబిల్‌లో ఒకే దేవుడైన యెహోవా తాను పంపబోయే తన కుమారుడు **ఇశ్రాయేలీయులకి రాజవుతాడని-ఇశ్రాయేలీయుల చేతిలో చనిపోతాడని** ఇలా పరస్పర విరుద్ధమైన ప్రవచనాలను ప్రవచించాడా? అయితే వీటిలో ఏదో ఒకటి మాత్రమే అమలయ్యే అవకాశం ఉంది. వీటిలో ఏది నెరవేరింది అని ఒప్పుకున్నా రెండోది అసత్యమైపోతుంది. అప్పుడు బైబిల్ దైవగ్రంథం కాదని ఋజువవుతుంది.

## ముగింపు

నిజాలను ఎవరికివారే గమనించండంటూ మొదలెట్టిన సత్యసందేశం ఇది. ఎవరో చూపించడం కాదు, ఆ గ్రంథాన్ని ఆమూలాగ్రం ఎవరికివారుగా, ఎవరిమాటా వినకుండా అధ్యయనం చేయండని ఎలుగెత్తి చెప్పిన, మా మేలుకొలుపు ప్రకటన ఇది. మా ఈ సందేశం బైబిల్‌ను, ఏసును అంటిపెట్టుకొని బ్రతికేస్తున్న ఎందరికో కంటగింపుగా, ఒళ్ళుమంటగా తయారయ్యింది. కొందరికైతే గుండెల్లో రైళ్ళు పరిగెట్టిస్తోంది, గుబులురేకెత్తిస్తోంది. ఇప్పటిదాకా, నీవు దొంగవంటే, నీవు దొంగంటూనూ, నీవు సాతాను ప్రతినిధివంటే, నీవు సాతాను ప్రతినిధి వంటూనూ, నీవు వేషధారివంటే, నీవు వేషధారివంటూనూ, ఇటు ప్రసంగాల ద్వారానేగాక, పుస్తకాలు, ఆడియో, వీడియో రికార్డింగుల ద్వారానూ, సోషల్ మీడియా ద్వారానూ తెగ రెచ్చిపోయి మాట్లాడేసుకున్న, పోట్లాడేసుకున్న గుంపులన్నీ మా ఈ పుస్తకాల, పిలుపుల దెబ్బకు ఉక్కిరిబిక్కిరైపోతున్నాయి.

బైబిలును ఎవరికివారే చదవండి. ఇప్పటివరకు మీ దృష్టికిరాని, బైబిలు బోధకులు చూపించని, దాచిపెట్టిన వివరాలు ఎన్ని ఉన్నాయో తెలుసుకోండి, మచ్చుకు కొన్ని ఇవిగో అంటూ మేము చేసిన మేలుకొలుపు పిలుపు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ మారుమ్రోగుతుండటంతోనూ, వాటిని చదివిన ప్రజలనుండి క్రమంగా ప్రశ్నలు, నిలదీయటాలూ మొదలవ్వడంతో దిక్కుతోచక అందులోని కుటిల మేధావులు కొందరు వారిలోవారికున్న పాత కక్షల్ని పక్కనపెట్టి క్రైస్తవ ఐక్యవేదికలపేరిట జాయింట్ యాక్షన్ కమిటీల ఏర్పాటు మొదలెట్టేసారు. **ఎప్పుడూ లేనివిధంగా ఐక్యతారాగం అందుకున్నారంటే వారి అంతరంగాలలో ఏదో మూలైనా అభద్రతాభావం అంకురించిందన్నమాటే.** అయితే అదే సమయంలో నిజాయితీపరులైన క్రైస్తవ విశ్వాసులు మరోవంకనుండి వీరి ఎత్తుగడలను, ఆగడాలను ఎండగడుతూనే వస్తున్నారు. ఏ మతానికి చెందిన నిజమైన విశ్వాసులెవరితోనూ మాకు విభేదాలు లేవు. ఎవరి విశ్వాసాలు వారుంచుకోవచ్చని భారతరాజ్యాంగం ఆదేశిస్తుంది గనుక. భారతీయులుగా వారంతా మాకు మిత్రులు, సోదరతుల్యులే.

**సత్యాసత్య విచారణకు మేము సర్వదాసంసిద్ధులం. అయితే...**

మా మొదటి రచన **'బైబిల్ దేవుని నిజ స్వరూపస్వభావాలు'** అందులో మేము ప్రకటించిన సత్యాసత్య విచారణకు మేము సిద్ధం అన్న ప్రకటన మా ఈ రెండో పుస్తకం **'లోకమెరుగని ఏసు మరో రూపం'**కూ వర్తిస్తుంది. నిజానికి ఆ వాగ్దానం మా రచనలన్నింటికీ సమానంగా వర్తిస్తుంది. అయితే మా మొదటి పుస్తక విషయంలో మాకెదురైన అనుభవాల దృష్ట్యా యోగ్యులూ, యోగ్యమైన వేదిక ఎదురైనప్పుడే చర్చకు, సత్యాసత్య విచారణకు

సిద్ధపడదాం, మిగిలినవాటినన్నింటిని చెత్తబుట్టలోకి ఎత్తేద్దాం అన్న నిర్ణయానికి వచ్చాం మేము. అందుకే షరతులతో కూడిన సంసిద్ధతను తెలుపుతూ ఈ ప్రకటన చేస్తున్నాము.

1) మాతో చర్చకు కూర్చోవాలంటే చర్చావేదిక నియమనిబంధనల ఏర్పాటుకు సిద్ధపడాలి.

2) ఎంపిక చేసుకున్న ప్రతిపాదనలు మినహా వేటినీ ఆ వేదికలో ప్రస్తావించరాదు.

3) కనుక ముందుగానే విచారణీయాంశాల జాబితాను ఖరారు చేసుకొని ప్రకటించాలి.

4) ఏ పక్షంలోని ఎవరూ, ఏ పక్షంలోని ఎవరిని గురించి వ్యక్తిగత ప్రస్తావనలు చేయరాదు.

5) ఒక్కో ప్రతిపాదనను తీసుకొని దాని సబబుబేసబబుల్ని విచారించాలి.

6) ఒక్కో ప్రతిపాదనపై ఆరంభమైన విచారణ ఒక ముగింపుకు రాకుండానే మరో అంశాన్ని లేవనెత్తకూడదు.

7) ఏ అంశానికాఅంశం వరకు ఎవరి పక్షం సరైందన్నది తేలిపోవాలి, నిర్ణయించు కుంటూపోవాలి.

8) కనుక చర్చావేదికలో వాదప్రతివాదులు, విశేషజ్ఞులు, నిర్ణేతలు అన్న నాలుగు పక్షాలుండాలి.


9) ప్రతిపాదకుడే తన ప్రతిపాదనని సరైందని నిరూపించే బాధ్యత వహించాలి.

10) అన్ని పక్షాలూ ఎక్కడైనా, ఎవరివైపునుండైనా నియమోల్లంఘన జరుగుతుందేమో గమనిస్తుండాలి. అలాంటిది కనపడితే నిర్ణేతల దృష్టికి తీసుకురావాలి.

12) ఇది సత్యాసత్య నిర్ణయ వేదిక కనుక ఇరుపక్షాలకు సత్యాసత్య నిర్ణయ పద్ధతి తెలుసుండాలి.

యోచనాశీలురైన చదువరులారా! మీరు ఏ ధోరణికి చెందినవారైనా, మాతో విభేదించే విషయాలపై పై నియమాలను అంగీకరిస్తూ సత్యాసత్య విచారణకు కూర్చుందామంటే మేము సిద్ధం. మావరకు మేము తప్పులని తేలినవాటిని విడిచిపెడతాం. ఒప్పులని తేలినవాటిని స్వీకరిస్తాం. ఎటూ తేలనివాటిని అప్పటికి తేలనవిగా ప్రకటించి, వాటిలో అవసరమైన వాటివరకు పరిశీలనకు స్వీకరిస్తాం. ఇదే మా వైఖరి.

భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛననుసరించి ప్రతి పౌరునికి ఏ మత గ్రంథాన్నైనా చదువుకునే హక్కు, చదివాక నచ్చితే స్వీకరించే, నచ్చకుంటే తిరస్కరించే హక్కు కూడా రాజ్యాంగంనుండే సంక్రమించింది. **కనుక ఈ దేశంలో ఏ మతస్థుడు ఏ వ్యక్తికీ మా గ్రంథంతో నీకేం పని అనిగాని, చదవద్దనిగాని, చదవకూడదనిగాని అననేకూడదు. మరో విషయం:** సత్యస్థాపన విషయంలో మేము నిర్భయులం. మేము ఎవరికీ భయపడం, ఎవరినీ భయపెట్టం. – సురేంద్ర




" ఏలి ! ఏలి ! లామా సబక్తాని "

నాదేవా ! నాదేవా !
నన్నెందుకు చేయి విడచితివి ?

" నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవుగాని,
ఇప్పుడు మీరు వాటిని సహింపలేరు. "

-యోహాను 16 : 12